జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

నీట్ కేసులో మరొకరి అరెస్టు

ఐదేళ్ళలో రెట్టింపు వాణిజ్యమే లక్ష్యం **07**
సాంకేతిక రంగంలో భారత్– స్వీడన్ బృహత్తర ప్రణాళిక

బిజెపికి దూరదృష్టి లోపించింది

సంపుటి 09, సంచిక: 169 | మంగళవారం | 19-05-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## వర్షాలు... వడగాలులు

- రాష్ట్రంలో మూడు రోజుల పాటు ఉరుములు, ఈదురు గాలులతో వానలు
- 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం : ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. ఈనెల 18 నుంచి 21 వరకు భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, తరువాయి 12లో



## అప్పు ఇచ్చిన 8 మంది హత్యకు ప్లాన్!

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో విస్తుపోయే విషయాలు

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. నిందితుల విచారణలో పలు విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమకు అప్పు ఇచ్చిన 8 మందిని చంపేందుకు కరీమా బేగం ప్లాన్ చేసింది. చంపాలని ప్లాన్ చేసిన 8 మందిలో ఇద్దరిని కరీమా బేగం దంపతులు ఇప్పటికే చంపేశారు. మరో ఆరుగురిని కూడా మర్డర్ చేసేందుకు ఫామ్‌హౌస్‌కు పిలిచారు. వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాలు దక్కాయి. ఇద్దరు మహిళల హత్య ఘటన తరువాయి 8లో

## ధాన్యం కొనుగోళ్లలో
# మందగమనం



- గత ఏడాది మే రెండవ వారానికి 54.18 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు
- ఈ ఏడాది మాత్రం 40.03 లక్షల మెట్రిక్ టన్నులే సేకరణ
- లారీలు రాక దిగుమతి కాక నిలిచిన కొనుగోళ్లు
- అకాల వర్షంతో రైతులకు కష్టాలు
- ధాన్యం త్వరగా సేకరించాలని రోడ్డెక్కిన అన్నదాత

ప్రజాపక్షం/హైదరాబాద్

గత ఏడాదితో రబీ సీజన్‌తో పోల్చితే ఈసంవత్సరం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. 2024–25 రబీలో మే 18 నాటికి 54.18 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కాగా, ఈ ఏడాది ఇదే తేదీ నాటికి కేవలం 40.03 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇది గత ఏడాది పోల్చితే 14.45 లక్షల మెట్రిక్ టన్నులు కావడం గమన్హారం. ఈ ఏడాది 30 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలు, 60 మెట్రిక్ లక్షల టన్నులు దొడ్డు రకం, మొత్తం 90లక్షల మెట్రిక్ టన్నులను ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం మేరకు కొనుగోళ్ళు ప్రక్రియ మరింత వేగవంతంగా కొనసాగాల్సి ఉండగా ఆ దీశగా మా త్రం ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యంలో కేవలం 45 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తైంది. కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రాష్ట్రంలో పలు చోట్ల రైతులు రోడ్డెక్కి ధర్నాలు, నిలరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆకాల వర్షాలతో ధాన్యాన్ని రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. లారీలు రాక కొనుగోళ్లు నిలిచిపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తరువాయి 8లో

## దేశ ఆర్థిక వ్యవస్థకు రైతులే వెన్నెముక

- వారిని ఓటు బ్యాంకుగా చూడొద్దు
- ధాన్యం సేకరణలో బిజెపి వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల మండిపాటు



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై అవలంబిస్తున్న విధానాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయని,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి నాయకుల వ్యాఖ్యల పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం స్పందించారు. రైతులను ఓటు బ్యాంకుగా కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా చూడాల్సిన అవసరముందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ భరోసా,దిగుమతుల నుంచి రక్షణ, ఉత్పత్తి వ్యయాల నియంత్రణ వంటి అంశాల్లో కేంద్రం సమగ్ర దృష్టితో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ఒక్క వరి ధాన్యానికి మాత్రమే పరిమితం చేస్తూ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి కేంద్ర మంత్రులు పదేపదే కేంద్రమే ధాన్యం సేకరిస్తోంది, అందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని కేంద్రమే భరిస్తోంది అంటూ ప్రచారం చేయడం తరువాయి 8లో

## ఉపా కేసుల్లోనూ
# బెయిలే రూల్...

జైలు మినహాయింపు: సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ :** ఉగ్రవాద నిరోధక చట్టం యుఎపిఎ (ఉపా) కేసుల్లో కూడా బెయిలే రూల్, జైలు మినహాయింపు అనే రాజ్యాంగ సూత్రం వర్తిస్తుందని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. జమ్ముకశ్మీర్‌కు చెందిన నార్కో టెర్రర్ కేసు నిందితుడు సయ్యద్ ఇఫ్తిఖార్ అంద్రాబీకి బెయిల్ మంజూరు చేస్తూ ఆ వ్యాఖ్యలు చేసింది. ఉపా కింద కఠిన నిబంధనలు ఉన్నప్పటికీ, విచారణ ఆలస్యం పేరుతో వ్యక్తిని నిరవధికంగా జైలులో ఉంచలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. అంద్రాబీ తన పాస్‌పోర్ట్‌ను సమర్పించాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి స్థానిక పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) 2020లో నమోదు చేసింది. ఉపాతో పాటు ఐపిసి వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైంది. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు పెట్టుకుని, డ్రగ్స్ స్మగ్లింగ్ ద్వారా వచ్చిన డబ్బును ఉగ్ర కార్యకలాపాలకు వినియోగించారనే ఆరోపణలు తరువాయి 12లో




ప్రపంచస్థాయి సాంకేతికతతో..
## విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

- ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, ఆస్తి నష్టాన్ని తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్ఎండిఎ గ్రౌండ్స్ వద్ద నిర్వహించిన భారీ మాక్ డ్రిల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న తరువాయి 12లో

## ఇంటింటి సర్వేతో
# పెన్షన్ అక్రమాలకు చెక్

- జాబితా నుంచి మృతుల పేర్లు తొలగింపు
- పెన్షన్ దుర్వినియోగం కాకుండా యాప్‌లో నమోదు
- మోసాలను అరికట్టేందుకు లైవ్ అథెంటికేషన్
- జిల్లా వ్యాప్తంగా 1,13,840 మంది లబ్ధిదారులు



*ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్ నిజమైన పేదవర్గాలకు మేలు చేకూర్చేలా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రక్షాళనకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలతో పాటు పట్టణ పేదిరక నిర్మూలన సంస్థ (మెప్మా) మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ద్వారా కమీషనర్లుకు ఆదేశాలు జారీ చేసారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం, టాటా కన్సల్టెనీ సర్వీసెస్ (టిసిఎస్) సంయుక్తగా టిజి ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి ఫేస్ రికగ్నైజేషన్ చేస్తున్నారు. అధార్ అథెంటికేషన్ ద్వారా కోర్ బ్యాంకింగ్ సర్వీస్ ద్వారా చేయూత లబ్ధిదారుల లైవ్ అథెంటికేషన్ నమోదు క్షేత్రస్థాయిలో గత రెండ్రోజులుగా కొనసాగుతున్నాయి.*

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్లు పక్కదారి పడుతున్న విషయాన్ని గమనించిన ప్రభుత్వం దుర్వినియోగానికి చెక్ పెట్టేందుకు ఇంటింటి సర్వే మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుండి సర్వే కొనసాగుతోంది. నెల రోజుల పాటు జరిగే ఈ సర్వేలో గతంలో పెన్షన్ పొందుతూ మృతి చెందిన వారిని జాబితా నుండి తొలగించే ప్రత్యేక ఏరివేత కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వారి ఇంటి వద్ద లైవ్‌నెస్ అథెంటికేషన్‌ను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి నిర్ధారిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జిపిఒలు, మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లు చేయూత లబ్ధిదారుల జాబితాతో గడపగడప సర్వే మొదలు పెట్టారు. జిల్లాలోని 23 మండలాల్లోని వివిధ క్యాటగిరీల్లో 113840 మంది లబ్ధిదారులు చే యూత పెన్షన్లు ప్రభుత్వం నుండి నెలనెలా అం దుకుంటున్నారు. ఇదిలా ఉండగా వీరిలో ఇప్పటికే కొందరు మృతి చెందినట్లు గుర్తించారు. కానీ వారి వారసులు డిఆర్‌డిఎ, మెప్మా వంటి విభాగాలకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచి లబ్ధిదారుల పేరున బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ సొ మ్ములు జమవుతుండగా వాటిని ఎటిఎం ద్వారా తీసుకుంటున్నారు. ఫలితంగా ఆ నోటా ఈ నోటా విషయం బయటకు పొక్కి అధికారుల దృష్టికి చేరింది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం అక్రమా న్ని అరికట్టేందుకు సర్వేకు శ్రీకారం చుట్టింది. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి లబ్ధిదారులు జీవించి ఉన్నట్లు లైవ్‌నెస్ అథెంటికేషన్ అప్‌లోడ్ చేసి అర్హులను నిర్ధారిస్తున్నారు. మరణించిన లబ్ధిదారుల పేరుతో చే యూత పెన్షన్ దుర్వినియోగానికి చెక్ పెడుతున్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు. దీంతో మరణించిన వారిని తరువాయి 12లో

## దేశ రక్షణ కోసం
# పోరుకు క్యూబన్లు సిద్ధం



దౌర్జన్యానికి దిగితే అమెరికాతో చర్చలుండవు
పోరాటం,ప్రాణ త్యాగాలకు సిద్ధం : సిఎన్ఎన్ కథనం

**హవానా:** క్యూబా రిపబ్లిక్ మాజీ అధ్యక్షుడు, క్యూబా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ మొదటికార్యదర్శి (2011–2021) రౌల్ కాస్ట్రో (94)పై క్రిమినల్ కేసులు మోపి అరెస్టు చేసేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తే అమెరికాను ప్రతిఘటించేందుకు, దేశ రక్షణపోరుకు క్యూబన్లు సన్నద్ధమవుతున్నారని సిఎన్ఎన్ వార్తాసంస్థ ఒక కథనం ప్రచురించింది. "క్యూబా వృద్ధనేత, ఫైడల్ కాస్ట్రో సోదరుడు రౌల్ కాస్ట్రోపై అమెరికా అభియోగ పత్రాలను సిద్ధం చేస్తుందని ఇటీవలికాలంలో వస్తున్న వదంతుల నేపథ్యంలో అనేకమంది క్యూబా ఉన్నతాధికారులనాతో మాట్లాడారు, వారు చెప్పిన సమాచారం ప్రకారం ఒకవేళ నిజంగా రౌల్ కాస్ట్రోపై అభియోగపత్రాలు మోపి, వెనిజులా అధ్యక్షుడు నికొలస్‌పట్ల ప్రవర్తించిన విధంగా ఏదైనా చేయాలనుకుంటే ఇక చర్చల ప్రక్రియ తరువాయి 12లో

క్యూబా–, ఉక్రేన్ సమస్యలపై నేడు
## పుతిన్–జిన్‌పింగ్ చర్చ

నిర్ణీత ప్రకారం మంగళవారం నుండీ చైనాలో రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన సందర్భంగా క్యూబా సమస్యపైనే ప్రధానంగా షీ జిన్‌పింగ్ (చైనా అధ్యక్షుడు)తో చర్చలు జరుగుతాయని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్‌ను ఉటంకిస్తూ టాస్‌వార్తాసంస్థ సోమవారం ప్రకటించింది. క్యూబాలో పరిస్థితులు రోజు రోజుకూ దిగజారిపోతున్నాయని, అమెరికా ఆంక్షలు,బెదిరింపులు, క్యూబా విప్లవనేత ఫైడల్ కాస్ట్రో సోదరుడు, మాజీ అధ్యక్షుడు రౌల్ కాస్ట్రోపై క్రిమినల్ కేసులు బనాయించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతోపాటు ఉక్రేన్‌లో యుద్ధం గురించి కూడా పుతిన్–జిన్‌పింగ్ ప్రధానంగా చర్చిస్తారని పెస్కోవ్ చెప్పారు.

## యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాది

- క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- ఎల్‌బిస్టేడియంలో యువజన, క్రీడా వారోత్సవాలు ప్రారంభం

**03**

## నక్సల్స్ రహిత దేశంగా మారుస్తాం

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
- తెలంగాణను నక్సల్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దిన పోలీసు అధికారులకు సన్మానం



## కేరళ సిఎంగా సతీశన్ ప్రమాణం

మరో 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం

- హాజరైన కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ తొలి కేబినెట్ నిర్ణయం



**తిరువనంతపురం :** కేరళలో యుడిఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. దశాబ్ద కాలంగా అధికారానికి దూరంగా కూటమి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో సోమవారం ముఖ్యమంత్రిగా వడస్సెరి దామోదర మీనన్ సతీశన్ ప్రమాణం స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేసులో ఉన్న రమేష్ చెన్నితలతో సహా, ఆయన మంత్రివర్గంలోని 20 మంది సభ్యులు కూడా తిరువనంతపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ వీరితో పదవీ ప్రమాణం చేయించారు. యుడిఎఫ్ కూటమిలో తరువాయి 8లో

## యువత, కార్యకర్తలపై సిజెఐ వ్యాఖ్యలు దారుణం

- నిరుద్యోగ యువతను బొద్దింకలు,పరాన్నజీవులుగా పోల్చడం
- తీవ్ర అభ్యంతరకరం, అమానవీయ చర్య
- ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ఖండన



**న్యూఢిల్లీ:** దేశంలో యువతరాన్ని, కార్యకర్తలను అవమానపరచేవిధంగా భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన అగౌరకరమైన వ్యాఖ్యలను ఎఐటియుసి తీవ్రంగా ఖండించింది. బొద్దింకలు, పరాన్నజీవులు అంటూ అత్యంత అమర్యాదకరంగా, అవమానించే రీతిలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు నిరుద్యోగ యువత, కార్యకర్తలలో ఉన్న చురుకైన వర్గాలను దెబ్బతీశాయని విమర్శించింది. కార్మికవర్గ ప్రజలు, కార్మిక సంఘాలకు వ్యతిరేకంగా ఆయన పక్షపాత ధోరణి చూపించడం ఇది కేవలం మొదటిసారి కాదని, ఇదే మొదటి సందర్భం కాదని పేర్కొంది. పారిశ్రామిక వృద్ధి మందకొడిగా తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
19-05-2026
www.prajapaksham.in



## కేరళలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

కేరళం రాజకీయం దేశం మొత్తంమీద విలక్షణమైంది. దీర్ఘకాలంగా కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీల నాయకత్వంలో రెండు కూటముల మధ్య ప్రతి ఐదేళ్లకూ అధికారం మారుతూ (2021 ఎన్నికలు మినహాయింపు – కమ్యూనిస్టుల ఎల్‌డిఎఫ్ వరుసగా రెండవసారి అధికారంలోకి వచ్చింది) పరిపాలన సాగుతున్న రాష్ట్రం. ముస్లిం, క్రైస్తవ మైనారిటీలు బలమైన సంఖ్యలో, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తుంటారు. 55 శాతం హిందువులు. సెక్యులరిజానికి పెట్టింది పేరు కేరళ. లక్షలమంది కేరళీయులు గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వారు తమ కుటుంబాకు పంపే విదేశీ మారక ద్రవ్యం రాష్ట్ర ఆదాయ వనరుల్లో ముఖ్యమైన భాగం. వీటన్నింటికీ మించి కమ్యూనిస్టు పార్టీలో చీలిక అనంతరం కూడా ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు కేరళ బలమైన కేంద్రంగా కొనసాగటం మరో విశేషం. రాజకీయ శక్తుల బలాబలాల్లో ఈ తులనాత్మకతే సంకీర్ణ ప్రభుత్వాలు విజయవంతంగా పనిచేయటానికి దోహదం చేస్తున్నదనవచ్చు.

ఈ నేపథ్యంలో తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 140లో 102స్థానాలు గెలుపొందిన కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) ప్రభుత్వ ముఖ్యమంత్రిగా వడస్సెరి దామోదరమీనన్ సతీశన్ సోమవారం ఉదయం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి సహా 21 మంది సభ్యులు గలిగిన మంత్రివర్గం మొత్తం ఒకేసారి ప్రమాణ స్వీకారం చేసింది. ఇది గత 60 ఏళ్ల కేరళ చరిత్రలో మొదటిసారి అంటున్నారు విశ్లేషకులు. మంత్రుల్లో 11మంది కాంగ్రెస్, 5గురు ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (అసెంబ్లీలో రెండవ పెద్ద పార్టీ), కేరళ కాంగ్రెస్, ఆర్ఎస్‌పి, కేరళ కాంగ్రెస్(జాకబ్), కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీకి చెందిన ఒక్కొక్కరు ఉన్నారు.

కేరళ రాజకీయ సంస్కృతిని అర్థం చేసుకోవటానికి సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవ వేదిక అద్దం పడుతోంది. అత్యధిక రాష్ట్రాల్లో పాలక–ప్రతిపక్ష పార్టీలు ప్రత్యర్థులుగా గాక విరోధులుగా పరిగణించుకుంటూ కనీస మర్యాదలు పాటించని పరిస్థితులు చూస్తున్నాం. కాని ఈ వేదికపై గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకరించనున్న సతీశన్, ఇతర మంత్రివర్గ సభ్యులతోపాటు కాంగ్రెస్ నాయకులు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధి, వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధి, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, తెలంగాణా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖుతోపాటు మాజీ ముఖ్యమంత్రి, కొత్త ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ఆశీనులైనారు. బిజెపి తొలిసారి మూడు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంది. మరో ఆరు సీట్లలో రెండవస్థానం పొందింది. అంతకుముందు తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను, ఒక ఎంపి స్థానాన్ని గెలుచుకుంది. కేరళలో బిజెపి ఎదుగుదలను ప్రమాదకర పరిణామంగా ప్రజాస్వామ్య పార్టీలు భావిస్తున్నాయి. దేశవ్యాప్తంగా బిజెపి అనునిత్యం కాంగ్రెస్‌ను తీవ్రమైన నిందారోపణలతో దూషిస్తున్నప్పటికీ ఆ పార్టీకి కాంగ్రెస్ పార్లమెంటరీ మర్యాద ఇవ్వటం హర్షించదగింది. ఇదీ ఈ దేశానికి అవసరమైన రాజకీయ సంస్కృతి.

అయితే ముఖ్యమంత్రి పదవికి కాంగ్రెస్ అధిష్టానం సతీశన్ ఎంపిక చేయటంలో జరిగిన జాప్యం అపార్థాలకు దారితీసినప్పటికీ, చివరకు మిత్రపక్షాలతోపాటు ప్రజల అభిప్రాయం కూడా పరిగణనలోకి రావటం విశేషం. సతీశన్‌కు ఐయుఎంఎల్ ముందుగా తోడ్పాటు ప్రకటించింది. అయినా 10 రోజుల పాటు జరిగిన జాప్యానికి వ్యతిరేకంగా కేరళలోని పలు నగరాల్లో సతీశన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ అభిమానులు ప్రదర్శనలు జరిపారు. చివరకు పోటీదార్లలో ఒకరైన కె.సి.వేణుగోపాల్ వెనక్కి తగ్గటంతో సతీశన్‌కు లైన్‌క్లియర్ అయింది. సీనియర్ నాయకుడు రమేశ్ చెన్నితల గట్టిగా పోరాడినా వెనక్కి తగ్గక తప్పలేదు. చెన్నితల సీనియారిటీని గౌరవిస్తూ ఆయన్ను ఒప్పించి మంత్రివర్గంలో చేర్చి హోంశాఖ అప్పగించారు.

మొత్తంమీద చివరకు అంతా సజావుగా జరిగినట్లు అనిపిస్తున్నా కాంగ్రెస్‌లోని గ్రూపులు యథాతథంగానే ఉన్నాయి. వేణుగోపాల్ అనుయాయులకు ఎక్కువ మంత్రి పదవులు దక్కాయని, చెన్నితల అనుయాయులు ఇద్దరికి తిరస్కరణ జరిగిందని చెప్పబడుతున్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ అభివృద్ధి, సంక్షేమంపై కేంద్రీకరించటం ఈ ప్రభుత్వం తక్షణ కర్తవ్యం. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వలె ఈ ప్రభుత్వానికి కూడా కేంద్రం నుంచి చేయూత ఆశించలేరు. రాహుల్‌గాంధి చేసిన 5 వాగ్దానాల్లో రెండు అమలులోకి తెస్తూ తొలి మంత్రివర్గ సమావేశం తీర్మానించింది. అవి – జూన్ 15 నుంచి కెఎస్ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు; ఆశా వర్కర్స్‌కు వేతనం రూ.3000 పెంపుదల. కాగా రూ.25లక్షల బీమా వంటి హామీల ను తర్వాత అమలు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రీ ప్రైమరీ స్కూళ్ల టీచర్లు(అంగన్‌వాడీలు), ఆయాలకు రూ.1000 పెంచారు. వృద్ధులకు ప్రత్యేక డిపార్టుమెంటు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

దేశవ్యాప్తంగా ఉనికి సన్నగిల్లిన కాంగ్రెస్‌పార్టీకున్న నాలుగు రాష్ట్ర ప్రభుత్వాల్లో ప్రస్తుతం దక్షిణాదిలోనే మూడు ఉన్నాయి. కాగా తమిళనాడులో ప్రభుత్వ భాగస్వామిగా ఉంది. ప్రజానుకూల పాలన ద్వారా పార్టీ పునరుజ్జీవనానికి ఈ ప్రభుత్వాలు దోహదం చేయగలవని లౌకిక, ప్రజాస్వామిక వాదులు ఆశిస్తారు. ●



### సోషల్ మీడియాను ఉపయోగించుకుని గెలిచింది

**ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని అధికార టివికె క్షేత్రస్థాయిలో పని చేయకుండానే, సోషల్ మీడియాతో పజలను ప్రభావితం చేసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది. అనేక చోట్ల కౌంటింగ్ ఏజెంట్లను కూడా నియమించలేదు. ఇలాంటి సోషల్ మీడియా ఆధారిత కార్యక్రమాలను అడ్డుకోవడానికి పార్టీ పథకాలను రూపొందించింది. 1949లో స్థాపించబడిన డిఎంకె అనేక ఎన్నికల విజయాలు, పరాజయాలు రెండింటినీ చవిచూసింది. పార్టీ ఎప్పుడూ ఒక 'ఫీనిక్స్' పక్షిలా పుంజుకుంది.**

- డిఎంకె చీఫ్ స్టాలిన్

## వేసవి సెలవుల్లో టీచర్ల కష్టాలు ఇంతింత కాదయా!

తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులు వేసవి సెలవులు రాగానే ఎంతో సంతోషం గా కుటుంబ సభ్యులతో గడపవచ్చని, తీర్థయాత్రలకు, విహార యాత్రలకు, బంధుమిత్రుల దగ్గరకు వెళ్ళవచ్చని కలలు కంటారు. మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో వకేషనల్, నాన్ వకేషనల్ డిపార్ట్మెంట్‌లంటూ రెండు ఉంటాయి. వేసవి సెలవుల్లో ఎండలు మండిపోతుండడంతో చాలామంది విద్యార్థులు ఎండ వేడిమి తీవ్రతకు తట్టుకోలేక పడిపోతుంటారు. విద్యార్థులకు దృష్టిలో పెట్టుకొని టీచర్స్‌కు వేసవి సెలవులను ఇస్తుంటారు. మిగతా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ వ్యవస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేసవి సెలవులు లేకపోవడం వలన వారికి 24 ఇ.ఎల్(వేతనంతో కూడిన సెలవులు) మంజూరు చేస్తారు. ఉపాధ్యాయులకు వేసవి సెలవులు ఉండడం వలన కేవలం ఆరు రోజుల ఇ.ఎల్‌లకు మాత్రమే పరిమితం చేయడం జరిగింది. 2025–26 విద్యా సంవత్సరం ముగిసినా జనగణన 2027(సెన్సెస్ 2027) పేరుతో టీచర్స్‌ను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని టీచర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జనగణన 2027 స్వీయ మూల్యాంకనం చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. టీచర్స్ కు మూడు దఫాలుగా మూడు రోజుల శిక్షణ ఇచ్చి ఇంటింటికి వెళ్లి జనగణన 2027 (సెన్సెస్ 2027) నిర్వహించాలని ఎన్యూమరేటర్‌లను సూపర్ వైజర్‌లను నియమించారు. మే 11 నుండి 13వరకు ఎన్యూమరేటర్‌లకు, సూపర్ వైజర్‌లకు కేటాయించిన ఇంటి నెంబర్‌లను సేకరించి నమోదు చేయాలని, కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు జంటనగరాల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జి.హెచ్. ఎం.సి)ఆదేశాలు జారీ చేశారు. మే 14 నుండి జూన్ 9 వరకు తమకు కేటాయించిన దాదాపు 150 నుండి 200 ఇండ్లను పూర్వ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సూపర్ వైజర్‌లకు ఒక్కొక్కరికి ఆరుమంది ఎన్యూమరేటర్‌లను కేటాయిం చా రు.

ప్రతి సంవత్సరం వేసవి సెలవులు ముగిసిన తర్వాత బడిబాట పేరుతో విద్యార్థులకు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలలలో చేర్పించడం, డ్రాప్ అవుట్ విద్యార్థులకు తిరిగి పాఠశాలలకు వచ్చేటట్లు చేయడం లేదా డ్రాప్ అవుట్ విద్యార్థులకు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లలో అడ్మిషన్ ఇప్పించడం, ర్యాలీలు తీయడం, ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించడం, తల్లిదండ్రుల సమావేశాలు సదస్సులు లాంటి కార్యక్రమాలు నిర్వర్తించడం చేసేవారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖను ఎవరికి కేటాయించకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారే స్వయంగా పర్యవేక్షించడంతో కొంతమంది విద్యాశాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఏప్రిల్ 14 నుండి జూన్ 17 వరకు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట పేరుతో నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు సెన్సెస్ 2027 విధులు నిర్వహిస్తునే బడిబాట కార్యక్రమంలో తప్పకుండా పాల్గొన్నాలని ఉత్తర్వులు జారీ చేస్తుండడంతో టీచర్స్ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సీనియర్ ఉపాధ్యాయులను, పదవీ విరమణకు దగ్గరగా ఉన్నఉపాధ్యాయులకు, వికలాంగులైనవారు, చంటి పిల్లలు ఉన్నవారు, ఇతరేతర ఆరోగ్య సమస్యలు ఉన్న ఉపాధ్యాయులకు జనగణన 2027 (సెన్సెస్ 2027), బడిబాట కార్యక్రమం రెండింట్లో పాల్గొన్నాలని చెప్తుండడం ఆందోళనకరం.

జనగణన 2027 కోసం వెళ్లిన ఎన్యూమరేట్‌లకు సర్ సర్వేకోసం వచ్చారేమోనని వ్యతిరేకించడం జరుగుతుంది. ఈ వ్యాస రచయిత డాక్టర్.ఎస్.విజయ భాస్కర్ కు స్థానిక శాసన సభ్యులు స్వయంగా ఫోన్ చేసి మీరు ఎన్యూమరేషన్ ఆపివేయాలని ఇది వక్ఫ్ బోర్డు స్థలమని ఎవ్వరు రావడానికి వీలు లేదని వెళ్లి పోవాలని చెప్పడం జరిగింది. ఈ వ్యాస రచయిత సమయస్ఫూర్తితో సంయమనంతో ఇది జనగణన 2027 కోసం వివరాల సేకరణ చేస్తున్నామని ఇది ఎవరికి నష్టం కలగదని చెప్పి ఊరట కలిగించారు. రెండు రోజుల క్రితం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో ముఖ్యంగా మన రాష్ట్రంలో అనేక ఉపాధ్యాయ సంఘాలు సుప్రీంకోర్టు లో కేసును ఫైల్ చేయడం, వాదనలు పూర్తి అయి జడ్జిమెంట్ రిజర్వ్ కావడం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు కొంత ఊరట కలిగించే విషయం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనగణన 2027 కోసం ప్రచారం నిర్వహించాలని, జనగణనకోసం వచ్చే ఎన్యూమరేట్‌లకు సహకరించేటట్లు అవగాహన కలిగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్, 9290826988

### డయ్యర్‌ను తలపిస్తోన్న

## నోయిడా నిరసనకారుల అణిచివేత



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

నోయిడా కార్మికుల నిరసన కేసులో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌదరి, సీనియర్ జర్నలిస్ట్ సత్యం వర్మల బెయిల్ పిటిషన్‌లు దిగువ కోర్టులలో విచారణలో ఉండగానే, వారిపై 1980 జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ)ను ప్రయోగించడం ద్వారా ఉత్తరప్రదేశ్ పోలీసులు రాజ్యాంగాన్ని, చట్టాన్ని ఘోరంగా ఉల్లంఘించారు.

వారిపై ఎన్ఎస్ఏను ఏ కారణాలతో ప్రయోగించారని తెలియచేసే పత్రాలను ఆకృతికి, సత్యంకు యుపి పోలీసులు ఉద్దేశపూర్వకంగా అందించకపోవడం దిగ్భ్రాంతికరం. ఇంతటి నిరంకుశ చట్టం కింద నిందితులను అరెస్టు చేయడానికి, నిర్బంధించడానికి గల కారణాలను పోలీసులు వారికి తెలియజేయాలని నిర్దేశించే చట్టపరమైన నిబంధనలను ఇది తీవ్ర ఉల్లంఘనే. సంబంధిత కోర్టు ముందు వారి అరెస్టుకు సంబంధించిన పత్రాలను తప్పనిసరిగా సమర్పించకుండా, లేదా నిర్బంధానికి గల కారణాలను ఆకృతి, సత్యం లేదా వారి న్యాయవాదికి తెలియజేయకుండా, ఇద్దరు బాధితులపై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ)ను ఏకపక్షంగా, ఇష్టానుసారంగా ప్రయోగించిన తీరు యుపి పోలీసుల మీడియా సెల్ ద్వారా జారీ చేసిన పత్రికా ప్రకటన ద్వారా మరింతగా బట్టబయలైంది.

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)–2019కి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చెలరేగిన తర్వాత, తన ప్రభుత్వం 'బద్లా' (ప్రతీకారం) తీర్చుకుంటుందని అపఖ్యాతితో కూడిన ప్రకటన చేసిన బిజెపి నాయకుడు యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లో చట్టాన్ని, న్యాయశాస్త్రాన్ని ఇలా ఉల్లంఘించడం జరుగుతోంది. రాజ్యాంగబద్ధంగా హామీ కలిగి, ప్రాథమిక హక్కుగా పొందుపరిచిన నిరసనలను ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం అసమ్మతివాదులపై బహిరంగ ప్రతీకార చర్యల ద్వారా అణచివేస్తోంది. మెరుగైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం నోయిడాలో చట్టబద్ధంగా నిరసన తెలిపిన అనేకమంది పేద కార్మికులను అరెస్టు చేయడం, ఆ తర్వాత ఆకృతి, సత్యంలను జైలులో పెట్టడం, వారిపై క్రూరంగా జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎఎస్ఏ)ను ప్రయోగించడం వంటివి అసమ్మతిని అణచివేయడానికి ఉద్దేశించిన ప్రభుత్వ ప్రతీకార చర్యలకు ఒక భయంకరమైన నిదర్శనం.

ఆందోళనకు సంబంధించి బి.ఆర్.అంబేద్కర్ ప్రపంచ దృష్టికోణంపై ఇది ప్రత్యక్ష దాడి చేస్తుంది. ఆయన విముక్తి నినాదమైన 'చదువుకోండి, ఆందోళన చేయండి, సంఘటితం అవ్వండి'లో అనేది ఈ ఆందోళనలో ఒక అంతర్భాగం. నిరసన చేస్తున్న కార్మికులపై శిక్షాత్మక చర్యలు, ఆకృతి, సత్యంలపై జాతీయ భద్రతా చట్టాన్ని క్రూరంగా ప్రయోగించడం వంటివి అంబేద్కర్ దార్శనికతను కాలరాస్తున్నాయి. ఈ దార్శనికతను తాము సమర్థిస్తున్నామని బిజెపి కేవలం మాటలకే పరిమితం చేస్తూ, దాని ప్రజాస్వామ్య సారాన్ని క్రమపద్ధతిలో నిర్వీర్యం చేస్తోంది. 'చదువుకోండి, ఆందోళన చేయండి, సంఘటితం అవ్వండి' అనే నినాదం మన రాజ్యాంగ పాలన వ్యవస్థకు, ప్రజాస్వామ్య భాగస్వామ్యానికి మూలస్తంభం.

నిరసనకారులు, కార్యకర్తలు, పాత్రికేయులపై ఇటువంటి కఠోరమైన శిక్షా చర్యలు గాంధీ స్వరాజ్య భావనను కూడా ఉల్లంఘిస్తున్నాయి. 1925 జనవరి 29న గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికలో ఇలా రాశారు – 'కొద్దిమంది అధికారాన్ని చేజిక్కించుకోవడంతో కాదు, అధికారాన్ని దుర్వినియోగం చేసినప్పుడు దానిని ఎదిరించే సామర్థ్యాన్ని అందరూ పెంపొందించుకోవడం ద్వారానే నిజమైన స్వరాజ్యం వస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, అధికారాన్ని నియంత్రించగల, అదుపు చేయగల వారి సామర్థ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారానే స్వరాజ్యం సాధించబడుతుంది.'



నోయిడాలో కార్మికులు రాజ్యాంగబద్ధంగా జరిపిన నిరసనలు, వారికి సంఘీభావంగా ఆకృతి, సత్యం చేపట్టిన చర్యలు, ''అధికారాన్ని దుర్వినియోగం చేసినప్పుడు దానిని ఎదిరించే సామర్థ్యం, అధికారాన్ని నియంత్రించగల, అదుపు చేయగల తమ సామర్థ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం'' అనే అంశాలలో పాతుకుపోయిన గాంధీ స్వరాజ్య దార్శనికతను ప్రతిబింబిస్తున్నాయి.

అయినప్పటికీ, గాంధీ ఈ ప్రజాస్వామ్య దార్శనికతను వెల్లడించిన వంద సంవత్సరాల తర్వాత, ఉత్తర ప్రదేశ్‌లోని అధికారులు రాజ్యాంగ విలువలను బరితెగించి ఉల్లంఘిస్తూ, ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అసమ్మతిని అణచివేస్తున్నారు. పత్రికా స్వేచ్ఛ గొంతు నొక్కుతున్నారు. ఈ బెదిరింపు, ఆందోళనకర చర్యలు, ముఖ్యంగా జాతీయ భద్రతా చట్టాన్ని ప్రయోగించడం, కేవలం 1975–77 నాటి అత్యయిక స్థితి రోజులనే కాకుండా, 1919లో పంజాబ్‌లో బ్రిటిష్ వారు విధించిన సైనిక పాలనను కూడా ఒళ్లు గగుర్పొడిచే రీతిలో గుర్తుకు తెస్తున్నాయి. ఆ సైనిక పాలన సమయంలోనే జలియన్‌వాలా బాగ్ మారణకాండ జరిగింది.

పంజాబ్‌లోని అనేక వార్తాపత్రికల సంపాదకులను, చివరికి 'ది ట్రిబ్యూన్' ట్రస్టీని కూడా అరెస్టు చేశారని, వలస పాలకులు ఎటువంటి సమర్థనా చూపకుండా ప్రముఖ వార్తాపత్రికలను మూసివేశారని మహాత్మా గాంధీ రాశారు. నేడు 2026లో యుపి పోలీసులు ఎలాంటి చట్టబద్ధమైన కారణాలను పారదర్శకంగా పేర్కొనకుండా, ఒక పాత్రికేయుడిపైనా, ఒక కార్యకర్తపైనా జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ)ను ప్రయోగించి, అదే విధమైన నీచమైన చర్యలకు పాల్పడుతున్నారు.

1919–20 మధ్య పంజాబ్‌లో బ్రిటిష్ ప్రభుత్వం పాత్రికేయులపై జరిపిన అణచివేతను, పత్రికా స్వేచ్ఛను క్రూరంగా అణచివేయడాన్ని గాంధీ 'డైయ్యరిజం' ఒళ్లు గగుర్పొడిచే రూపంగా అభివర్ణించారు. ఇదే డైయరిజం చివరికి జలియన్‌వాలా బాగ్‌లో వందలాదిమంది మారణకాండకు దారితీసింది.

ఆయన 'భయానక సిద్ధాంతం(డాక్టరీన్ ఆఫ్ ఫ్రైట్‌ఫుల్‌నెస్)' అని పిలిచిన దాని ద్వారా కొనసాగిన పాలనను ఓడించడానికి, ప్రతి పురుషుడు, మహిళా, బిడ్డకు అచంచలమైన ధైర్యం అవసరమని ఆయన బలంగా రాశారు. ఈ సిద్ధాంతం పంజాబ్‌లో దయ్యరిజం ద్వారా, పత్రికా స్వేచ్ఛ తో సహా పౌర స్వేచ్ఛలను అమానుషంగా నాశనం చేయడం ద్వారా వ్యక్తమైంది. 1919–20 మధ్య పంజాబ్‌లో బ్రిటిష్ వారి అణచివేతతో ముడిపడి ఉన్న దయ్యరిజం హింసాత్మక స్ఫూర్తి భయానక సిద్ధాంతం, నేడు 2026లో నోయిడాలో నిరసనలకు దిగిన కార్మికుల అరెస్టుల ద్వారా, ఆకృతి, సత్యంలపై జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ)ను ప్రయోగించడం ద్వారా పునరావృతమవుతున్నాయి.

ప్రజాస్వామ్య వ్యతిరేక గళాన్ని నేరంగా పరిగణించడాన్ని, కార్మికులు, ఉద్యమకారులు, పాత్రికేయులపై కఠోర చట్టాలను ఆయుధాలుగా వాడటాన్ని భారత ప్రజలు మూగ ప్రేక్షకులుగా చూస్తూ ఉండలేరు. రాజ్యాంగ హక్కులు, పౌర స్వేచ్ఛలు, పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య నిరసనల పరిరక్షణ అనేది నేడు భారతదేశ ప్రజాస్వామ్య గణతంత్ర పరిరక్షణతో విడదీయరానిదిగా మారింది. కాబట్టి, గత పన్నెండేళ్లుగా బిజెపి ప్రభుత్వం సాగిస్తున్న వ్యవస్థీకృత దాడి నుండి నిరంకుశత్వాన్ని ఎదిరించి, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, భారత భావనను కాపాడటంలో గాంధీ మాటల్లో చెప్పినట్లుగా మనం 'మొండి ధైర్యాన్ని' ప్రదర్శించాలి.

## మతమార్పిడి చెందిన క్రైస్తవ దళితులకోసం రాజ్యాంగ సవరణ అవసరం



మన్నవ హరిప్రసాద్
సిపిఐ(ఎం.ఎల్) రెడ్‌స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు, హైకోర్టు అడ్వొకేట్
82477 28296

2026 మార్చి 24,న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు షెడ్యూలు కులముల (ఎస్సి)హోదా + మత మార్పిడి కి సంబంధించింది.ఇది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కేసు. చింతాడ ఆనంద్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్. ఈ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చర్చనీయాంశమైంది.దళితులు లేదా భారత రాజ్యాంగంలో వివరించిన షెడ్యూల్ కులముల వారు (ఎస్సీలు) హిందూ మతమును వీడినట్లయితే షెడ్యూల్ కులముల వారికి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లు అమలు కావని అదేవిధంగా ఎస్సీ ఎస్టీ లపై అత్యాచారాల నిరోధక చట్టం అమలు కాదని తీర్పు ఇవ్వడం జరిగింది.

**ఈ తీర్పులో ప్రధాన అంశం**

హిందూ, సిక్కు, బౌద్ధ మతాల నుండి క్రైస్తవం లేదా ఇస్లాం వంటి మరో మతంలోకి మారిన వ్యక్తి షెడ్యూల్డ్ కాస్ట్ హోదాను, దానికి సంబంధించిన రిజర్వేషన్, షెడ్యూలు కులముల/ షెడ్యూలు తెగల అత్యాచార నిరోధక చట్టం కింద రక్షణను కొనసాగించలేరని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

**ఈ కేసు వివరాల ప్రకారం**

ఫిర్యాదుదారు చింతాడ ఆనంద్ మాదిగ కులానికి చెందినవాడని, 2021 జనవరిలో తనను కులపరంగా దూషించి దాడి చేశారని షెడ్యూల్ కులముల/షెడ్యూల్ తెగల అత్యాచార నిరోధక చట్టం కింద ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేశారు.

కానీ, కేసు పరిశోధనలో చింతాడ ఆనంద్ గత పదేళ్లుగా క్రైస్తవ మత ప్రచారకుడుగా ,బోధకుడి (పాస్టర్) గా పని చేస్తున్నాడని, ఆదివారం చర్చిలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహిస్తున్నాడని తేలింది.

కావున ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అతడు క్రైస్తవుడిగా మారినందున షెడ్యూలు కులముల/షెడ్యూలు తెగల పై అత్యాచారాల నిరోధక చట్టము వర్తించదని ప్రాథమిక సమాచార నివేదిక( ఎఫ్ఐఆర్) ని కొట్టివేసింది. సుప్రీం కోర్టు కూడా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ చింతాడ ఆనంద్ అప్పీల్‌ను కొట్టివేసింది.

**ఈ కేసులో సుప్రీం కోర్టు చెప్పిన ముఖ్య అంశాలు.**

భారత రాజ్యాంగం ఆధారంగా: ఆర్టికల్ 341 ప్రకారం షెడ్యూల్డ్ కులములను రాష్ట్రపతి నిర్దేశిస్తారు. 1950 నాటి మన రాజ్యాంగం (షెడ్యూలు కులముల) ఉత్తర్వు ప్రకారం మొదట్లో హిందువులు మాత్రమే షెడ్యూలు కుల హోదాకు అర్హులు. ఆ తరువాత భారత రాజ్యాంగ సవరణ ప్రకారం 1956లో సిక్కులు, 1990లో బౌద్ధులు చేర్చబడ్డారు.

'Profess' **అనే నిబంధన:** ఒక వ్యక్తి ఏ మతాన్ని బహిరంగంగా ఆచరిస్తున్నాడో అదే అతని మతపరమైన గుర్తింపు. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు తప్ప మరో మతాన్ని ఆచరిస్తే షెడ్యూలు కుల హోదాను కోల్పోతారు.

అందుకు కారణం, క్రైస్తవం, ఇస్లాం వంటి మతాలు సిద్ధాంతపరంగా కుల వ్యవస్థను గుర్తించవు. అందుకే మత మార్పిడి జరిగిన వెంటనే షెడ్యూల్ కుల హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలు ముగుస్తాయి.

మళ్లీ వారు పునః మత మార్పిడి జరగాలంటే, హిందూ, సిక్కు, బౌద్ధ మతంలోకి తిరిగి వస్తే, అసలు కుల గుర్తింపును నిరూపించుకోవాలి.మరియు అసలు కుల సమాజం తిరిగి స్వీకరించిందని చూపించాలి.

ఈ తీర్పు ప్రభావం షెడ్యూల్ కులముల /షెడ్యూల్ తెగలపై అత్యాచారాల నిరోధక చట్టం , రిజర్వేషన్ ప్రయోజనాలు కేవలం రాజ్యాంగంలో నిర్వచించిన మతపరమైన చట్రంలో ఉన్నవారికే వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఇది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2016లో చిన్ని అప్పారావు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కేసులో ఇచ్చిన తీర్పును కూడా అనుసరిస్తుంది.

ఇది షెడ్యూల్ కుల రిజర్వేషన్ సబ్‌క్లాసిఫికేషన్ గురించి కాదు. మత మార్పిడి తర్వాత షెడ్యూల్ కుల హోదా కొనసాగుతుందా లేదా అనే దానిపై ఇచ్చిన తీర్పు.

ఈ తీర్పు భారత రాజ్యాంగం లోని మత స్వేచ్ఛను వివరించే ఆర్టికల్స్ 25 నుండి 28 భిన్నమైనదని అభివృద్ధి కాముకులు, వామపక్షవాదులు, న్యాయకోవిదులు విశ్లేషిస్తున్నారు.

**ఈ తీర్పు నేపథ్యంలో కుల వ్యవస్థ**

భారతదేశమంటేనే గ్రామాల దేశం. గ్రామాలంటేనే వ్యవసాయంతో పాటు వ్యవసాయ వృత్తులు కులాలు ఉప కులాలు. యాంత్రికరణ లేని ప్రాచీన కాలం నుండి 16వ శతాబ్దం వరకు భారతదేశ గ్రామీణ వ్యవస్థ కుల ధర్మాన్ని అనుసరిస్తూ కులవృత్తి చేయడమే వారి బాధ్యతగా భావించేవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య,శూద్ర,అతి శూద్ర కులాలుగా వందలాది వృత్తులు వేలాది కులాలు ఉప కులాలుగా భారత సమాజం ఉన్నది. గ్రామీణ వ్యవస్థ వ్యవసాయము వృత్తిగా, వ్యవసాయ ఆధారిత వృత్తులు కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, చాకలి, మంగలి, సాలి, దేవాంగులు, చేనేత, మట్టి పని, కల్లు లేదా తాటి గీత, ఎట్టి,యానాది మొదలగు వ్యవసాయ ఆధారిత వృత్తులు చేస్తూ వేల సంవత్సరాల సంస్కృతి జీవన విధానం కలిగి ఉన్నది. భారతదేశం హిందూదేశంగా ప్రచారాన్ని పొందింది. బౌద్ధం, సిక్కు, జైన మతాలు ఇక్కడే పుట్టి వర్ధిల్లాయి. నేడు భారతదేశంలో హిందూ మతం నుండి క్రైస్తవ, బౌద్ధ, జైన మతాలలోకి మారినప్పటికీ కుల వ్యవస్థ ఆ మతాల్లో కూడా చేరింది. బౌద్ధ, జైన, సిక్కు మతాలు కూడా హిందూమతంలో అంతర్భాగంగానే చలామణి అవుతున్నాయి. ప్రపంచంలో ఏ దేశంలో లేనటువంటి 'కులం' అనే సాంఘిక వ్యవస్థ భారత దేశం యొక్క ప్రత్యేక లక్షణం. కొన్ని కులాలు ఆధిపత్య కులాలుగా ఉండగా మరికొన్ని కులాలు అణగారిన కులాలుగా అణచివేతకు గురవుతున్న కులాలుగా ఉన్నాయి. అణిచివేతకు గురవుతున్న కులాలు శ్రమ చేసే శ్రామిక కులాలు. బడుగు బలహీన వర్గాలు. సంపదను సృష్టించే ఈ కులాలు తరతరాలుగా ఆర్థిక దోపిడీకి సాంఘిక దోపిడీకి విచక్షణకు గురి అవుతున్నారు. వేద కాలంలో చాతుర్వర్ణ వ్యవస్థగా ఉన్న సాంఘిక వ్యవస్థ ఆ తరువాత పంచములను సృష్టించింది. గ్రామానికి వెలుపుల మరొక గ్రామం నిర్మించినటువంటి దేశం ప్రపంచంలో ఎక్కడా లేదు. కులానికి వృత్తికి సంబంధం ఉంది. అయితే వందలాది వృత్తులు, వేలాది కులాలు ఉన్నాయి. కులాల్లో ఉపకులాలు ఉన్నాయి. భారతదేశంలో నేడు ఉన్న కులాలు తరువాత వేలాది కులాలుగా రూపాంతరం చెందాయి. కులం జన్మతః వస్తుంది. భారతదేశంలోని హిందూ మతంలో పుట్టిన టువంటి వాడు ఏదో ఒక కులంలో పుట్టవలసిందే. ప్రపంచంలో ఏ దేశంలో లేని కుల వ్యవస్థ భారతదేశంలో ఉండటమే కాకుండా ప్రతి కులానికి ఆ కులానికి సంబంధించిన కుల సంస్కృతి కూడా ఉన్నది. ఈ కుల వ్యవస్థలో హెచ్చుతగ్గులు ఉన్న మాట ఎంత నిజమో ఏ కులానికి ఆ కులము, తామే ఆధిపత్య వాదులము అని అనుకుంటారు. ఈ కుల దొంతరలను నిచ్చెన మెట్ల కులవ్యవస్థ అని కొందరు చరిత్రకారులు నిర్వహించారు.

భారతదేశంలో కులాలు, ఉప కులాల సంఖ్య గురించి ఖచ్చితమైన అధికారిక లెక్కలేదు, ఎందుకంటే 1931 తర్వాత పూర్తి కులగణన జరగలేదు. కానీ సామాజిక శాస్త్రవేత్తలు, చారిత్రక ఆధారాల ప్రకారం అంచనాలు ఇలా ఉన్నాయి:

సుమారు 3000 కులాలు లేదా జాతులు ఉన్నాయని విస్తృతంగా అంచనా వేస్తారు. కొన్ని అంచనాల ప్రకారం 90,000 స్థానిక ఎండోగామస్ ఉప సమూహాలు కూడా ఉన్నాయి. షెడ్యూల్ కులముల వారికి రిజర్వేషన్లు కల్పించడంలో రాజ్యాంగ పెద్దలు సమచితంగానే ఆలోచించారు. వేలాది సంవత్సరాలుగా వారు దోపిడీకి పీడనకు గురయ్యారు. సాంఘిక గౌరవానికి దూరమయ్యారు. ఆర్థిక రాజకీయ సాంస్కృతికంగా వారిని అభివృద్ధి చేయటానికి రిజర్వేషన్లు ఒక మార్గము మాత్రమే! నూతన ప్రజాస్వామ్యం మాత్రమే దానికి పరిష్కారం చూపించగలదు.

షెడ్యూల్ కులము వారు మతము మార్పిడి చెందినప్పటికీ,అమలవుతున్న విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు మరియు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు జరిగే విధంగా తక్షణం 'రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది'.




# కార్మికుడు, కర్షకుడు ఇద్దరూ బాగుంటేనే రాష్ట్రం సుభిక్షం

● ఆల్ ట్రేడ్ యూనియన్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుడు, కర్షకుడు ఇద్దరూ బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో వారు ఉత్పాదక శక్తులని, తమ రక్తాన్ని శ్రమగా మార్చి రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న కార్మికులను నిర్లక్ష్యం చేయడం ఏ ప్రభుత్వానికీ మంచిది కాదని అన్నారు. బండారు వైష్ణవ్ మెమోరియల్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో 'తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల పెంపు' అంశంపై ట్రేడ్ యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్, మాజీ స్పీకర్ ఎస్.మధుసూదన చారి, మాజీ కార్మిక శాఖ మంత్రి ఇ.పెద్దిరెడ్డి, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, బిఎంఎస్, హెచ్ఎంఎస్, సిఐటియు, టిఎన్‌టియుసి, టిఆర్ఎస్‌కెవి, టియుసిఐ తదితర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేశంలోని మొత్తం శ్రామిక శక్తిలో అసంఘటిత రంగ కార్మికుల వాటా 93 శాతంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2012 సంవత్సరం నుండి ఇప్పటి వరకు కనీస వేతనాల సవరణ జరగకపోవడం చాలా దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు నాలుగు కనీస వేతన సవరణ కమిటీలు ఏర్పడినా, వాటి సిఫార్సులను ప్రభుత్వం ఇప్పటివరకు ఆమోదించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తక్షణమే త్రిసభ్య (ట్రైపార్టీ) సమావేశాలు నిర్వహించి యాజమాన్యాలు, కార్మిక సంఘాలు, ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపి కార్మికుల సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కార్మికులకు కనీసవేతం రూ.26 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు పోరాటాలు చేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కంపెనీ యాజమాన్యాల ఒత్తిడితో కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని విమర్శించారు. కనీస వేతనం అమలు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని 2047కు ముందే సాధించవచ్చని సూచించారు. సమావేశం ప్రధానంగా 2021 జూన్ నెలలో విడుదలైన ఐదు షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లకు సంబంధించిన జిఓలను వెంటనే గెజిట్‌లో ప్రచురించి, అమలులోకి తీసుకురావాలని వక్తలు డిమాండ్ చేశారు.

## తెలంగాణలో ఇంధనం, ఎల్‌పిజి అందుబాటులో ఉంది: ఓఎంసిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసి) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ ఓఎంసిలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా, సరఫరా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలో ఓఎంసిల రాష్ట్ర కోఆర్డినేటర్ వెల్లడించారు. ఈనెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధిని ఓఎంసిలు నమోదు చేశాయి. తెలంగాణలో ప్రస్తుతం డిఎసి విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. డిఎసి అమలుశాతాన్ని వంద శాతానికి చేర్చేందుకు ఓఎంసీలు, గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి.

# యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాది

● క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి
● ఎల్‌బిస్టేడియంలో యువజన, క్రీడా వారోత్సవాలు ప్రారంభం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాది అని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న యువజన, క్రీడా వారోత్సవాలను సోమవారం హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఘనంగా ప్రారంభించారు. మే 18 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ వేడుకలు కొనసాగనున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో మెగా జుంబా, 5 కిలోమీటర్ల వాక్‌థాన్, యోగా, ధ్యాన కార్యక్రమాలు నిర్వహించగా యువత, క్రీడాకారులు, యువజన సంఘాలు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎపి జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలా దేవి, ద్రోణాచార్య, అర్జున అవార్డు గ్రహీతలు, పలువురు ప్రముఖ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాక్‌థాన్‌ను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న అపజయాలకు మానసికంగా కుంగిపోవద్దని, క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. ఓటమి తర్వాత మళ్లీ లేచి నిలబడే ధైర్యాన్ని క్రీడలు నేర్పుతాయి అని అన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత్ ఆశించిన స్థాయిలో ఒలింపిక్ పతకాలు సాధించకపోవడం బాధాకరమని మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ కంటే తక్కువ జనాభా ఉన్న దక్షిణ కొరియా ఒలింపిక్స్‌లో విశేష విజయాలు సాధిస్తోందని ప్రస్తావిస్తూ, తెలంగాణ యువతలో అపార ప్రతిభ ఉందని, సరైన ప్రోత్సాహం, శిక్షణ లభిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు సీఎం కప్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు యువత ప్రతిభను వెలికితీసేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువజన, క్రీడా వారోత్సవాలు యువత ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, పారా అథ్లెట్లు, యువత, క్రీడాశాఖ అధికారులు పాల్గొని ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.

# నక్సల్స్ రహిత దేశంగా మారుస్తాం

● కేంద్ర హోం మంత్రి అమిత్‌షా
● తెలంగాణను నక్సల్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దిన పోలీసు అధికారులకు సన్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశాన్ని నక్సల్ రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. నక్సలిజం నిర్మూలనలో విశేష సేవలు అందించిన పోలీసు అధికారులను సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన సన్మానించారు. తెలంగాణను నక్సల్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో ప్రత్యేక గౌరవం అందుకున్నారు. తెలంగాణ డిజిపి సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు బి.శివధర్‌రెడ్డి, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ డిజిపి డాక్టర్ అనిల్ కుమార్, మల్కాజిగిరి కమిషనర్, మాజీ ఎస్ఐబి బి.సుమతిలను అమిత్ షా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు 2024 జనవరిలో జరిగిన సమీక్ష సమావేశంలో 2026 మార్చి 31ను లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. అప్పట్లో ఈ లక్ష్యం సాధ్యమవుతుందా అన్న సందేహాలు వ్యక్తమైనప్పటికీ, స్పష్టమైన వ్యూహంతో ముందుకెళ్లామని పేర్కొన్నారు. దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో బస్తర్ ప్రాంతాన్ని నక్సల్ రహితంగా ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది దేశ చరిత్రలో ఒక కీలక మైలురాయి అని ఆయన అన్నారు. 1970ల నుంచి మూడు తరాలపాటు దేశం నక్సలిజం సమస్యను ఎదుర్కొన్నదని, ఈ కారణంగా అనేక ప్రాంతాల్లో రక్తపాతం, అభివృద్ధి లోపం, యువత భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు ప్రతి రాష్ట్రానికి చెందిన భద్రతా సిబ్బంది నక్సలిజం వ్యతిరేక పోరాటంలో ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాల ఫలితంగానే ఈ విజయాన్ని సాధించగలిగామని అమిత్ షా పేర్కొన్నారు.

నక్సలిజం ఒక్క ప్రాంతానికే పరిమితం కాలేదని, తన స్వరాష్ట్రం గుజరాత్ సహా దేశవ్యాప్తంగా ఇది ఆందోళనకర అంశంగా మారిందని ఆయన గుర్తుచేశారు. భద్రతా బలగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేయడం వల్లే అసాధ్యమనుకున్న లక్ష్యాన్ని సాధించగలిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, భద్రతా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# మావోయిస్టు ప్రభావం క్షీణిస్తోంది

● డిజిపి సివి ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న మావోయిస్టు ప్రభావం తెలంగాణలో క్రమంగా క్షీణిస్తోందని, ఈ పరిస్థితుల్లో ఇంటెలిజెన్స్ విభాగం మారుతున్న సామాజిక, భద్రతా సవాళ్లకు అనుగుణంగా పనిచేయాలని తెలంగాణ డిజిపి సివి ఆనంద్ పేర్కొన్నారు. ప్రత్యేక ఇంటెలిజెన్స్ శాఖ (ఎస్ఐబి) కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, రాష్ట్రంలోని ప్రస్తుత మావోయిస్టు పరిస్థితులు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, ఇంటెలిజెన్స్ కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు డిజిపి ఇంటెలిజెన్స్ విజయ్‌కుమార్, ఐజిపి కార్తికేయ కూడా హాజరయ్యారు. 2024 నుంచి 2026 మధ్యకాలంలో తెలంగాణ పోలీసుల ఎదుట మొత్తం 820 మంది అండర్‌గ్రౌండ్ సిపిఐ (మావోయిస్టు) కేడర్లు లొంగిపోయారని డిజిపి వెల్లడించారు. వీరిలో నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు (సిసిఎంలు), 22 మంది స్టేట్ కమిటీ సభ్యులు (ఎస్‌సిఎంలు), ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, 45 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 173 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి మొత్తం 334 తుపాకులు స్వాధీనం అయ్యాయని, అందులో 58 ఏకే 47 రైఫిళ్లు, 48 ఇన్సాస్ రైఫిళ్లు, 50 ఎస్ఎల్ఆర్లు, 6 ఎల్ఎంజీలు సహా పలు ఆధునిక ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో మావోయిస్టు ఉద్యమాన్ని సమర్థవంతంగా అణచివేయడంలో ఎస్ఐబి కీలక పాత్ర పోషించిందని డిజిపి అభినందించారు. ఇంటెలిజెన్స్ ఆధారిత ఆపరేషన్లు, విశ్వాస నిర్మాణ చర్యలు, పునరావాస కార్యక్రమాల ద్వారా మావోయిస్టులను ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడంలో అధికారులు విశేష కృషి చేశారని కొనియాడారు. లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసం, సమాజంలో తిరిగి కలిసే ప్రక్రియకు తెలంగాణ పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని డీజీపీ హామీ ఇచ్చారు. వారిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి శిక్షణ, ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో సోషల్ మీడియా ప్రభావం, యువతలో మారుతున్న ధోరణులు, శాంతిభద్రతలపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేస్తూ ఎస్ఐబి మరింత విస్తృతమైన ఇంటెలిజెన్స్ పాత్ర పోషించాలని డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు.

# 'సింపుల్ ఇ-గవర్నెన్స్'తో ప్రజలకు మెరుగైన సేవలు

కేంద్ర కేబినెట్ సెక్రటరీ డాక్టర్ టి.వి. సోమనాథన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'సింపుల్ ఈ గవర్నెన్స్' విధానాల ద్వారా ప్రజలకు మరింత సరళమైన, మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టి.వి. సోమనాథన్ వివిధ రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తమిళనాడు ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న 'సింపుల్ ఈగవర్నెన్స్' ఈగవర్నెన్స్ విధానాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేసేందుకు ఈ విధానాన్ని అధ్యయనం చేసి, అమలు చేయడానికి ప్రయత్నించాలని సూచించారు.

**తెలంగాణ ఈ-గవర్నెన్స్ విధానంపై ప్రశంసలు**

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) కె.రామకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న ఈగవర్నెన్స్ విధానాలను కేంద్ర కేబినెట్ సెక్రెటరీకి వివరించారు. తెలంగాణలో ప్రజలకు పూర్తి పారదర్శకంగా, సులభతరంగా పౌర సేవలు అందిస్తున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ విభాగాల పనితీరును, సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ డ్యాష్ బోర్డుల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర కీలక శాఖల్లో ఈగవర్నెన్స్ ద్వారా అందిస్తున్న సేవలను ఆయన వివరించారు. తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న ఈగవర్నెన్స్ పద్ధతులపై కేంద్ర కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టి.వి. సోమనాథన్ హర్షం వ్యక్తం చేస్తూ, సిఎస్ కె.రామకృష్ణారావును అభినందించారు. 'తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈగవర్నెన్స్ విధానాన్ని కూడా అధ్యయనం చేస్తాం. ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో అవసరమైన మార్పులు చేపడతామని రామకృష్ణారావు అన్నారు. ఈ ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శులు యోగితారాణా, శీకాగోయల్, ప్రభుత్వ కార్యదర్శులు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి.గౌతం, సెర్ప్ సిఇఒ దివ్యదేవరాజ్ పాల్గొన్నారు.

# హామీ నెరవేర్చేలా కృషి చేయండి

● కూనంనేనికి రెండవ ఎఎన్‌ఎం యూనియన్ నేతలు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఎన్‌ఎంలు నియామకాలకు సంబంధించి మరో 323 పోస్టులు అదనంగా పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చేలా కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్‌ఎం యూనియన్ (ఎఐటియుసి) నేతలు విజ్ఞప్తి చేశారు. ఎఐటియుసి పోరాటాల ఫలితంగా ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించి వయోపరిమితిని 53 ఏళ్లకు పెంచడంతో పాటు అదనంగా 400 పోస్టులు పెంచి పరీక్షా నిర్వహించి ఇటీవల ఫలితాలు వెల్లడించడంతో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో కూనంనేని సాంబశివరావును యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, ఉపాధ్యక్షురాలు రాణి, నాయకులు హేమలత, శాంత, మమత, శాంత కుమారి, శకుంతల, స్వర్ణలత, ఎల్లమ్మ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. రెండవ ఎఎన్‌ఎంయుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఎఐయుటిసి ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించిన క్రమంలో నేరుగా రెగ్యులర్ చేయడం కుదరదని గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో 2023లో నియామకాలకు సంబంధించి 1531 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, యూనియన్ ఉపాధ్యక్షురాలు రాణి వివరించారు. పరీక్షలకు ముందు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహా 323 పోస్టులను అదనంగా పెంచుతున్నానని ప్రకటించారని, అయితే ఈనెల 14వ తేదీన విడుదల చేసిన ఫలితాల్లో వాటిని వెల్లడించలేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి ఈ పోస్టులను పెంచేలా కృషి చేయాలని వారు కూనంనేని సాంబశివరావును కోరారు.

# కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు కాపాడాలి

టూరిజం ఎండికి యూనియన్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ డిమాండ్ చేసింది. వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచడం, నిలిపివేసిన ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్‌లను పునరుద్ధరించడం, రిటైర్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించడం వంటి అంశాలపై యూనియన్ నాయకులు సోమవారం టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వి.ఎస్. బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మాట్లాడుతూ, 2025 నవంబర్ 25న తెలంగాణ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జీతాల పెంపు, 61 ఏళ్ల వయోపరిమితి, గ్రాట్యుటీ తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. అనంతరం యాజమాన్యం 2026 ఫిబ్రవరి నుంచి వేతనాల పెంపును అమలు చేసిందని పేర్కొన్నారు. అయితే అదే సమయంలో కాంట్రాక్ట్ కార్మికులకు ఇంతకాలంగా చెల్లిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్‌లను నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ అలవెన్స్‌లు యాజమాన్యంతో పలు దఫాల చర్చల అనంతరం అమల్లోకి వచ్చి ఫిబ్రవరి వరకు కొనసాగాయని, వాటిని నిలిపివేసిన తేదీ నుంచి మళ్లీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికుల వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచే అంశంపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ చేశారు. ఇప్పటివరకు రిటైర్ అయిన కాంట్రాక్ట్ కార్మికులకు గ్రాట్యుటీ చెల్లించలేదని, చట్టప్రకారం వారందరూ గ్రాట్యుటీకి అర్హులని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్ భవిష్యత్తు ఏమిటో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చూసుకోవాలి

● ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు ఏమిటో మాజీమంత్రి జగదీష్ రెడ్డి చూసుకోవాలని, పార్టీలో హరీశ్ రావు వర్గమా, కెటిఆర్ వర్గమా అన్నది ముందు తేల్చుకోవాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సూచించారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్‌తో టచ్‌లో ఉన్నారన్న జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. బిఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్న విషయం ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ అంతర్గతంగా తీవ్ర గందరగోళంలో ఉందని, పార్టీ పేరు విషయంలోనే స్పష్టత లేదని ఆయన ఎద్దేవా చేశారు. టిఆర్ఎస్ పేరును తిరిగి తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హరీశ్‌రావు బిజెపితో దగ్గరవ్వాలని ప్రయత్నిస్తున్నారని, ఆ విషయాలు పార్టీ నేతలకు తెలియదా అని అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. పంట కొనుగోళ్లు, రైతుల సమస్యలపై బిఆర్ఎస్ నేతలు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పెట్రో మంటలపై ఎమ్మెల్యే ఐలయ్య 'సైకిల్' శంఖారావం!

యాదగిరిగుట్ట టు కొలనుపాక.. 27 కిలోమీటర్ల మేర ప్రభుత్వ విప్ సుదీర్ఘ నిరసన ప్రదర్శన
9 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు : క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం



**ప్రజాపక్షం/యాదాద్రి :** పెరిగిన పెట్రోల్, డిజిల్ ద్వారా సామాన్యుడిపై పడుతున్న ఆర్థిక భారాన్ని నిరసిస్తూ ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య వినూత్న రీతిలో సమరశంఖం పూరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలకు నిరసనగా ఆయన సోమవారం తెల్లవారుజామునే ప్రత్యక్ష కార్యాచరణకు దిగారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానం పాదాల వద్ద నుంచి కొలనుపాక సోమేశ్వర ఆలయం వరకు సుమారు 27 కిలోమీటర్ల మేర సాగిన ఆయన 'సైకిల్ నిరసన ప్రదర్శన' స్థానికంగా రాజకీయ చర్చకు దారి తీసింది.

ఉదయం 6 గంటలకే తన నిరసన యాత్రను ప్రారంభించిన బీర్ల ఐలయ్య మార్గమధ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం కోరలు చాస్తోందని, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. 'పెరుగుతున్న ఇంధన ధరల వల్ల రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి నిరసనగా రాబోయే నెల రోజుల పాటు నా ఆలేరు నియోజకవర్గ పర్యటనల్లో అధికారిక వాహనాన్ని, ఎస్కార్ట్ వాహనాలను పూర్తిగా పక్కన పెడుతున్నాను. కేవలం ఎలక్ట్రిక్ స్కూటీల ద్వారానే ప్రజల మధ్య తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటాను.' అని ఐలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు.

**9 ధాన్యపు రాశుల వద్ద ఆకస్మిక తనిఖీ.. స్పాట్‌లోనే కలెక్టర్‌తో మాట్లాడిన విప్**

సైకిల్ యాత్ర పొడుగునా ప్రజాసమస్యలను ఆలకిస్తూ సాగిన ప్రభుత్వ విప్.. యాదగిరిపల్లి, వంగపల్లి, రామాజీపేట, పెద్ద కందుకూరు, చిన్న కందుకూరు, బాహుపేట, ఆలేరు మార్కెట్ యార్డు, కొలనుపాక సహా మొత్తం తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను (ఐకెపి సెంటర్స్) ఆకస్మికంగా సందర్శించారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం తరలింపులో జాప్యం, రవాణా అవాంతరాలు ఉన్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే.. వెంటనే స్పాట్ నుంచే జిల్లా కలెక్టర్‌తోపాటు సంబంధిత సివిల్ సప్లై అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు యంత్రాంగం వెంటనే స్పందించి, ఆ తొమ్మిది కొనుగోలు కేంద్రాలకు అదనపు లారీలను సమకూర్చి ధాన్యం రవాణా ప్రక్రియను వేగవంతం చేసింది. దీంతో రోజుల తరబడి నిరీక్షిస్తున్న అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎక్కడా నత్తనడకన సాగడానికి వీల్లేదని, పారదర్శకంగా, వేగవంతంగా ముగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల లభ్యత, గన్నీ బ్యాగులు, హమాలీల కొరత వంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి.

**రైతులను గోస పెడితే సహించేది లేదు.**

తూకాల్లో తరుగు పేరిట రైతులను మోసం చేస్తే అధికారులపై, మిల్లింగ్ నిర్వాహకులపై కఠిన క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన ఈ 27 కిలోమీటర్ల సుదీర్ఘ సైకిల్ నిరసన ప్రదర్శనలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు, కాంగ్రెస్ శ్రేణులు, రైతాంగం పాల్గొని సంఘీభావం ప్రకటించారు.


GHMC
**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
**శంషాబాద్, సర్కిల్-18.**

**REVISED NIT No.** TENDER NOTICE NIT No. 06/EEC-18/SHBD/GHMC/2026-27, Dated: 18-05-2026, **పని పేరు:** 04 పనుల కొరకు జిహెచ్ఎంసి, శంషాబాద్ సర్కిల్-18, తుక్కుగూడ వార్డు-66లో రోడ్డు భద్రత కొరకు లేన్ మార్కింగ్ మరియు సైన్ బోర్డ్స్ ఏర్పాటు.............. జిహెచ్ఎంసి, శంషాబాద్ సర్కిల్-18, శంషాబాద్‌లో కొత్త పవర్ బోర్ సబ్‌మెర్సిబుల్ పంప్‌సెట్ల సరఫరా". **అంచనా విలువ:** రూ.42.90 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 28.05.2026 @ 12:15 PM, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.కిష్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 2556-PP/CL/ADVT/2026-27, Date: 18-05-2026

తెలంగాణ ప్రభుత్వం
**చీఫ్ ఇంజనీర్-III (FAC) కార్యాలయం,**
**మిషన్ భగీరథ శాఖ, హైదరాబాద్.**

టెండర్ కోసం **3వ సారి** ప్రకటన NIT నెం.లు: 09/2026-27 (జనరల్/ఓపెన్), 10/2026-27 (జనరల్/ఓపెన్), 11/2026-27 (జనరల్/ఓపెన్), 12/2026-27 (జనరల్/ఓపెన్), 13/2026-27 **(6% STలకు రిజర్వ్ చేయబడింది)**, 14/2026-27 (జనరల్/ఓపెన్) & 15/2026-27 (జనరల్/ఓపెన్); తేదీ: 18.05.2026. రాష్ట్ర ప్రణాళిక నిధుల కింద, మొత్తం 8 పౌర నిర్మాణ పనుల (Civil Works) కోసం ఈ ప్రకటన జారీ చేయబడింది. వివిధ పనుల క్రింద మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో రెండు పనులు (రూ. 65.00 & 65.00 లక్షలు), ముదిగొండ మండలంలో రెండు పనులు (రూ. 52.45 & 60.00 లక్షలు), ఎర్రుపాలెం మండలంలో రెండు పనులు (రూ. 61.20 & 75.00 లక్షలు) మరియు వైరా నియోజకవర్గంలోని ఎన్కూరు మండలంలో ఒక పని (రూ. 70.00 లక్షలు) చొప్పున చేపట్టబడతాయి. ఈ టెండర్ పత్రాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ https://tender.telangana.gov.in లో 19.05.2026 నుండి 01.06.2026 తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. టెండర్ బిడ్లు 05.06.2026 తేదీ సాయంత్రం 4:00 గంటలకు తెరవబడతాయి.

సం/- చీఫ్ ఇంజనీర్ -III (FAC) MB, హైదరాబాద్.
DIPR R.O. No. : 2599-PP/CL/ADVT/2026-27, Date: 18-05-2026

## 23 వరకు పర్యాటక వారోత్సవాలు

### పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 18 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ దివాకర టిఎస్ పర్యాటక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 20న ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు, మే 21న జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై యుట్యూబ్ వీడియో ప్రజంటేషన్ చేసిన వారికి టూరిజం సర్టిఫికెట్లు ప్రదానం చేయబడుతుందన్నారు. మే 22న నేలకొండపల్లి బుద్ధనిస్తూపం వద్ద స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సునీల్‌రెడ్డి, తెలంగాణ టూరిజం అసిస్టెంట్ ఇంజనీర్, టూరిజం ఉద్యోగి చంద్రశేఖర్ ఆజాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో డివిజన్ల అభివృద్ధి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజల సహకారంతో డివిజన్ల అభివృద్ధికి కృషి చేసినట్లు మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు శైలజ దంపతుల డివిజన్‌లోని కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ నెల ఏడున కార్పొరేటర్ పదవి కాలం ముగిసిన సందర్భంగా గత పదేళ్లుగా ఐదు, ఆరు డివిజన్ల అభివృద్ధికి నాగండ్ల కోటేశ్వరరావు చేసిన సేవలకు గుర్తుగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు, కార్మికుల సహకారంతో డివిజన్ల అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. కార్మికులకు నిత్యం సూచనలు అందిస్తూ పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ఐదేండ్లు సహకరించిన ప్రజలకు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జవాన్ రామకృష్ణ, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ పథకాలు: ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి



**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన గిరిజన కుటుంబాల వారికి ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. సోమవారం ఐటిడిఎ సమావేశం మందిరంలో ఐటిడిఏ పరిధిలోని గిరిజన గ్రామాల నుండి తరలివచ్చిన గిరిప్రజల నుండి ఆయన వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా పథకాలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పరిష్కారానికి నోచుకోని వినతులపై నివేదికలు సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతులు పరిష్కరించాలి

### డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజల నుండి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ వెంకట్రావు అన్నారు. ఆయన సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ప్రజల నుండి పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులపై నమ్మకంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడిదాకా వచ్చిన వినతులు సమర్పిస్తుంటారని, వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అధికారులు వినతుల పరిష్కారానికి పాటుపడాలన్నారు. పరిష్కరించలేని వాటిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## పాదచారుల రక్షణకు భద్రతా చర్యలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో పాదచారుల భద్రతకు రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం తెలిపారు. ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద పాదచారుల భద్రత కోసం జీబ్రా క్రాసింగ్ లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా రోడ్డు దాటే పాదచారులకు సురక్షిత మార్గం కల్పించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాదచారులు జీబ్రా క్రాసింగ్‌లను వినియోగించుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు.

## గిరిజన గ్రామాలకు సంక్షేమ పథకాలు

### ఐటిడిఎ పిఒ రాహుల్




**ప్రజాపక్షం/భద్రాచలం :** మారుమూల దట్టమైన గిరిజన గ్రామాల అభివృద్ధికి 'జన భాగీదారీ సబ్సే దూర్ సబ్సే హేహోల్' నినాదంతో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు గ్రామాల్లోకి వస్తున్నందున గిరిజన గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఎ పిఒ రాహుల్ తెలిపారు. మే 18 నుండి 25 వరకు అధికారులు గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గిరిజన సమస్యలు తెలుసుకుని సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. జాబ్, రేషన్ కార్డులు, ధృవీకరణ పత్రాలు, వైద్య సేవలు తదితర అంశాలపై సేవలు అందించనున్నట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 130, ఖమ్మం జిల్లాలో 30 గ్రామాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు కూడా జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో నామినేటెడ్ లొల్లి

### భగ్గుమన్న రేణుకాచౌదరి
### సమన్వయలోపం శాపం కానుందా?



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అధికార కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవులు భిన్న స్వరాలకు తావిస్తున్నాయి. ఇటీవల ప్రకటించిన పదవులకు సంబంధించి సమ న్యాయం జరగటం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం లేదన్న ప్రచార నేపథ్యంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. నామినేటెడ్ పదవులకు సంబంధించి ఘాటైన విమర్శలు చేశారు. అసలైన కాంగ్రెస్ కార్యకర్తలు అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలోనూ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రేణుకా ఘాటైన విమర్శలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఐదు నియోజక వర్గాలు ఉండగా ఐదింటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. వీరిలో మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లు రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యులుగా ఉన్నారు. ఈ ముగ్గురు ప్రధాన శాఖలను నిర్వహిస్తున్నప్పటికీ సమన్వయం లేదన్న కారణంగానే సుడా చైర్మన్ సహా పలు నామినేటెడ్ పోస్టుల భర్తీపై తీవ్ర తత్సారం జరిగింది. ఎట్టకేలకు మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను సుడా చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మహ్మద్ ఖాదర్‌బాబా ఎంపికపై తుమ్మల శిబిరంలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పలు పార్టీలు మారిన వ్యక్తికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి ఇచ్చారని ఆది నుంచి కాంగ్రెస్‌ను నమ్ముకున్న వ్యక్తులకు కాకుండా వలస వ్యక్తులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఇచ్చారని పలువురు అసంతృప్తితో ఉన్నారని భద్రాచలం ట్రస్టు బోర్డుతో సహా ప్రధానమైన నియామకాలపైన చాలా మంది ఆశలు పెంచుకున్నారు. కానీ ఈ ముగ్గురిలో ఎవరికి పదవి వస్తుందో ఎవరికి మొండి చేయి చూపుతారో అర్థం కాని స్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు బిఆర్ఎస్‌లో ఉండి పెత్తనం చేసిన వారే ఇప్పుడు కాంగ్రెస్‌లోనూ చెలామణి అవుతున్నారని అప్పుడు ఇప్పుడు కాంగ్రెస్ జెండాలు మోసిన వారు తీవ్ర నిరాశకు గురవతున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలకు తావులేకున్నా ఎక్కడో ఒక సన్నని గీత విడదీస్తుందన్న భావన ప్రజల్లో ఉంది. రేణుకాచౌదరి అంతర్గత విషయాలపై చాలా కాలం తర్వాత నోరు విప్పారు. ఆమె ప్రధానంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను టార్గెట్ చేసినట్లు అవగతమవుతుంది. అత్యుత్తమ ఫలితాలను అందించిన ఖమ్మం జిల్లాలో ఈ రీతి కొనసాగితే సమన్వయ లోపం శాపంగా మారే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా విడిపోయి నాయకుల అనుచరులుగా పనిచేస్తున్నారు. తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా బాధ్యతలు చేపట్టి 40 వసంతాలు గడిచిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఖమ్మం జిల్లాకు సంబంధించిన మిగిలిన ఇద్దరు మంత్రులు, ఇద్దరు శాసన సభ్యులు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. పెద్ద ఎత్తున జరిగిన ఈ సభకు సంబంధించి తుమ్మల మినహా మిగిలిన నాయకుల అనుచరులు పాల్గొనకపోవడం భేదాభిప్రాయాలు ఉన్నాయన్న వాదనకు తావిచ్చింది. ఆది నుంచి కాంగ్రెస్‌కు బలమైన జిల్లాగా ఉన్న ఖమ్మంలో గ్రూపుల లొల్లి పలు సందర్భాల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టాన్ని చేసింది. మంత్రులుగా, శాసన సభ్యులుగా ఈ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సమయంలో పార్టీలో భిన్నాభిప్రాయాలు నష్టం చేసే పరిస్థితి ఉన్నది. అమాత్యులు ఈ విషయంపై ఆలోచించి సమన్వయం దిశగా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ అభిమానులు కోరుతున్నారు.

## పామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

### రెండు ఎకరాల్లో చెట్లు దగ్ధం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రమాదవశాత్తు పామాయిల్ తోటకు నిప్పంటుకుని రెండు ఎకరాల్లో పామాయిల్ చెట్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు ఎనిమిదేండ్ల క్రితం ఏడు ఎకరాల పామాయిల్ సాగు చేశాడు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో చెట్లకు నిప్పంటుకుని రెండు ఎకరాల్లో పామాయిల్ చెట్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి పామాయిల్ తోటకు వెళ్లి పరిశీలించారు. ఈ అగ్నిప్రమాదంలో 50 చెట్లు పూర్తిగా కాలిపోయాయని రెండు ఎకరాల్లో మిగిలిన చెట్ల కొమ్మలు కాలిపోయినట్లు తెలిపారు. చేలల్లో చెత్తను కాల్చేందుకు ఏర్పాటు చేసిన మంటల వల్ల ఈ ప్రమాదం జరిగిందా మరేవిధంగా జరిగిందో తెలియాల్సి ఉందన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. రైతులు తమ పొలాల్లో చెత్తను కాల్చే సమయంలో చుట్టు పక్కల పంట చేలకు నష్టం లేకుండా చూసుకోవాలని, ప్రమాదవశాత్తు మంటలు అంటిన వాటిని అదుపు చేసేందుకు నీళ్లు ఉంచుకోవాలని, మంటలు ఆరిపోయే వరకు మనుషులు ఉండాలని సూచించారు. తోటను పరిశీలించిన వారిలో మాజీ మండల రైతు కన్వీనర్ దొంతు సత్యనారాయణ, ఎఎంసి మాజీ డైరెక్టర్ గుండ్ల ముత్తయ్య, వార్డు సభ్యులు దంతాల వెంకటేష్, స్థానికులు నాగండ్ల పాపారావు, యర్రా చిన్నవెంకటరెడ్డి, కాళంగి వీరబాబు, బాగం గురవయ్య, బాగం కోటయ్య, మద్దుల అంజయ్య, పోతురాజు ఉపేందర్, సచ్చు వేణు, నాగయ్య ఉన్నారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

### కలెక్టర్‌కు సిపిఐ నాయకుల వినతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్‌పిటిసి దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సోమవారం జిల్లా కల్టెర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రేకులకింద నివసించేవారికి ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఎంతో ఆశతో ఎదురుచూశారని ఇళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా గుర్తించిన కొణిజర్ల మండలంలోని చిన్నగోపతి గ్రామంలో కూడా అర్హులైన వారికి ఇళ్లు రాకపోవడం విచారకరమని అన్నారు. 2005లో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఇందిరమ్మ పథకం కింద రాజకీయాలకు అతీతంగా ఇళ్లు వచ్చాయని తెలిపారు. తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు దేరంగుల లక్ష్మయ్య, తమ్మిశెట్టి ఉపేందర్, చిన్నగోపతి ఉపసర్పంచ్ తమ్మిశెట్టి విజయ, దేరంగుల దినేష్, తమ్మిశెట్టి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ కాపలాదారుగా మోదీ

### మాటలకే పరిమితమైన రేవంత్ సర్కార్
### ఈనెల 29, 30 తేదీల్లో నిరసన దినాలు
### సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** మోదీ దేశ ప్రధానిగా కాకుండా కార్పొరేట్ శక్తుల, వ్యక్తుల కాపలాదారుగా పనిచేస్తున్నారని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ ఆరోపించారు. మోదీ హయాంలో కార్పొరేట్ శక్తులు ప్రజల సొమ్మును తమవైపునకు తిప్పుకున్నాయని, దేశ సంపద ఒకరిద్దరి చేతుల్లో పోగుపడిందని ఆయన తెలిపారు. సోమవారం సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఠాగూర్ మాట్లాడుతూ దేశ ప్రజలను పొదుపు పాటించమని చెబుతున్న మోదీ 2015 నుంచి 2022 వరకు ఆయన విదేశీ ప్రయాణ ఖర్చుల కోసం రూ.762 కోట్లు ఖర్చు చేశారన్నారు. వేల కోట్ల రూపాయల విమానాల్లో ప్రయాణిస్తూ లగ్జరీ జీవితాన్ని గడుపుతూ ప్రజా ధనాన్ని వృథా చేస్తున్న మోదీ ముందు పొదుపు పాటించాలని ఠాగూర్ సూచించారు. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచారని మరోసారి పెంచేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమవుతుందని ఆయన తెలిపారు. అమెరికా గౌతమ్ అదానీ, సాజన్ అదానీలకు వ్యతిరేకంగా ఉన్న కేసులను రూ.60 లక్షల యుఎస్ డాలర్లను ఒకరి వద్ద నుంచి మరొకరి వద్ద నుంచి 120 లక్షల యుఎస్ డాలర్లు పొంది కేసులను ఉపసంహరించుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. భారతదేశ సంపదను అదానీ, అంబానీలు లూటీ చేస్తున్నారని ఠాగూర్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను లేకుండా చేయడం కోసం ప్రయత్నిస్తుందన్నారు. మీడియా స్వేచ్ఛలో ఈ దేశం 152వ స్థానానికి పడిపోయిందన్నారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్ కేవలం మాటలకే పరిమితమైందని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. బిజెపి ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా 29, 30 తేదీల్లో నిరసన దినాలు పాటించాలని మాస్‌లైన్ పిలుపునిస్తుందన్నారు. ఈ సమావేశంలో దేవవ్రత శర్మ, అజీజ్ చక్రవర్తి, ఉమాకాంత్, రాంచందర్, కె. రమా, ఉమాకాంత్, పూజారి, కె. రంగయ్య పాల్గొన్నారు.

## యువత టూరిజం అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

### టూరిజం క్లబ్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యువత టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుండి 23 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ సోమవారం టూరిజం క్లబ్ పోస్టర్‌ను తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంకిత్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాల ఉన్నాయని, యువత టూరిజం రంగంపై అవగాహన పెంచుకుని ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు యువతలో పర్యాటక ప్రదేశాల పట్ల ఆసక్తిని పెంచడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని చెప్పారు. జిల్లాలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో 23 వరకు పలు కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ, ఆర్కియాలజీ కోర్సులను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు కోర్సుల పూర్తి వివరాల కోసం 9849905722 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## తాగునీటి కోసం అల్లాడుతున్న ప్రజలు

### కూసుమంచిలో 11 రోజులుగా నీటికి కటకట
### మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల మండిపాటు



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయితీలో గత 11 రోజులుగా తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో కూసుమంచి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. గ్రామ పంచాయితీ పరిధిలో సుమారు 8000 జనాభా నివసిస్తున్నప్పటికీ సంబంధిత మిషన్ భగీరథ అధికారులు సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైపులైన్ మరమ్మతులు, మోటార్ సమస్యలు వంటి కారణాలు చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో రోజుకు కేవలం మూడు వాటర్ ట్యాంకర్ల ద్వారానే గ్రామానికి నీటిని అందిస్తున్నారు. అయితే ఆ నీరు కూడా చాలక మహిళలు, వృద్ధులు గంటల తరబడి బిందెలతో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల నీటి కోసం ప్రజల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయని సమాచారం. ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని కూసుమంచి గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తతే ప్రాణ రక్షణ

### కలెక్టర్ అంకిత్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందని, అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయడం ద్వారానే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో సోమవారం నిర్వహించిన విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు మండలంలో భారీస్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జూమ్ సమావేశం ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు చేశారు. ప్రజల ప్రాణ రక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, విపత్తుల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి మాక్ డ్రిల్‌ను సమీక్షించారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని అంబేద్కర్ నగర్ ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో పర్యటించి రెస్క్యూ, పునరావాస చర్యలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో జెడ్‌పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారం రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, పాల్వంచ సిఐ సతీష్, ఎస్ఐ మేడ ప్రసాద్, సిహెచ్‌సి పర్యవేక్షకుడు ముక్కంటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# అధికారుల సూచనలు ప్రజలు పాటించాలి

### అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను భద్రపర్చుకోవాలి
### మాక్ డ్రిల్‌ను పరిశీలించిన కలెక్టర్





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తు నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన మేరకు సోమవారం వరద ప్రమాదాల మాక్ ఎక్సర్‌సైజ్‌ను కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలు వంటి విపత్తు సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణ నష్టం నివారించవచ్చునన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇండ్లను ఖాళీ చేయరని ఈ ధోరణిలో మార్పు రావాల్సి ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్ కంట్రోల్ రూము నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏవిధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్‌బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిజిఎస్ టిడి, అగ్నిమాపక, పశుసంవర్థక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించినట్లు తెలిపారు. ఈ మాక్‌డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చునన్నారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపునకు గురవుతుందన్న సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూము సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. ఆపదమిత్ర, వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి రాంలీల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు.

వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకాలు, భూ పట్టాలు వంటి వాటిని తమ విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఖమ్మం జనరల్ ఆసుపత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్‌సైజ్ చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డిఓ శ్రీనివాస్, ఎస్‌డిఆర్ఎఫ్ ఆరవ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియదాస్, ఎన్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం చేయొద్దు: డిఎస్‌పి



ప్రజాపక్షం/ములుగు:ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం చేయవద్దని ములుగు డిఎస్‌పి ఎన్ రవీందర్ అన్నారు. సోమవారం ములుగు జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపిఎస్ ఆదేశాల మేరకు ములుగు జిల్లా వరి కొనుగోళ్లు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరగాలని ములుగు డిఎస్‌పి రవీందర్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా పౌరసరఫరాల అధికారులు, ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎఎంసి చైర్మన్, ములుగు సిఐ, ములుగు స్పెషల్ బ్రాంచ్ సిఐ, ములుగు ఎస్ఐ, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ములుగు డిఎస్‌పి రవీందర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కొనుగోలు సెంటర్లలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని వాతావరణంలో మార్పుల దృష్ట్యా రైతులు ఆందోళన చెందుతారు కావున వేగవంతంగా కొనుగోళ్లు చేయాలని దానికి కావాల్సిన అవసరాలను సివిల్ సప్లయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం నుండి మిల్లులకు ధాన్యాన్ని తరలించడానికి కావాల్సిన లారీలను కొనుగోలు కేంద్రం, సివిల్ సప్లయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ అవసరం ఉన్నాయో ముందుగానే తెలుసుకొని ఎలాంటి కొరత లేకుండా వాహనాలను సర్దుబాటు చేయాలని రవాణా శాఖ అధికారులను, లారీ అసోసియేషన్ వారిని ఆదేశించడం జరిగింది. అదేవిధంగా పోలీస్ శాఖ తరుపున ఏ విధమైన సహాయం అయిన చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి తెలిపారు.

## చేతికొచ్చే పంట అగ్గికి ఆహుతి

ఐదు ఎకరాల పామ్ ఆయిల్ తోట దగ్ధం..



ప్రజాపక్షం/గూడూరు; గూడూరు మండల పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు ఎకరాల పామ్ ఆయిల్ తోట పూర్తిగా కాలిపోవడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది.స్థానికులు వివరాల ప్రకారం కాపిడి విజయకు చెందిన 7 ఎకరాల భూమిని కాసాని వేణుమాధవరెడ్డి మునాబాగా తీసుకుని పామ్ ఆయిల్ సాగు చేస్తున్నారు. పంట దిగుబడి వచ్చే దశలో ఉండగానే ఈ ప్రమాదం చోటుచేసుకోవడం రైతును తీవ్ర ఆందోళనకు గురి చేసింది. పొలంలో మొక్కజొన్న అవశేషాలను దొల్చే సమయంలో ఒక్కసారిగా గాలి వేగంగా వీయడంతో మంటలు అదుపు తప్పి సమీపంలోని పామ్ ఆయిల్ తోటతో పాటు ఏపూరు రవీందర్ రెడ్డి మామిడి తోటలకు వ్యాపించినట్లు స్థానిక రైతులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు ఐదు ఎకరాల పామ్ ఆయిల్ తోట పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం. రైతుకు తక్షణ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని స్థానిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పొలాల్లో అవశేషాలను కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తప్పవు

ప్రజాపక్షం/గూడూరు; వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందుగానే రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ సూచించారు. గూడూరు పోలీస్ సిఐ ఎస్ఐలతో కలిసి నిర్వహించిన సమావేశంలో విత్తనాలు ఎరువులు పురుగుమందుల డీలర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అనుమతించిన ధృవీకరిత విత్తనాలనే విక్రయించాలని నకిలి విత్తనాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించేందుకు డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు కోరారు. వ్యవసాయ రంగంలో పారదర్శకత నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈసమావేశంలో మండలంలోని విత్తనాలు ఎరువులు పేరుగుమందుల డీలర్లు పాల్గొన్నారు.

## కాళేశ్వరం అటవీ ప్రాంతంలో నేషనల్ డిజాస్టర్ మాక్ డ్రిల్



ప్రజాపక్షం/కాళేశ్వరం:అడవులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని మహాదేవపూర్ సబ్ డివిజనల్ అటవీ అధికారి సందీప్ రెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని అటవీ ప్రాంతాల్లో సోమవారం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పడిదం చెరువు సమీపంలో కృత్రిమంగా నిప్పు అంటించి దానిని ఆర్పే విధానంపై మాక్ డ్రిల్ ప్రదర్శించారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, మెట్ పల్లి సర్పంచ్ వెన్నపురెడ్డి, సంజీవరెడ్డి, అటవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంత్య పుష్కరాలకు రామప్పలో ప్రత్యేక ఏర్పాట్లు, పూజలు

ప్రజాపక్షం/వెంకటాపూర్ (రామప్ప) : భూపాలపల్లి జిల్లా కాలేశ్వరంలో సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొంది ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న రామప్ప దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లతో పాటు పూజలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి ఇమ్మడి భాస్కర్ తెలిపారు. ఈనెల 21 నుండి జూన్ ఒకటో తేదీ వరకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దర్శనాలు కల్పిస్తున్నట్లు ఇఒ పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు అభిషేకములు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని అన్నారు. అంత్య పుష్కరాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇఒపేర్కొన్నారు. జంగాలపల్లి, ఘనపూర్ క్రాస్ రోడ్డు వద్ద రామప్పకు వచ్చే దారిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని అన్నారు. అత్యంత సులువుగా, వేగంగా రామప్ప దేవాలయ శైవ క్షేత్రాన్ని దర్శించుకుని తరించాలని ఇఒభాస్కర్ కోరారు.

# వ్యాయామాలతో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం

యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ, యోగా



ప్రజాపక్షం/జనగామ :వ్యాయామాలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం లభిస్తుందని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సోమవారం యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి నుండి ధర్మకంచె స్టేడియం వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు వాకింగ్, రన్నింగ్, యోగా చేయడం వలన శారీరక మార్పు, మానసిక దృఢత్వం పొందుతారన్నారు. స్ట్రాటజీ వేగం, ఎనర్జీని ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలో తెలుసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు మనకు చాలా ఉపయోగ పడతాయన్నారు. అలాగో క్రమ శిక్షణ ఓర్పు పెరుగుతాయని, గుండె జబ్బులు ప్రమాదాన్ని తగ్గించ ఊరితిత్తుల సామర్థ్యాన్ని, రోగనిరోధక శక్తిని మెరుగు పరచడమే కాకుండా మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసం పెంచుతుందన్నారు. జిల్లా కలెక్టరేట్ నుండి ధర్మకంచె స్టేడియం వరకు ఈ రన్ నిర్వయించారు. ఈ కార్యక్రమంలో డిసిపి రాజమహేంద్రనాయక్, ఆర్‌డిఒ గోపిరాం, బిసి సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

**వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం**

వయోవృద్ధుల ఆదరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రనామ్ మల్టి సర్వీస్ డే కేర్ సెంటర్‌ను జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రారంభించారు. ప్రభుత్వ సౌజన్యంతో రెడ్ క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రణామ్ సీనియర్ సిటిజన్ సెంటర్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ లవకుమార్‌రెడ్డి, డే కేర్ సెంటర్ నిర్వాహకులు కన్నా పరశురాములు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ నాయకులు ,రజనీ క్యాథరిన్ సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

**ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కాగా జనగామ జిల్లా కేంద్రం అంబేద్కర్ నగర్‌కు చెంది న కె రేణుక తన ఇల్లు మంజూరు చేయాలని, రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన జీగిరి నరేష్ ఇల్లు మం జూరు చేయాలని, యశ్వంతాపూర్ గ్రామానికి చెందిన బొట్ల మహేష్ తనకు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటిలో చోటు కల్పించాలని, లింగాలఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన ఆర్ రమ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రజావాణిలో జడ్‌పి సిఇఒ రం గారావు, మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి, సిపిఒ ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పర్యాటక వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

99 రోజుల ప్రజాపాలనలో భాగంగా ఈ నెల 18 నుండ 23 వరకు జరిగే పర్యాటక వారోత్సవాల వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ అధికారి నర్సింహారావు, జడ్‌పిసిఇఒరంగారావు, హౌసింగ్ పిడి మాత్రు నాయక్ పాల్గొన్నారు.

**మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలి**

జిల్లాలో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. లోడింగ్, అన్‌లోడ్ అంశాలు, హమాలీ తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గన్నీ బ్యాగులు, నిల్వలు, హమాలీల అందుబాటు గోదాముల సామర్థ్యం, రవాణా తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 19వేల 450 మంది రైతుల నుండి లక్షా 5వేల 12 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 97వేల 872 మెట్రిక్ టన్నుల మిల్లులకు తరలించామని, 14వేల 190 మంది రైతుల ఖాతాలో 175.32 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. మిల్లుల వద్ద ఉన్న లారీలు 118 కాగా 572 మంది హమాలీలు పని చేస్తున్నారన్నారు. 267 వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మిల్లర్ల కోసం అదనపు గోదాంలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొనుగోళ్లకు సంబంధించిన ఒపిఎంఎస్ ఎప్పటికప్పుడు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆ సమావేశంలో డిఆర్‌డిఒ భాస్కర్, మార్క్‌ఫెడ్ డిఎం చంద్రశేఖర్, డిసిఒ కోదండరాములు, డిఎంఒ రామకృష్ణ, అదనపు డిఆర్‌డిఒ నూరుద్దీన్, పౌరసరఫరాల డిఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

## చీకటాయపాలెం కొనుగోలు కేంద్రంలో రైతుల ఆందోళన

రైతులకు మద్దతుగా నిలిచిన బిఆర్‌ఎస్ నాయకులు



ప్రజాపక్షం/తొర్రూరు : మండలంలోని చీకటాయపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఆందోళన దిగారు. గత నలభై రోజులుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి వేచి చూస్తున్నా కొనుగోళ్లు పూర్తి చేయకపోవడంతో రైతులు అధికారుల తీరుప మండిపడుతూ ఆందోళన చేపట్టారు. కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తొర్రూరు తహసీల్దార్ జి.శ్రీనివాస్‌ను రైతులు నిలదీశారు. లారీల కొరత, గన్నీ బ్యాగుల సమస్యతో కొనుగోళ్లు నిలిచిపోయాయని, కాంటాలు వేసినా ధాన్యం కూడా రోజుల తరబడి కేంద్రంలోనే నిల్వ ఉండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల ముప్పుతో ధాన్యం తడిసిపోతుందనే భయంతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే లారీలను ఏర్పాటు చేసి నిల్వ ఉన్న ధాన్యాన్ని తరలించాలని కోరారు.

**రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : బిఆర్‌ఎస్**

కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులు పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వెంటనే రైతుల సమస్యను పరిష్కరించాలని బిఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చీకటాయపాలెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన నాయకులు రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతుల వద్దకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు వారి కష్టాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గన్నీ బ్యాగుల కొరత, లారీల సమస్యలతో కొనుగోళ్లు నిలిచిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్‌పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ అంకూష్, ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తండా కిష్టయ్య, సీనియర్ నాయకులు బూర్గుల వెంకన్న, ఎండి.అబ్బాస్, రాజబాబు,పులి వెంకన్న, రాంబాబు, లింగేశ్, వెంకటనర్సు, బిఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గవర్నర్‌కు సరస్వతీ పుష్కరాల ఆహ్వానం

మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేత



ప్రజాపక్షం/కాళేశ్వరం:జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఈ నెల 21 నుండి జూన్ 1 వరకు జరుగనున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలను పురస్కరించుకొని సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లను మర్యాదపూర్వకంగా కలిసి సరస్వతీ అంత్య పుష్కరాలకు ఆహ్వానించారు. ఈ సంధర్భంగా గవర్నర్ కు సరస్వతీ అంత్య పుష్కరాల ఆహ్వాన పత్రిక అందజేసారు.గత ఏడాది జరిగిన సరస్వతీ పుష్కరాల సందర్భంగా అప్పటి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు హాజరై పుష్కర పుణ్య స్నానం ఆచరించారు. కాగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెంట దేవాదాయశాఖ సలహాదారు గోవింద హరి, దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు,ఆర్ జేసి రామకృష్ణా రావు, ఆలయ ఈఓ మహేష్, వేద పండితులు వైకుంఠ పండా,అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

## ఎప్ సెట్ - 2026 ఎంట్రన్స్‌లో షైన్ విజయకేతనం

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఎప్ సెట్ 2026 ఎంట్రన్స్ ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో 2193, 2772 ర్యాంకులను సాధించి కార్పోరేట్ విద్యాసంస్థలకు సమానంగా ఫలితాలను అందజేయడం జరిగిందని. షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు మూగుల రమ, ఆరూరి కవిత ఐఐటి కోఆర్డినేటర్ మూగుల రమేష్ యాదవ్‌లు సంయుక్తంగా తెలియజేశారు. ఆదివారం విడుదల చేసిన ఎప్ సెట్ 2026 ఎంట్రన్స్ ఫలితాలలో షైన్ జూనియర్ కాలేజి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.షైన్ విద్యాసంస్థలు మొదటి నుండి జెఇఇ మెయిన్స్, నీట్, ఎప్ సెట్‌లలో అత్యుత్తమమైనటువంటి శిక్షణను వరంగల్‌లో అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులను సైతం చక్కటి అకాడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా అద్భుతమైన ఆణిముత్యాలుగా తయారుచేసి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ కేటగిరిలో 2193 ర్యాంకు సాధించిన సి.హెచ్. అజిత్ రెడ్డి (2612T08676), 2772 ర్యాంకు టి. హాసిని (2611108393) ర్యాంకులు సాధించారు. అలాగే ఇంజనీరింగ్ కేటగిరిలో 3544 ర్యాంకు యం. దీక్షిత (2625T04006), 3969 . (2623T09702), 4143 జి. సిద్దు (2622T11110), 5433 రూపశ్రీ లక్ష్మి (2624T09847), 5529 ఆర్ సౌరభ్ వర్మ, (2622T02476) ర్యాంకులు సాధించడం జరిగింది. వీరితో పాటు అగ్రికల్చర్ కేటగిరిలో 23 మంది విద్యార్థులు 20 వేలకు లోపు ర్యాంకులు , ఇంజనీరింగ్ కేటగిరిలో 31 మంది విద్యార్థులు 20 వేలకు లోపు ర్యాంకులు సాధించారనిచైర్మన్ మూగుల కుమార్ యాదవ్ తెలిపారు.అనుభవజ్ఞులైన ఆధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణ, మోటివేషన్ తో మామూలు విద్యార్థులను కూడా మెళికలు తిరిగిన విద్యార్థులుగా తీర్చిదిద్దడం జరుగుతుందని, ప్రతి విద్యార్థినిపైన వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం వలనే ఈ విజయాలు సాధించారని వారు పేర్కొన్నారు. ఈ విజయాలకు తోడ్పడిన మా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో షైన్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, పి. శ్రీనివాస్, జి. ప్రశాంత్, అధ్యాపక బృంధం విద్యార్థినీ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేస్తే సహించం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి :తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హెచ్చరించారు. భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎం. కొత్తపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, వరి ధాన్యాన్ని తూకం 40 కిలోల 900 గ్రాములు మాత్రమే వేయాలని, 43 కిలోలు ఇష్టం వచ్చినట్టు తూకం వేసి రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాంట వేయగానే రైతులకు తప్పనిసరిగా నిర్వాహకులు ట్రక్ సీట్ అందించాలని ఆదేశించారు. రైతులు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని తేమ శాతం వచ్చిన వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని వరి ధాన్యం కొనుగోలు కేంద్ర ఇన్‌చార్జ్‌కు సూచించారు. అలాగే రైతులకు ఎలాంటి కోతలు లేకుండా అధికారులు పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని ఆదేశించారు. వానాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన పరదాలను పిఎసిఎస్ ద్వారా అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా లారీలను సైతం అందుబాటులో ఉంచి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, జిల్లా సహకార అధికారి, సిఇఒ, ముఖ్య నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపు ప్రాంతాల్లో మాక్ డ్రిల్



ప్రజల రక్షణే ప్రధాన లక్ష్యం : కలెక్టర్

ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ నగరంలో ని వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం ని ర్వహించిన మాక్ ఎక్సర్‌సైజ్ (డ్రిల్)ను వివిధ శాఖల స మన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ప్రకృతి విపత్తులు, అర్బన్ ఫ్లడింగ్, పారిశ్రామిక ప్రమాదాల స మయంలో ప్రభుత్వ యంత్రాంగం ఎలా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, సహాయక చర్యలు ఎలా చేపట్టాలి అనే అంశాలపై అవగాహ న కల్పించే విధంగా ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, డిసిపికవిత, అదనపు కలెక్టర్ రవి, ఇతర ఉన్నతాధికారులు సమ్మయ్య నగర్, వివేక్‌నగర్, లష్కర్‌సింగారంలోని యూపిహెచ్‌సి ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరంలోని ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ మాక్ డ్రిల్ కొనసాగింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్), అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, పో లీస్, మున్సిపల్, వైద్య, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. స్నేహనగర్‌లో ని ఎస్వీ కన్వెన్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన స్టేజింగ్ పా యింట్ నుంచి రెస్క్యూ బృందాలు ఆయా ప్రాంతాలకు బయలుదేరాయి. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) మార్గదర్శకాల ప్రకారం టీఎన్‌జీవో స్ కాలనీ ఫేజ్2, వివేక్‌నగర్, సమ్మయ్య నగర్, ప్రగతి న గర్, గోపాలపూర్ జవహర్ కాలనీ, టీవీ టవర్ కాలనీల లో సహాయక చర్యలు చేపట్టారు. ఎమర్జెన్సీ సైరన్లు మో గిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. వివేక్‌నగర్‌లో వరద ముంపులో చిక్కుకున్న కాలనీవాసులకు డ్రోన్ల ద్వారా ఆహారం అందించి, అనంతరం రెస్క్యూ బృందాలు భవనాలపై నుంచి సురక్షితంగా కిందికి దింపి తరలించాయి. 108 అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలు, ఎస్‌డీఆర్‌ఎఫ్ ప్రత్యేక వాహనాలు రంగంలోకి దిగి అత్యవసర సేవలను అందించాయి. స్టేజింగ్ ప్రాంతంలో లైఫ్ బోట్స్, అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రాంతం ప్రధానంగా అర్బన్ ఫ్లడింగ్, ఫ్లాష్ ఫ్లడ్స్‌కు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక "ఇన్సిడెంట్ కమాండ్ పోస్ట్" ఏర్పాటు చేసి, ఒక కమాండర్ ఆధ్వర్యంలో సుమారు 12 విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. కమాండెంట్ ఎన్. రవి సారథ్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం ద్వారా విపత్తు పరిస్థితుల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన స్పందన, సహాయక చర్యల నిర్వహణపై ప్రాయోగిక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఫిషరీస్, సమయపాలన శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాపాలన...ప్రగతి ప్రణాళికతో పర్యాటక రంగానికి సరికొత్త కళ

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ప్రజాపక్షం/ములుగు:99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్‌లో పర్యాటక శాఖకు సంబంధించిన బ్రోచర్, పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజాపాలన..ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపా రు. ఇందులో భాగంగా మే 20 బుధవారం ములుగు మండలంలోని జాకారం శివాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీని ఆదేశిస్తూ పలు సూచనలు చేశారు. మే 21న గురువారం యూట్యూబర్స్ సోషల్ మీడియా, ఇన్ఫ్లుయెన్సర్స్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం సంపత్‌రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎఒ రాజ్ కుమార్, డిపిఆర్ఒ, జిల్లా స్పోర్ట్స్ అధికారి, టూరిజం శాఖ సిబ్బంది, గైడ్స్, టూరిస్ట్ పోలీస్, పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన

ప్రజాపక్షం/హనుమకొండ :వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్ హనుమాన్ నగర్‌లో రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.హనుమాన్ నగర్ ప్రాంతంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ పనులు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, ప్రజాప్రతినిధులు, స్థానిక నా యకులు,అధికారులు,కాలనీవాసులుపాల్గొన్నారు.

# ధాన్యం కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణుల పర్యవేక్షణ

నాయకులు, కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన



**ప్రజాపక్షం/కరీంనగర్:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎస్ఐఆర్, బిఎల్ఏల నియామకం, తాగునీటి సమస్య, పార్టీ నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు అవకాశం కల్పించాలి అనే ప్రధాన అంశాలపై కాంగ్రెస్ పార్టీ జిల్లా పి.ఎ.సి సమావేశంలో చర్చించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అధ్యక్షతన సోమవారం డిసిసి కార్యాలయంలో జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్న కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో సహా జిల్లాకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని, ఐకెపి సెంటర్ల వద్ద తాలు, తప్పా పేరుతో తరుగు లేకుండా కొనుగోలు జరిగేలా కాంగ్రెస్ శ్రేణులు పర్యవేక్షించాలని, రైస్ మిల్లర్లు, దళారుల మోసాలను అరికట్టడంలో చొరవ చూపడంతో పాటు జిపిఎస్ విధానం వల్ల లారీల కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై నియోజకవర్గ ఇంచార్జ్‌లు, కో–ఆర్డినేటర్లు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీసీసీ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బిఎల్ఏ–2 (బూత్ లెవెల్ ఏజెంట్)ల నియామకం వెంటనే పూర్తి చేసి, నియమించిన బీఎల్ఏల పేర్లను ప్రతి నియోజకవర్గం నుండి డిసిసి ద్వారా కలెక్టర్‌కు అందజేయాలని, బీఎల్ఏల ద్వారా స్థానికంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో ఓటర్లకు కాంగ్రెస్ శ్రేణులు సహాయం చేయాలని ఆదేశించారు.

**వేసవిలో తాగునీటి సమస్యపై సమీక్ష**

ఈ వేసవి కాలంలో అధిక ఎండల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం, పార్టీ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించడం జరిగిందని, నియోజకవర్గాల వారీగా తాగునీటి సమస్యపై కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్పొరేటర్లు, సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరినారు, ప్రజలు, మూగజీవుల కోసం ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, ఆసుపత్రుల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణ గౌడ్, ప్రణవ్ బాబు, సత్య ప్రసన్నారెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్, మోహన్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నరసింగం, నందిని ఉదయ్, భూమయ్య, నాయకులు అనిల్ కుమార్, ఎస్.ఎ మోసీన్, అహ్మద్ అలీ, వీర దేవేందర్ పటేల్, పెంట శేఖర్, సారంగ్ పాణి, పాల్గొన్నారు.

## మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటుల ఉద్యమానికి మద్దతు

ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణిలో మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితుల ఉద్యమానికి ఏఐటియుసి మద్దతు తెలుపుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన ఐక్య వేదిక కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నిర్వహించారు. సింగరేణిలో మారుపేర్లు విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంట్‌లకు ఉద్యోగాలు ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటియుసి 2024 లో యాజమాన్యం నిర్వహించిన మొదటి స్ట్రక్చర్ సమావేశంలో డిమాండ్ చేయడం జరిగిందని, ఈ విషయం లో యాజమాన్యం లీగల్ సమస్య కాబట్టి ఇది ప్రభుత్వానికి పరిష్కారం కోసం నివేదిక పంపుతామని చెప్పడం జరిగిందని,కాని ప్రభుత్వం పరిష్కారం చూపకుండా అడ్వకేట్ జనరల్ కు పంపిందని ఆయన అన్నారు. ఈ నెల 12 న సింగరేణి భవన్ లో జరిగిన అధికారుల సమావేశంలో కూడా అడగగా మళ్ళీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయం లో ఏఐటియుసి గా ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. లక్క శ్రావణ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వై.వి రావు తో పాటు కార్మిక సంఘాల నాయకులు ఐ.క్రిష్ణ, క్రాంతి కుమార్, కుమారస్వామి, పోషమల్లు,రాంమూర్తి,తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలకు ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటియుసి) మహాసభలు ఒరిస్సా లోని పూరి లో మే 20&21 తేది లలో జరుగుతున్న సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (గుర్తింపు సంఘం ఏఐటియుసి) ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ రంగు శ్రీను, సహాయ కార్యదర్శి కామ్రేడ్ మాదన మహేష్, బ్రాంచి కోశాధికారి కామ్రేడ్ ఎస్ వెంకట్ రెడ్డి, నాయకులు రెడ్డి వెంకట స్వామి, ఎ.వి.ఎస్ ప్రకాశ్ లు సోమవారం రామగుండం రైల్వే స్టేషన్ నుంచి పూరి కి బయలు దేరారు. ఇట్టి మహాసభల్లో దేశంలో ఉన్న బొగ్గు పరిశ్రమల నుంచి ఏఐటియుసి ప్రతినిధులు పాల్గొంటారని,అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై చర్చించి పోరాట కార్యక్రమాల రూపకల్పన చేస్తారని, నూతన బొగ్గు గనుల ను వేలం పాట లేకుండా, ప్రైవేట్ కు ఇవ్వకుండా ప్రభుత్వ రంగ సంస్థల కు కేటాయించే విధంగా తగు నిర్ణయాలు చేసే అవకాశం ఉందని ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. మహాసభల కు వెళుతున్న నాయకులకు ఆర్జీ వన్ బ్రాంచి కమిటీ పక్షాన ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మడ్డి ఎల్లా గౌడ్ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## బిజెపి, బిఆర్ఎస్ మధ్య ఘర్షణ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మైనర్ బాలికకు న్యాయం జరిగేదాకా ప్రజా పోరాటం ఆగదని విలువలు లేని బండి సంజయ్ కేంద్ర మంత్రివర్గం నుండి వెంటనే భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ శ్రేణులు జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్ లో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఇంకో వైపు బిజెపి శ్రేణులు గత ప్రభుత్వంలో 29 మంది విద్యార్థుల మరణానికి కారణమైన బిఆర్ఎస్ నాయకులను శిక్షించాలని ఇరువర్గాలు పరస్పరం ధర్నాకు దిగారు. ఇరు వర్గాల మధ్య చిలికి చిలికి గాలి వానల తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది, ఇరువర్గాలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మాట మాట పెరగడంతో ఇరు వర్గాల మధ్య తోపులాటకు దారితీసింది, చూస్తుండగానే ఇరు వర్గాలు దాడులకు దిగారు, ఒకరినొకరు చెప్పులు చీపుర్లు ఒకరిపై ఇంకొకరు విసురుకున్నారు. ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వెళ్లడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు, రంగంలోకి పోలీసులు దిగి ఇరు వర్గాలను చెదరగొట్టారు, స్వయంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గి.తే అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువురి కార్యకర్తలపై లాటి చార్జ్ ఝులిపించారు. నిరసనకారులను ఇరు పార్టీల కార్యకర్తలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నిరసన సంఘటనతో కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జాం ఏర్పడింది, ఎండలో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు పోలీసులు వీరిని అదుపులోకి తీసుకోవడంతో ఇరు వర్గాలు సద్దుమనిగిన తరువాత జామ్ అయిన ట్రాఫిక్ అంతరాయాన్ని పోలీసులు క్లియర్ చేశారు.

## రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలోని రైస్ మిల్లర్లు, లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చడం, ధాన్యం అన్‌లోడింగ్ తదితర అంశాలపై జిల్లాలోని రైస్ మిల్లర్లు, లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా రైస్ మిల్లులు, గోదాముల్లో ధాన్యం అన్‌లోడింగ్, కొనుగోలు కేంద్రాలకు వాహనాల తరలింపుపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాల సంఖ్య మరింత పెంచాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లర్లు తమ మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీసీఓ రామకృష్ణ, హనుమంతు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా వన్ ఇంక్లైన్ అండర్ రైల్వే బ్రిడ్జి రోడ్డు

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రమేశ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ ఇంక్లైన్ రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు అధ్వాన్నంగా తయారైందని, రోడ్డు పై పారుతున్న నీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.రోడ్డు పక్కనే చెత్త కుప్పలను తొలగించక పోవడం వల్ల వాహన దారులు దుర్వాసన తో ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు, అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు పై యైటింక్లయిన్ కాలనీ కి వెళ్ళే త్రాగు నీటి పైపు లైన్ లీకేజీ కారణంగా గ్యాలన్ ల కొద్ది నీరు వృధాగా పోవడం వల్ల రోడ్డు పై నీరు నిల్వ ఉండి బురదమయంగా మారిందని ఆయన అన్నారు. రోడ్డు పక్కన చెత్త కుప్పలు పోయకుండా, రోడ్డు పై బురద నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని మరియు ఆర్జీ వన్ అధికారులను ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు.

## ప్రజావాణికి 269 దరఖాస్తులు



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్ర మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ ధరఖాస్తులు స్వీకరించారు. కొన్ని ధరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన ధరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ ధరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 56, హుజురాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 26 ధరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా జిల్లాలో 269 ధరఖాస్తులు సమర్పించారు.

## గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/పెగడపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధించి, ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం పెగడపల్లి మండలంలో ఆయన పెగడపల్లి నుండి ఏడు మోటల పల్లె తండా వరకు రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న రెండు కిలోమీటర్ల రోడ్డు పనులను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలోని తండాలను ప్రధాన రోడ్లతో అనుసంధానం చేస్తూ లింకు రోడ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి తక్షణమే అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణానికి స్థానిక రైతులు సహకరించాలని కోరుతూ, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. పెగడపల్లి మండల రోడ్ల కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మురిసిన అవ్వ.. సామాన్యుడిలా కూరగాయలు కొన్న మంత్రి అధికార హోదా ఉన్నా, చేతిలో క్యాబినెట్ పదవి ఉన్నా ప్రజల్లో ఒకడిగా కలిసిపోవడంలోనే అసలైన తృప్తి ఉంటుందని నిరూపించారు. రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. సోమవారం పెగడపల్లి మండలంలో పర్యటించిన ఆయన, ప్రోటోకాల్ పక్కన పెట్టి సామాన్యుడిలా మారిపోయారు. మండల పర్యటన ముగించుకుని వెళ్తుండగా, కీచులాటపల్లి గ్రామంలో రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్న ఓ మహిళా వ్యాపారి మంత్రి దృష్టిని ఆకర్షించింది. వెంటనే తన కాన్వాయ్‌ను ఆపించిన మంత్రి, వాహనం దిగి నేరుగా ఆమె వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న తాజా కూరగాయలను పరిశీలించి, సామాన్య పౌరుడిలా బేరసారాలు లేకుండా కూరగాయలు కొనుగోలు చేశారు.

## రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

మార్క్ ఫెడ్ ద్వారా మక్కల కొనుగోలుతో వేల కోట్ల నష్టాల్లో తెలంగాణ ప్రభుత్వం

ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్:** జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్, బీర్ పూర్, తుంగూర్ గ్రామంలో మొక్కజొన్న వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, కొనుగోలు ప్రక్రియ కేంద్రంలో వసతి సదుపాయాలు పై రైతులను ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొక్కజొన్న కొనుగోలు పై రైతులు సంతోషం వ్యక్తం చేశారని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో వేగంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని ఇప్పటి వరకు జగిత్యాల నియోజకవర్గంలో ఒక లక్ష క్వింటాళ్ల మక్కలు కొనుగోలు జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. 2641 మంది రైతుల వద్ద నుండి 26 కోట్ల 9 లక్షల విలువైన మక్కలు కొనుగోలు చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఎఫ్.సి.ఐ మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదు అని, కేంద్ర ప్రభుత్వం మక్కలకు మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మక్కలు కొనుగోలు చేయడంతో వేల కోట్ల నష్టాల్లో ఉందని ఎమ్మెల్యే తెలిపారు. నేటి ప్రపంచీకరణ సమాజంలో ఏక్కడ మక్కలు తక్కువ ధర ఉంటే అక్కడే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారుని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినట్టుగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్.సి.ఐ ద్వారా రైతుల వద్ద నుండి మక్కలు కొనుగోలు చేయాలని, తెలంగాణ రాష్ట్రం జిఎస్టి రూపంలో కేంద్రానికి పన్నులు కడితే అందులో 40 శాతం మాత్రమే రాష్ట్రానికి నిధులు మంజూరు చేస్తుందని లక్ష్మీపూర్ గ్రామంలో సీడ్ ప్రాసెస్ యూనిట్ పూర్తి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నాను అని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు, ఎఎంసి చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ సత్తి రెడ్డి, సర్పంచులు హరీష్, రాజ్ గోపాల్, పాక్స్ చైర్మన్ నవీన్ రావు, గర్వందుల గంగన్న, మాజీ ఆత్మ చైర్మెన్ ఏలేటి రాజిరెడ్డి,యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బాపు రెడ్డి, రైతులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు.సోమవారంసుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంట గ్రామంలో మార్క్ ఫెడ్, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న,వడ్ల కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్న విషయమై అప్పటికప్పుడు ఎమ్మెల్యే విజయరమణ రావు అధికారులతో చర్చించి రైతుల సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణ రావు మాట్లాడుతూ కొనుగోళ్ల విషయంలో చిన్న చిన్న విషయాలను రాద్ధాంతం చేసి రాజకీయాలు చేయడం తగదన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎలాంటి కటింగులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరుపుతున్నట్టు చెప్పారు. అధికార యంత్రాంగంతో రైస్ మిల్లర్ పై ఒత్తిడి తెచ్చి వడ్ల దిగుమతిని చేయిస్తూ ప్రతిక్షణం పర్యవేక్షణ జరుపుతున్నామని తెలిపారు. ప్రతి చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు. మార్క్ ఫెడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మక్కలు కొనుగోలు చేస్తూ రైతులకు అండగా ఉంటుందన్నారు.ప్రభుత్వం సేకరించిన మక్కలకు మార్కెటింగ్ లేకున్నప్పటికీ నష్టాన్ని భరిస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ పాలనలో అప్పటి ప్రజాప్రతినిధుల సహకారంతో కొనుగోళ్లలో పూర్తి స్థాయిలో రైతులకు అన్యాయం జరిగిందని చెప్పారు. క్వింటాలకు 10 కిలోల చొప్పున కటింగులు జరిగాయి అన్నారు. అప్పుడు నోరు మెదపని వారు ఇప్పుడు పారదర్శకంగా కొనుగోలు జరుగుతున్నప్పటికీ రాద్ధాంతం చేయడం తగదన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, కోదాటి సాయికిరణ్, మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులుచిలుక సతీష్, రాకేష్, సీఈఓ సతీష్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు చేసి వెంటనే గోదాములకు తరలించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి వెంటనే గోదాములకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మొక్కజొన్న పంట కొనుగోలుపై సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్నను పూర్తిస్థాయిలో సేకరించి గోదాముల్లో నిల్వ చేసే ప్రక్రియలో తలెత్తుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలు, దిగుమతి గోదాముల వద్ద తగినంత హమాలీలను సమకూర్చుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను వెంట వెంటనే లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్ల ద్వారా గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గౌరీ నగేష్, రవాణా శాఖ డీటీవో రంగారావు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం మాటలు కాగితాలకే పరిమితం

బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల అర్బన్ మండలం రఘురాములకోట శివారులోని ముప్పాల చెరువు ఒర్రెలను కబ్జాకు గురి కావడాన్ని నిరసిస్తూ సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత, స్థానిక రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తొలినాళ్లలో అప్పటి ముఖ్యమంత్రి కెసీఆర్ మిషన్ కాకతీయ పేరిట చెరువుల్లో పూడిక తీసి చెరువులను పునరుద్ధరించారు అని వారు గుర్తు చేశారు. జగిత్యాల పట్టణ సరిహద్దు చెరువులు ముప్పాల చెరువు, మోతె చెరువు, కండ్లపల్లి చెరువు, చింత కుంట చెరువులు ఆక్రమణలకు గురి అవుతున్నాయని వారు పేర్కొన్నారు. చెరువు వాగులను, ఒర్రెలను మట్టితో పూడ్చి ఆక్రమణదారులు కబ్జా చేస్తున్నారని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ముప్పాల చెరువు సుమారు 100 ఎకరాల కబ్జాకు గురి అయిందని ఒర్రెలు మాయమైపోయాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులు కబ్జాకు గురి అవుతున్న పట్టించుకోవడం లేదని తక్షణమే పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గూగుల్ ఆధారిత ఫోటో ద్వారా చెరువులను 2014 నాటి పూర్వ స్థితికి తీసుకువచ్చేందుకు చెరువుల్లో పోసిన మట్టి తొలగించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత,బిఆర్ఎస్ నాయకులు దావ సురేశ్, శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు శీలం సురేందర్, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలకు సత్వరమే పరిష్కారం: కలెక్టర్

**ప్రజాపక్షం/సిద్దిపేట:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారులు తమ సమస్యల వినతులను కలెక్టర్‌కు అందచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి అందచేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. జిల్లాలో పరిష్కారం కోసం విచ్చేసిన ప్రజల నుండి వివిధ సమస్యలపై 98 దరఖాస్తులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఎస్‌డిసి వరలక్ష్మి , జిల్లా శాఖ అధికారులు తదిరులు పాల్గొన్నారు.

# నీట్ కేసులో మరొకరి అరెస్టు

• రేణుకై కెరీర్ సెంటర్ వ్యవస్థాపకుడు శివరాజ్ రఘునాథ్‌ను అదుపులోకి తీసుకున్న సిబిఐ అధికారులు



**న్యూఢిల్లీ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో అరెస్టు పర్వ కొనసాగుతోంది. సూత్రధారులు, పాత్రధారులను దర్యాప్తు సంస్థ అధికారులు అదుపులోకి తీసుకుంటున్నారు. తాజాగా నీట్ యుజి పేపర్ లీక్‌లో ప్రమేయం ఉందనే ఆరోపణలపై రేణుకై కెరీర్ సెంటర్ వ్యవస్థాపకుడు శివరాజ్ రఘునాథ్ మోటెగావ్‌కర్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు సిబిఐ అధికారులు సోమవారం తెలిపారు. ఈనెల 3న జరిగిన పరీక్షకు సంబంధించిన లీకైన ప్రశ్నపత్రాన్ని అతని నివాసంలో సోదాలు నిర్వహించినప్పుడు అతని వ్యక్తిగత మొబైల్ ఫోన్ నుండి స్వాధీనం చేసుకున్న తర్వాత, ఆదివారం సాయంత్రం మోటెగావ్‌కర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. పేపర్ లీకేజీ, వ్యాప్తిలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత ముఠాలో మోటెగావ్‌కర్ ఒక క్రియాశీల సభ్యుడు అని అధికారులు ఆరోపించారు. దేశవ్యాప్తంగా, విదేశాలలో అత్యంత కీలకమైన ఈ పరీక్ష జరగడానికి దాదాపు 10 రోజుల ముందు, ఇతర నిందితులతో కలిసి పన్నిన కుట్రలో భాగంగా మోటెగావ్‌కర్ ప్రశ్నపత్రం, జవాబులను అందుకున్నారని అరెస్టుకు గల కారణాలలో ఏజెన్సీ పేర్కొంది. స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో తొలగించబడిన డేటా ఏదైనా ఉంటే దానిని తిరిగి పొందేందుకు, దానిని ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపుతామని వారు తెలిపారు. లీకైన ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల కాపీలను మోటెగావ్‌కర్ చేతిరాత నోట్ల రూపంలో పలువురికి అందించారని, పరీక్ష జరిగిన తర్వాత వాటిని ధ్వంసం చేశారని ఏజెన్సీ ఆరోపించింది. ఆదివారం మధ్యాహ్నం లాతూర్‌లోని శివనగర్ ప్రాంతంలో ఉన్న కోచింగ్ సెంటర్‌లో ఏజెన్సీ సోదాలు నిర్వహించింది. శుక్రవారం అదే ప్రాంతంలోని అతని నివాసంలో మోటెగావ్‌కర్‌ను దాదాపు ఎనిమిది గంటల పాటు ప్రశ్నించారు. సిబిఐ కస్టడీలో ఉన్న మనీషా వాఘ్మారే అనే మహిళ ద్వారా ఒకరికొకరు పరిచయమైన కెమిస్ట్రీ లెక్చరర్ పివి కులకర్ణి ని, బయాలజీ లెక్చరర్ మనీషా మంధారేను ఏజెన్సీ ఇంతకు ముందే అరెస్టు చేసింది.

**ఎన్‌టిఎ చైర్‌పర్సన్‌కు పార్లమెంటరీ కమిటీ సమన్లు**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)లో సంస్కరణల అమలు, నీట్‌యుజి 2026 పేపర్ లీక్ కేసును సమీక్షించాలని పార్లమెంటరీ కమిటీ నిర్ణయించింది. ఈ చర్చల కోసం ఎన్‌టిఎ చైర్‌పర్సన్ ప్రదీప్ కుమార్ జోషి, ఇతర అధికారులకు కమిటీ సమన్లు జారీ చేసింది. వివిధ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు కేంద్రీకృత ప్రవేశ పరీక్షలు నిర్వహించే ఎన్‌టిఎలో జరిగిన పేపర్ లీక్ ఆరోపణలు, సంస్కరణలపై విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల అభిప్రాయాలను విద్యా, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్థాయీ కమిటీ ఈనెల 21న కోరనుందని రాజ్యసభ నోటీసులో పేర్కొంది. ఎన్‌టిఎ సంస్కరణలపై కె. రాధాకృష్ణన్ కమిటీ నివేదిక అమలును సమీక్షించడం, నీట్‌యుజి పేపర్ లీక్ ఆరోపణలపై దర్యాప్తుకు సంబధించిన తాజా సమాచారం అందించడం ఈ కమిటీ అజెండాలో ఉన్నాయి. కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని ఈ కమిటీ, చర్చల కోసం విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి వినీత్ జోషి, ఎన్‌టిఎ చైర్‌పర్సన్ ప్రదీప్ కుమార్ జోషిలకు సమన్లు జారీ చేసింది. విద్యపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ప్రభావం, విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంచే వ్యూహాలపై కూడా ఈ కమిటీ చర్చిస్తుంది. ఈ చర్చలకు ఆంత్రోపిక్ ఇండియా, ప్రథమ్, ఐఐటి కాన్పూర్, ఇన్ఫోసిస్, ఐఐటి మద్రాస్‌ల ప్రతినిధులను పిలిపించారు.

సాంకేతిక రంగంలో భారత్—స్వీడన్ బృహత్తర ప్రణాళిక

# ఐదేళ్లలో రెట్టింపు వాణిజ్యమే లక్ష్యం

• స్వీడన్ పర్యటనలో మేలైన ఫలితాలు: మోదీ



**గొథెన్‌బర్గ్(స్వీడన్):** భారత్—స్వీడన్ మధ్య కృత్రిమ మేధ సహా సాంకేతికరంగంలో ఒక బృహత్తర ప్రణాళికకు రంగం సిద్ధమైంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వీడన్ పర్యటన సందర్భంగా ఆ దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యం విషయంలో సత్ఫలితాలు వచ్చాయి. సోషల్ మీడియా ద్వారా ఈ మేరకు మోదీ స్వయంగా ఒక పోస్టింగ్ పెట్టారు. వాణిజ్యం,సాంస్కృతిక రంగంలో ఇరుదేశాలమధ్యా సంబంధాల విస్తరణ,కృత్రిమ మేధ, కీలక వ్యూహాత్మక, ఆర్థికరంగాలతోపాటు కొత్తగా రూపుదిద్దుకుంటున్న నూతనసాంకేతిక రంగంలో కూడా సహకారాన్ని పటిష్టవంతం చేసే విషయాలను చర్చించామన్నారు. ఈ సమావేశంలో స్వీడన్ యువరాణి విక్టోరియా కూడా భాగం పంచుకున్నారని మోదీ పేర్కొన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, పెట్టుబడులను రెట్టింపు చేసే దిశగా కలిసి కృషి చేయాలని నాయకులు ఇద్దరూ అంగీకరించారు. స్థిరత్వం,భద్రత,కొత్తతరం ఆర్థికభాగస్వామ్యం,కొత్తగా రూపుదిద్దుకుంటున్న సాంకేతికత అనే నాలుగు మూల స్తంభాలు వ్యూహాత్మక సంభాషణలకు ఊతంగా ఉంటాయి. భారత్—స్వీడన్ ఉమ్మడి నవీన ఆవిష్కరణల భాగస్వామ్యం 2.0ను కూడా ఇరు దేశాలు ప్రారంభిస్తాయి. అదేవిధంగా భారత్—యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని కూడా వీలైనంత త్వరగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాయి. తద్వారా రెండు దేశాల వాణిజ్యం మరింత లోతుగా విస్తరిస్తుంది. అంకుర సంస్థలను కూడా అనుసంధానించే కార్యక్రమం చేపడతారు. యువతకు ఉద్యోగావకాశాలపై ఇరువైపులా దృష్టి పెడతారు.ఆరోగ్య సంరక్షణలో నవీన ఆవిష్కరణ చర్యలకు సహకారాన్ని ఈ ప్రణాళికలో అమలు చేస్తారు. ఇందుకోసం కృత్రిమ మేధను ఉపయోగిస్తారు. పరిశోధనలకు వీలుగా ఉమ్మడిగా ఇరువైపులా అత్యున్నతస్థాయీ వృత్తి నిపుణులను ఇచ్చిపుచ్చుకుంటారు. పరస్పర పర్యటనలకు, స్థిరమైన ప్రాజెక్టుల నిర్వహణకు ప్రోత్సహిస్తారు. సాంస్కృతిక,మేధోపరమైన కార్యకలాపాలను విస్తరించేందుకు వికాస్ భి వికసిత్ భీ అనే ఇతివృత్తంతో ప్రజలమధ్య సంబంధాలను బలోపేతం చేస్తారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీకి స్వీడన్‌కు చెందిన అత్యున్నతమైన పౌర పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ద పోలార్ స్టార్,డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్''ను ఇచ్చి సత్కరించారు. భారత్—స్వీడన్ మధ్య సంబంధాలను మెరుగుపరచేందుకు చేసిన కృషికి గుర్తింపుగా మోదీకి ఈ పురస్కారం లభించింది. ''స్వీడన్‌లో నా పర్యటనలో అనేక ప్రాధాన్యతలున్నాయి. అనేక ముఖ్యమైన ఫలితాలు లభించాయి. ఇది రెండు దేశాల మధ్యా సంబంధాలలో ఒక ఉత్తేజాన్ని తీసుకువస్తుంది'' అని సోషల్ మీడియా పోస్టులో ఆయన పేర్కొన్నారు.రెండు దేశాలమధ్యా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఉమ్మడి నవీన ఆవిష్కరణ భాగస్వామ్యం—2.0 స్థాయికి అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. సాంకేతిక,కృత్రిమ మేధ రంగాలలో రెండు దేశాలకూ ప్రయోజనకరమైన, ఆసక్తిగత లక్ష్యాలను ఏర్పాటు చేసుకునేందుకు, రాబోయే ఐదేళ్లలో వాణిజ్యం రెట్టింపు చేసేందుకు తన పర్యటన ఉపయోగపడిందని పేర్కొన్నారు. గత ఏడాదిలో రెండు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 7.75 బిలియన్ డాలర్లకు చేరుకుంది.విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం,రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి వెళ్ళాయి. 2026—2030 మధ్యకాలంలో ఒక ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రెండు దేశాలు అమలు చేస్తాయి. ఆర్థికరంగం,భద్రతను సుస్థిరం చేసుకోవడం,కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడం,విశ్వసనీయస్థాయిలో అనుసంధానాలను పెంచుకోవడం,స్థిరమైన సహకారం వృద్ధి చేయడం లక్ష్యాలుగా ఉంటాయి.

# మహిళలకు నెలకు రూ.3,000

• బెంగాల్ ప్రభుత్వ నిర్ణయం.. • జూన్ 1 నుంచి సంక్షేమ పథకాల అమలు • మతపరమైన సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు రద్దు



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో హామీ మేరకు కొన్ని పథకాల అమలుపై నిర్ణయం తీసుకున్నారు కోల్‌కతాలో సోమవారం సిఎం సువేందు అధికారి ఆధ్వర్యంలో రెండోసారి క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో.. జూన్ 1 నుంచి పలు పథకాల అమలు చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. దీని ప్రకారం.. వచ్చే జూన్ 1 ను ంచి 'అన్నపూర్ణ' పథకం అమలు చేస్తారు. అర్హులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, సిఎఎ చట్టం కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని బెంగాల్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అగ్నిమిత్ర పాల్ తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న లక్ష్మీ భండార్ పథకం లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేయకుండానే అన్నపూర్ణ పథకానికి అర్హత పొందుతారని మంత్రి చెప్పారు. ఇంకా ఈ పథకం పొందలేని వారు దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే కొత్త పోర్టల్ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మరోవైపు మతపరమైన సంక్షేమ పథకాల్ని, ప్రోత్సహకాల్ని జూన్ 1 నుంచి రద్దు చేయబోతున్నట్లు తెలిపారు. దీని ప్రకారం మదర్సాలకు అందించే సాయం ఆగిపోయే అవకాశం ఉంది. అలాగే, ఒబిసిలకు అందించే పథకాల అమలుకు కొత్త కమిషన్ ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్ని కొనుగోలు చేయనుంది. కేంద్రంతో కలిసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఇటీవలే సువేందు అధికారి ప్రభుత్వం ప్రకటించింది.

# బిజెపికి దూరదృష్టి లోపించింది

• కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని పెంచుతోంది • కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ/ బెంగళూరు :** భారత్‌లో పెట్రో ధరల పెంపునకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు గుప్పించారు. వారికి దూరదృష్టి లోపించిందని, దేశంలో ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నారని ఆరోపించారు. బిజెపి అవకాశాలపై ప్రభావం పడుతుందనే భయంతో, నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంలో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేసిందని కూడా ఆయన ఆరోపించారు. సోమవారం ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ 'మోదీ ఎన్నికలకు ముందే ఇది చేసి ఉంటే, దాని ప్రభావం ఆయనకు తెలిసి ఉండేది. ధరల పెంపు ఎన్నికలలో తన పార్టీని ప్రభావితం చేస్తుందని గ్రహించి, ఆయన ఈ సమాచారాన్ని ఇన్నాళ్లు దాచిపెట్టారు. ఇప్పుడు, ఎన్నికలు ముగిసిన వెంటనే, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచారు' అని మండిపడ్డారు. 'బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి, మోదీకి దూరదృష్టి లోపించింది. మేము ఈ విషయాన్ని లేవనెత్తుతాము. వారి వల్లే ద్రవ్యోల్బణం పెరుగుతోంది, పేదలకు రావలసిన వాటా అందడం లేదు' అని ఖర్గే అన్నారు. పశ్చిమ ఆసియా సంఘర్షణ నేపథ్యంలో, ప్రపంచ ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడంతో ఇంధన రిటైలర్లకు నష్టాలు పెరుగుతున్న తరుణంలో, నాలుగు సంవత్సరాలకు పైగా కాలంలో తొలిసారిగా శుక్రవారం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 3 చొప్పున పెంచారు. అసోం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 16 రోజుల తర్వాత ఈ పెంపు చోటుచేసుకుంది. ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని ప్రజల నుంచి దాచిపెడుతోందని ఖర్గే ఆరోపించారు. ఆదివారం ప్రభుత్వం సిఎన్‌జి ధరలను పెంచిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత వారం రోజుల్లో ధరలు పెంచడం ఇది రెండోసారి.

# ఐదు రోజుల్లో కేరళలో ఉరుములు, మెరుపులు

**తిరువనంతపురం :** నైరుతి రుతుపవనాలు ఈనెల 26 నాటికి కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) సోమవారం తెలిపింది. రుతుపవనాల రాక 26కు నాలుగు రోజుల ముందు లేదా ఆ తర్వాత, అంటే నాలుగు రోజుల వ్యత్యాసంతో ఉండవచ్చని ఆ శాఖ పేర్కొంది. రాబోయే ఐదు రోజుల పాటు కేరళ, మాహేలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా ఈ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీని ఫలితంగా కేరళ, దక్షిణ అంతర్గత కర్ణాటక, రాయలసీమ, దక్షిణ లక్షద్వీప్‌ను ఆనుకుని ఉన్న ఆగ్నేయ అరేబియా సముద్రంపై అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని ఆ శాఖ వివరించింది. నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని చాలా ప్రాంతాలకు, కన్యాకుమారి ప్రాంతంలోని కొన్ని భాగాలకు విస్తరించాయని కూడా ఆ శాఖ తెలిపింది. నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలోని చాలా ప్రాంతాలకు, అండమాన్ సముద్రంలోని అధిక భాగాలకు, అండమాన్, నికోబార్ దీవుల మీదుగా, అలాగే తూర్పుమధ్య బంగాళాఖాతంలోని కొన్ని భాగాలకు కూడా రుతుపవనాలు విస్తరించాయని ఐఎండి వెల్లడించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో, సోమవారం కేరళలోని రెండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 10 జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ఐఎండి జారీ చేసింది. కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, త్రిశూర్, పాలక్కాడ జిల్లాలు మినహా మిగిలిన 10 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. మంగళవారం నాడు తొమ్మిది జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ఐఎండి జారీ చేసింది.

# వ్యాన్, ట్రక్కు ఎదురెదురుగా ఢీ

పది మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లోని లఖీపూర్‌లో ఘటన



**లఖింపూర్:** ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సిసయ్యా—లఖింపూర్ జాతీయ రహదారిపై సోమవారం ఒక వ్యాన్ ట్రక్కును ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పది మంది మరణించిట్లు పోలీసులు తెలిపారు. వ్యాన్ లఖింపూర్ నుండి సిసయ్యా వైపు వెళ్తుండగా ఉంచ్‌గావ్, భరేహ్తా గ్రామాల మధ్య ప్రమాదం జరిగింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న తొమ్మిది మంది ప్రయాణికులు, డ్రైవర్ సహా మొత్తం పది మంది మృతి చెందినట్లు ధౌరహ్రా సర్కిల్ అధికారి షంషేర్ బహదూర్ సింగ్ తెలిపారు. ఎదురుగా వస్తున్న ట్రక్కును వ్యాన్ ఢీకొనడంతో, తొమ్మిది మంది ఘటనాస్థలంలోనే మరణించారని, మరొకరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారని లఖింపూర్ ఖేరీ జిల్లా మేజిస్ట్రేట్ అంజని కుమార్ సింగ్ విలేకరులకు తెలిపారు. అయితే, ఈ ఘటనలో వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. శిథిలాల మధ్య చిక్కుకున్న మృతదేహాలను పోలీసులు, స్థానికులు అతి కష్టం మీద వెలికితీశారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని శవ పరీక్షలు నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని సమీప కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరణించిన వారిలో ఏడుగురిని జైదీప్ సింగ్ (25), పవన్ (23), సోహన్ (21), రామ్ గోయల్ (42), సహజరామ్ (35), పప్పు (18) (వీరందరూ బహ్రైచ్ జిల్లా వాసులు), అద్నాన్ ఖాన్ (15) (లఖింపూర్ ఖేరీ జిల్లా వాసి) గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మరణించిన మిగిలిన వ్యక్తుల వివరాలను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ధౌరహ్రా సర్కిల్ అధికారి షంషేర్ బహదూర్ సింగ్ పిటిఐతో చెప్పారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినందుకు సంతాపం తెలుపుతూ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. 'లఖింపూర్ ఖేరీ జిల్లాలో జరిగిన ఈ దురదృష్టకర రహదారి ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం అత్యంత బాధాకరం. హృదయవిదారకం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. క్షతగాత్రులకు, బాధితులకు తక్షణమే తగిన సహాయం అందించాలని స్థానిక యంత్రాంగాన్ని ఆదేశించాను' అని ఆయన పేర్కొన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ప్రకటించారు.

**రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**

ట్రక్కు, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్ని ఘటనలో పది మంది ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మృతులకు సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరి చొప్పున రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50వేల తక్షణ సాయం అందజేయనున్నట్లు ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 43 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD-Branch
... Disputant
AND
PATTURI VENU & Others
... Opponents
1. Mr. Patturi Venu, S/o, Veeraiah, Age: 35years, Occ: Business, H.No: 1-7-1831/47, Ambedkar Nagar, Balasamudram, Hanumakonda.
4. Ms. Kemidi Rajeshwari, W/o, Somaiah, Age: 48 Years, Occ:Private Employee, H.No: 2-8-1/2A, Kurmawada, Jangaon.
5. Mr. Beemanadam Sandeep, S/o, Venkatadasu, Age: 30 Years, Occ: Private Employee, H.No: 4-10-5, Sanjay Nagar, Jangaon.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 45 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch
... Disputant
AND
LINGOJU VIJAY KUMAR & Others
... Opponents
1. Sri. Lingoju Vijay Kumar, S/o, Rama Brahma Chary, Age: 57 Yrs, Occu: Pvt. Employee, R/o: H.No: 1-77/15, Maripeda Yellampet, Warangal.
2. Sri.Vuppoju Aruna Kumari, D/o. Surender, Age: 55 Yrs, Occu: Conductor, O/o: T.S.R.T.C, Warangal-1 Depot, R/o:H.No:1-77/15, Maripeda Yellampet, Warangal.
4. Smt. Pothuganti Laxmi, W/o, Mogili, Age: 57 Yrs, Occu:Conductor, O/o: T.S.R.T.C, Warangal-1 Depot, R/o: H.No: 7-1-131/4/1, Laxmipuram, Hanamkonda, Warangal.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 117 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch
... Disputant
AND
TAYYABA FATHIMA & Others
... Opponents
1. Ms.Tayyaba Fathima, W/o. Jaweed Pasha, Age: 40 years, Occ: Business, H.No. 2-7-916, Subedari, Alipura, Waddepally, Hanamkonda.
3. Mr.Mohammed Javeed Pasha, S/o. Nahhnnu, Age:46 Years, Occ: Private Employee, H.No. 2-7-916, Subedari, Alipura, Waddepally, Hanamkonda.
4. Mr. Ravulkar Rajesh, S/o. Ashok Kumar, Age: 37 years, Occ: Pvt. Employee, H.No: 5-5-169, Lashkar Bazar, Hanamkonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 116 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch
... Disputant
AND
KOKKARAKONDA RAVI & Others
... Opponents
4. Mr. Thumma Madhu, S/o, Ramaswamy, Age: 50 Years, Occ: Business, R/o. H.No: 3-85, Bheemaram, Hanamkonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 95 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA-II Branch
... Disputant
AND
BODDU VIJAY KRISHNA & Others
... Opponents
3. Mr. Boda Mahesh, S/o, Shankar, Age: 30 Years, Occ: Mechanical, O/o: SCR Secun drabad Division, H.No: 9-100/A, B.T.M Colony, Shankarpally, Rangareddy.
5. Mr. Dorepally Narayana, S/o, Nagaiah, Age: 41 Years,Occ:Mechanical, O/o: SCR Secundrabad Division, H.No: 4-3, Harajanawada, Pegall Padu, Khammam.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 56 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA-II Branch
... Disputant
AND
VALLEM RADHA & Others
... Opponents
1. Ms. Vallem Radha, W/o, Venkat Reddy, Age: 65 years, Occ: House wife, H.No: 2-4-1599, Ashok colony, Hanamkonda, Warangal.
2. Mr. Vallem Indrasena Reddy, S/o, Venkat Reddy, Age: 46 years, Occ: Superin tendent Police, H.No: 1-7-156, Revenue Colony, Subedari, Hanamkonda.
3. Mr. Syed Iqbal Hassain, S/o, Syed Iqbal , Age: 48 Years, Occ: Typist, H.No:1-9-739, Julywada, Subedari, Hanumakonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 55 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA-II Branch
... Disputant
AND
MADISHETTI SHAILAJA & Others
... Opponents
1. Mrs. Madishetty Shailaja, W/o, Mohan, Age: 41 years, Occ: Business, H.No:16-8-691, Abbani Kunta, Labour Colony, Warangal.
3. Mr. Poloju Vinay Kumar, S/o, Satyanarayana, Age: 37 Years, Occ: Business, H.No: 11-22-481, Kashibugga, Warangal.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 54 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA-II Branch
... Disputant
AND
VALLEM RADHA & Others
... Opponents
1. Ms. Vallem Radha, W/o, Venkat Reddy, Age: 66 years, Occ:House wife, H.No:2-4-1599, Ashok colony, Hanumakonda.
2. Mr. Vallem Indrasena Reddy, S/o, Venkat Reddy, Age: 47 years, Occ: Superintendent Police, O/o: 4th BN TSSP, H.No:1-7-156, Revenue Colony, Subedari,Hanumakonda.
5. Mr.Pailla Shivaram Reddy, S/o, Narsi Reddy, Age: 53 Years, Occ:Senior Assistant, `O/o: 4th BN TSSP, Mamnoor, H.No: 2-403/2, Bank Colony, Bheemaram, Hanumakonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 47 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch
... Disputant
AND
PUTTABATHULA VENU & Others
... Opponents
4. Ms. Mittapalli Nirmala, W/o, Sudharshan, Age: 59 Years, Occ: Business, H.No: 16-6-6/1, Railway Gate, Perukawada, Warangal.
7. Mr. Nune Kumara Swamy, S/o, Somaiah, Age: 47 Years, Occ:Private Employee, H.No:1-7-895, 1st Floor, Nandi hills, Hunter Road, Hanamkonda.
8. Mr. Nandikonda Raju, S/o, Ravinder Reddy, Age: 34 Years, Occ: Private Employee, H.No: 1-7-895, 1st Floor, Nandi hills, Hunter Road, Hanamkonda.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M**. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 46 of 2025
Between:
KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., HANAMKONDA- Branch
... Disputant
AND
KOKKARAKONDA RAVI & Others
... Opponents
2. Mr.Thumma Madhu, S/o,Rama Swamy, Age: 49 years, Occ: Private Employee, R/o. H.No: 1-216, Weavers Colony, Mulugu.
3. Mr. Teegala Bharath Kumar, S/o, Sammaiah, Age: 38 Years, Occ: Private Employee, H.No: 3-113/3, Keshavapur, Elkathurthi, Hanumakonda.
4. Mr. Morri Kumara Swamy, S/o, Mallaiah, Age: 40 Years, Occ: Business, H.No: 5-61/3, Nadikuda, Parkal, Hanumakonda.
6. Mr. Nagapuri Suresh, S/o. Rajaiah, Age: 42 Years, Occ: Business, H.No: 5-40, Madipalli, Jammikunta, Karimnagar.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **12-06-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.**Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

# కెన్యా, న్యూయార్క్, బంగ్లాదేశ్‌లలో రవాణా సమ్మె

కెన్యాలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు

స్తంభించిన వ్యాపారాలు, ప్రయాణికులు

ప్రపంచవ్యాప్తంగా ముదిరిన చమురు సంక్షోభం



**న్యూయార్క్:** పశ్చిమాసియాలో యుద్ధం, చమురు సంక్షోభం పేరుతో పెంచిన ధరలు వెనక్కు తీసుకోవాలని కోరుతూ కెన్యా దేశవ్యాప్తంగా రవాణా కార్మికులు సమ్మె బాట పట్టారు. అనేకచోట్ల ఈ నిరసన హింసాత్మకంగా మారింది. అమెరికా న్యూయార్క్ నగరంలో 3,500 మంది రవాణా కార్మికులు 30 ఏళ్ళ తర్వాత మళ్ళీ చేపట్టిన సమ్మె సోమవారంనాటికి మూడో రోజుకు చేరింది. ఈ సమ్మె వల్ల 2.50 లక్షలమంది లాంగ్ ఐలాండ్ రైల్–రోడ్ ప్రయాణికులు చిక్కుల్లో పడ్డారు. ఈ సమ్మెతో మన్‌హట్టన్‌లోని పెన్ స్టేషన్ నిర్మానుష్యంగా మారింది. బంగ్లాదేశ్‌లోని రాజ్‌షాహి జిల్లాలో రవాణా కార్మికులు సమ్మె చేపట్టారు. కెన్యాలో ఎనర్జీ–పెట్రోలియం రెగ్యులేటరీ అథారిటీ (ఈప్రా) గడచిన గురువారం డీజిల్ లీటరు ధరను గరిష్ఠంగా 242 షిల్లింలకు (1.8 డాలర్లు) పెంచింది. చమురు ధరలు రెండు నెలల్లోనే ఇరవై శాతం మేరకు పెరగడంతో వేలాదిమంది రవాణా రంగ కార్మికులు సమ్మె ప్రారంభించారు.ధరలు విపరీతంగా పెరిగిపోవడదంతో రవాణారంగంలో ఆగ్రహజ్వాలలు చెలరేగాయి. ఈ సమ్మె హింసాత్మకంగా మారింది. వాహనాలను కదల్చకుండా ఎక్కడి రవాణాను అక్కడే నిలిపివేశారు. ప్రజా రవాణా బస్సులు (మటాటు), లారీలు, ట్రాక్టర్లు సహా ఏ రకమైన వాహనమైనా వీధుల్లోకి రాకూడదని రవాణా కార్మికుల సంఘం కూటమి (టిఎస్ఎ) బంద్ సందర్భంగా పిలుపు ఇచ్చింది. పెంచిన ధరలు వెనక్కు తీసుకోవాలని, జీవన వ్యయాలు పెరుగుతుంటే ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని టిఎస్ఎ విమర్శించింది. ప్రతి కెనడా పౌరుడి కోసమే ఈ సమ్మె చేస్తున్నట్లు టిఎస్ఎ ప్రకటించింది. దీంతో ప్రజారవాణా ఎక్కడికక్కడే నిలిచిపోయింది. ప్రయాణికులు దిక్కుతోచనిస్థితిలో ఉండిపోయారు. ప్రదర్శకులు రోడ్ల మీద బారికేడ్లు అడ్డంగా పెట్టారు. టైర్లు తీసుకువచ్చి రోడ్లమీద వేసి నిప్పు పెట్టారు. ప్రదర్శకులను చెదరగొట్టేందుకు అనేక నగరాలు, పట్టణాలలో పోలీసులు టియర్‌గ్యాస్ ప్రయోగించారు. కొన్నిచోట్ల పోలీసులు, ప్రదర్శకుల మధ్య ఘర్షణలు జరిగాయి. రాజధాని నైరోబీలో వీధులన్నీ బోసిపోవడంతో కార్మికులు నడిచి సుదూర ప్రయాణాలు చేసి పనులకు వెళ్ళాల్సి వచ్చింది. విద్యార్థులు ఇళ్ళల్లోనే ఉండిపోవాలని పాఠశాలలు ఉత్తర్వులు జారీ చేశాయి.

బంగ్లాదేశ్‌లోని రాజ్‌షాహి జిల్లాలో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. చమురు సమస్యతోపాటు మోటార్ వర్కర్స్ యూనియన్ కొత్త కమిటీని మళ్ళీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా దీనికి జత కలిసింది. కార్మికులు షిరోయిన్ బస్ టెర్మినల్ వద్ద బైఠాయించారు. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. కాగా న్యూయార్క్‌లో అనేక సంవత్సరాలుగా వేతన సమస్య అపరిష్కృతంగా ఉండటంతో సహనం కోల్పోయిన లాంగ్ ఐలాండ్ రైల్ రోడ్ కార్మికులు సమ్మెబాట పట్టారు. దీంతో లాంగ్ ఐలాండ్‌లో న్యూయార్క్ శివారు ప్రాంతాలు, క్వీన్స్, మన్‌హట్టన్ ప్రాంతాలను అనుసంధానం చేసే రవాణా కార్యకలాపాలు వరుసగా మూడో రోజు కూడా స్తంభించాయి. రైలు సేవలకు బదులుగా బస్సులు నడపడతో సోమవారం కీలక సమయంలో తీవ్రమైన గందరగోళం చెలరేగింది.

మరోవైపు నేపాల్, శ్రీలంక, పాకిస్థాన్‌లలో పొదుపు చర్యలు విపరీతంగా అమలు చేస్తుండగా భారత్‌లో చమురు ధరల పెరుగుదలతో సంక్షోభం, ప్రజా నిరసన ప్రారంభమైంది. వ్యవసాయ అవసరాలకు తక్కువ ధరలో డీజిల్ సరఫరా చేయాలని, వివక్ష పాటించకూడదని, సమస్య పరిష్కరించాలని కోరుతూ మే 25వ తేదీ నుండి భారతదేశ రైతులు జాతీయ సమ్మెకు సన్నద్ధమవుతున్న తరుణంలో మూడు దేశాల్లో ఒకేసారి రవాణా కార్మికులు ప్రభుత్వాలపై తిరగబడ్డారు.

యుద్ధం ముగించే పరిస్థితులు రోజు రోజుకూ కనుమరుగవుతూ ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ముదిరి పాకాన పడుతోంది. ఆఫ్రికా, ఆసియా సహా అనేక దేశాలు ప్రజా రవాణాను స్తంభింపజేసి, పొదుపు చర్యలు చేపట్టి ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరిస్తున్న తరుణంలో మరికొన్ని దేశాలలో జీవనోపాధి దెబ్బతినడంతో రవాణా కార్మికులు సమ్మెబాట పట్టారు.

# చైనాలో భూకంపం: 13 భవనాలు నేలమట్టం

ఇద్దరు మృతి : అనేకమంది గల్లంతు



**బీజింగ్:** దక్షిణ చైనాలోని గుయాంగ్జీ రాష్ట్రంలో సోమవారం మధ్యాహ్నం తీవ్ర భూకంపం సంభవించింది. 13 భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ కారణంగా ఇద్దరు మరణించారు. నలుగురు గాయపడ్డారు. అనేకమంది జాడ తెలియడంలేదు. వీరంతా శిథిలాల్లో చిక్కుకుని ఉంటారని భయపడుతున్నారు. వారికోసం సహాయ బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. రిచ్‌టర్ స్కేలుపై 5.2 తీవ్రంగా నమోదైన ఈ భూకంపంవల్ల భవనాలు నేలకూలాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో వేలాదిమంది ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీసి విశాలమైన మైదాన ప్రాంతంవైపు వెళ్ళిపోయారు. ఏడువేలమంది నివాసితులను పూర్తిగా ఖాళీ చేయించారు. 91 ఏళ్ళ వయసుగల వృద్ధుడు శిథిలాల్లో చిక్కుకుపోవడంతో అతడిని కాపాడారు. ఆయన ఆరోగ్యపరిస్థితి బాగానే ఉంది. భూకంపం దృశ్యాలను స్థానికులు సిసిటీవీల ద్వారా సోషల్ మీడియాలోకి అప్‌లోడ్ చేశారు. భూకంపం కారణంగా రహదారులన్నీ చిందరవందరయ్యాయి. రవాణా స్తంభించిపోయింది. కొండచరియలు విరిగిపడ్డాయి. మట్టిపెళ్ళలు సర్వత్రా వ్యాపించి ప్రజా జీవనానికి సమస్యలు సృష్టించాయి. లియుఝోయిలో రైలు సేవలను నిలిపివేశారు. దక్షిణ చైనాలో భూకంపాలు తరచు సంభవిస్తూ ఉంటాయి. ఒక్కోసారి చాలా తీవ్రస్థాయిలో భూకంపాలు వస్తాయి. ఇటీవల అంటే 2008లో చాలా దారుణ స్థాయిలో భూకంపం సంభవించింది. 7.9 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపం వల్ల 87000 మంది మరణించడమో, జాడ తెలియకుండా పోవడమో జరిగింది. అనేక కుటుంబాల్లో ఈ భూకంపం విషాదం మిగిల్చింది.

# నల్లసముద్రంలో చైనా కార్గో నౌకపై రష్యా దాడి



రష్యా అధ్యక్షుడు పుతిన్ బీజింగ్ పర్యటనకు రంగం సిద్ధమైన సమయంలో చైనా కార్గో నౌకపై నల్లసముద్రంలో రష్యా డ్రోన్ల దాడి కలకలం సృష్టించింది. రష్యా–ఉక్రేన్ యుద్ధం సందర్భంగా నల్లసముద్రంలో చైనా సొంత సరుకు రవాణా నౌకపై రష్యా డ్రోన్ల దాడి జరిగింది. ఉక్రేన్ ఓడరేవుల అధికార యంత్రాంగం చెప్పిన సమాచారం ప్రకారం రెండు పౌర నౌకలపై డ్రోన్ల దాడులు జరిగాయి. మార్షల్ దీవుల జెండాతో ఒక నౌక, గినియా బిస్సావు జెండాతో మరో నౌక వెళుతుండగా ఈ దాడులు జరిగాయి. మార్షల్ దీవుల జెండా కింద చైనాకు చెందిన కెవిఎల్ డెయాంగ్ సరుకు రవాణా నౌకపై దాడి జరిగింది. నాలుగేళ్ళక్రితం ఉక్రేన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించిన తర్వాత ఉక్రేన్ వ్యవసాయ ఎగుమతులకు ముఖ్యకేంద్రమైన ఒడెసా ఓడరేవుపై రష్యా డ్రోన్లు క్రమం తప్పకుండా దాడులు చేస్తున్నాయి. ఒడెసాలో దాడుల సమయంలో ఒక మానవ రహిత డ్రోన్ చైనా కార్గో నౌకను ధ్వంసం చేసింది.

# వచ్చేనెల 7న పెరూ అధ్యక్ష ఎన్నికల తుది పోరు



**లిమా:** పెరూ అధ్యక్ష పదవికి జరుగుతున్న ఎన్నికల్లో తుదిపోరు జూన్ ఏడో తేదీన జరుగుతుంది. ఏప్రిల్‌నెలలో నువ్వా–నేనా అనే రీతిలో జరిగిన మొదటి విడత పోలింగ్ పోరులో కీకో ఫుజిమోరి, రాబర్టో సాంచెజ్‌లు అర్హులుగా తేలారు. వీరిద్దరూ ఎక్కువ ఓట్లు పొంది తుది విడత పోరులో పాల్గొనేందుకు అర్హత సంపాదించుకున్నారు. ఆదివారం (మే 17) రాత్రి పొద్దుపోయిన తర్వాత ఎన్నికల అధికారులు మొదటి విడత కౌంటింగ్ ఫలితాలను బహిర్గతం చేశారు. రాజకీయ గందరగోళం, నేరపూరిత ఘటనల మధ్య ఏప్రిల్ మొదటివారంలో అధ్యక్ష పదవికి మొదటి విడత పోలింగ్ జరిగింది. ఈ కౌంటింగ్‌లో ఎవ్వరికీ యాభై శాతం మేరకు పూర్తి మెజారిటీ రాలేదు. ఏ అభ్యర్థి అయినా విజేత కావాలంటే యాభైశాతం కంటే ఎక్కువ ఓట్లు రావాల్సి ఉంది. పెరూ మాజీ అధ్యక్షుడు, దివంగత ఆల్బర్టో ఫుజిమోరీ కుమార్తె, ప్యూయెర్జా పాపులర్‌పార్టీ అభ్యర్థి ఫుజిమోరి (50) 17.19 శాతం ఓట్లు సంపాదించుకున్నారు. ఈ విధంగా ఆమె తుది విడత పోటీలకు చేరడం వరుసగా ఇది నాలుగోసారి. కాగా ఆమె ప్రత్యర్థి జుంటోస్ పోర్ ఎల్ పెరూ పార్టీ అభ్యర్థి సాంఛెజ్‌కు 12.03 శాతం ఓట్లు లభించాయి. పెరూ మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లో మంత్రివర్గంలో విదేశీమంత్రిగా సాంఛెజ్ బాధ్యతలు నిర్వహించారు.

# అమెరికా ఎయిర్ షో రెండు వార్ జెట్స్ మంటల్లో దగ్ధం

నలుగురు పైలట్లు సురక్షితంగా నేలమీదకు..



**ఇడాహో:** అమెరికా మౌంటెన్ హోంలోని ఇడాహో వైమానిక స్థావరంలో సోమవారం జరిగిన ఒక ఎయిర్ షో లో విషాదం చోటు చేసుకుంది. నావికా దళానికి చెందిన రెండు యుద్ధ విమానాలు ఎయిర్ షోలో పాల్గొన్నాయి. వేలాదిమంది ప్రేక్షకుల సమక్షంలో ఎయిర్ షో జరుగుతున్న సమయంలో రెండు యుద్ధ విమానాలు గాలిలో ఒకదానితో మరొకటి ఢీకున్నాయి. దీంతో రెండు విమానాల నుండి మంటలు చెలరేగాయి. ఆ రెండు విమానాలు నేలన కుప్పకూలి మంటల్లో దగ్ధమయ్యాయి. దీంతో ప్రేక్షకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అసలు విచిత్రమైన విషయం ఏమిటంటే ఈ యుద్ధ విమానాలు నడుపుతున్న నలుగురు పైలట్లు చాలా సురక్షితంగా బయటపడ్డారు. రెండు యుద్ధ విమానాలు ఢీకున్న వెంటనే రెండు విమానాల నుండీ పైలట్లు ప్యారాఛూట్‌లను తెరచుకుని బయటపడ్డారు. ఒకవైపు విమానాలు రెండూ నేలకూలి దగ్ధమవుతూ నల్లటి పొగలు, ఎర్రటి మంటలను వెదజల్లుతూ ఉంటే మరోవైపు నలుగురూ పైలట్లూ ప్యారాఛూట్ల సహాయంతో ఆ నల్లటి పొగల్లోంచి నేలపైకి కిందికి దిగారు. వారు స్వల్ప గాయాలతో సురక్షితంగా ఉన్నారు.

# పెరిగిన ఇంధన ధరలతో గిగ్ కార్మికులపై తీవ్ర భారం

## గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించిన టిజిపిడబ్ల్యుయు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి, ఎల్‌పిజి ధరలు గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ధరలను తగ్గించాలని కోరుతూ సోమవారం తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇంధన ధరలు, జీవన వ్యయాలు పెరుగుతున్నప్పటికీ ఓలా, ఉబెర్, స్విగ్గీ, జొమాటో తదితర సంస్థలు ఛార్జీలు పెంచకపోవడంతో కార్మికులపై అదనపు భారం పడుతోందని పేర్కొంది. క్యాబ్, ఆటో డ్రైవర్లు పెరుగుతున్న ఈఎంఐలు, వాహన నిర్వహణ ఖర్చులు, కుటుంబ అవసరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది. గిగ్ కార్మికులకు పెరిగిన డెలివరీ ఛార్జీలు, ఇంధన భృతి, మెరుగైన సంక్షేమ పథకాలు కల్పించాలని ప్రభుత్వం, ప్లాట్‌ఫామ్ కంపెనీలను టిజిపిడబ్ల్యుయు డిమాండ్ చేసింది. గిగ్ కార్మికుల ఆదాయాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయని, వారిని ఆర్థిక ఇబ్బందుల నుంచి కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ పేర్కొన్నారు.

# రైతులే వెన్నెముక

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవ పరిస్థితులను వక్రీకరించడమే అని అన్నారు. తెలంగాణలో వరితో పాటు మొక్కజొన్న, జొన్న, కందులు, పెసలు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పత్తి, ఆయిల్‌పామ్ వంటి అనేక పంటలు విస్తృతంగా సాగు అవుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ పంటల కొనుగోలు, మద్దతు ధరలు, దిగుమతిఎగుమతి విధానాలు, ఎరువుల ధరలు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం సి2 + 50 శాతం సూత్రాన్ని అనుసరిస్తున్నాయా అనే విషయాన్ని రైతులకు వెల్లడించాలని మంత్రి డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో ఎరువులు, డీజిల్, విత్తనాలు, కూలీల ఖర్చులు భారీగా పెరిగినా, అదే స్థాయిలో మద్దతు ధరలు పెరగలేదన్నారు.గత ఐదేళ్లలో డీఏపీ ధరలు 70 శాతం, కాంప్లెక్స్ ఎరువులు 60 శాతం, డీజిల్ ధరలు 40 శాతం, వ్యవసాయ కూలీల ఖర్చులు 100 శాతం వరకు పెరిగినా, మద్దతు ధరల పెరుగుదల మాత్రం వరిపై 27 శాతం, గోధుమపై 26 శాతం, మొక్కజొన్నపై 20 శాతం, జొన్నపై 41 శాతం, పత్తిపై 40 శాతం మాత్రమే ఉండటం రైతులకు న్యాయం కాదన్నారు. ఈ పెరుగుదలలు రైతుల అసలు సాగు వ్యయాలకు సరిపోవడం లేదన్నారు.అమెరికా నుండి వచ్చే పత్తిపై గత ఏడాది సెప్టెంబర్ డిసెంబర్ మధ్య దిగుమతి సుంకాలపై 11 శాతం తొలగించగా, అక్కడి నుండి పత్తి చౌకగా దేశానికి రావడం వలన, ఇక్కడ ఉత్పత్తి అయిన పత్తి ధర క్వింటాల్ కు రూ.1000 రూ.1500 తగ్గిన విషయాన్ని గుర్తుచేశారు.అమెరికా, యూరప్, జపాన్ వంటి దేశాల్లో రైతులకు నేరుగా ఆదాయ సబ్సిడీలు, ధర పతనంపై ప్రభుత్వ చెల్లింపులు, పంట నష్టపరిహారం, ఎగుమతులకు ప్రోత్సాహకాలు, దిగుమతులపై భారీ సుంకాల ద్వారా రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. కానీ మన దేశంలో కేంద్ర ప్రభుత్వం రైతులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని విమర్శించారు. మన దేశ రైతులు ఎరువుల కొరత, పెరిగిన డీజిల్ ధరలు, అధిక కూలీల వ్యయం, ప్రకృతి విపత్తులు, మార్కెట్ అనిశ్చితి వంటి అనేక సవాళ్లతో పోరాడుతున్నారని మంత్రి అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక భరోసా కల్పించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావాలని పేర్కొన్నారు. ఇందుకు స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం సి2 + 50శాతం ఆధారంగా కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని,ఎంఎస్‌పి లకు చట్టబద్ధ హామీ కల్పించాలన్నాని సూచించారు. మొక్కజొన్న, జొన్న పంటలను పిఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, కేంద్రం కొనుగోలు చేసే పంటల కొనుగోళ్లపై 25 శాతం పరిమితిని తొలగించాలని, కనీసం 75 శాతం పంటలను కేంద్రమే కొనుగోలు చేయాలన్నారు.

# హత్యకు ప్లాన్!

(మొదటి పేజీ తరువాయి)

వెలుగులోకి వచ్చిన అనంత రం ఈ విషయాన్ని మిగిలిన రుణదాతలు కూ డా గ్రహించారు. దీంతో తమకు ప్రాణహాని ఉందని ఆరుగురు మహిళలు పోలీసులను ఆశ్రయించారు. మరోవైపు మొయినాబాద్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. ఆబేదా బేగం, మహబూబాబీ తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత నగదును అప్పుగా ఇచ్చారు. చాలా రోజులు కావడంతో నగదు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమా బేగం, రెహమాన్, నయీం ప్లాన్ వేశారు. ఇచ్చిన అప్పును తిరిగి చెల్లిస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకువెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి శవాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత మ రో మహిళ ఆబేదా బేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదే రీతిలో మర్డర్ చేసి పాతిపెట్టారు. ఈ కే సులో కరీమా బేగంను అదుపులోకి తీసుకున్న పో లీసులు ఆదివారం కరణ్‌కోట్ పిఎస్‌లో విచారిస్తుండగా బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తా గి ఆత్మహత్యాయత్నం చేశారు. దీంతో ఆమెను హుటాహుటిన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

# సిజెఐ వ్యాఖ్యలు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

సాగడానికి కారణం కార్మిక సంఘాలే అని గతంలో ఆయన అన్యాయపూరితమైన వ్యాఖ్యలు చేశారని, ఆనాడు ఈ వ్యాఖ్యలు తీవ్ర వ్యతిరేకతను తీసుకువచ్చాయని, ఇప్పుడు అత్యంత ఆందోళనకరమైన పద్ధతుల్లో మళ్ళీ ఈరూపంలో శ్రామికవర్గ,కార్మిక సంఘాలపట్ల శత్రుత్వం బహిర్గతమైందని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఈ వ్యాఖ్యల తర్వాత ఆయన కొంత వివరణ ఇచ్చినప్పటికీ కూడా ఆయన ఉపయోగించిన భాష, పదజాలం తీవ్రంగా కలవరపరచేదిగా ఉందని, ఆయన వ్యాఖ్యలు, పదజాలంలో ఎంతమాత్రం సున్నితత్వం లేదని, ఎంతో ఉదాసీనతను ప్రతిబింబిస్తున్నాయని, అందువల్ల అత్యంత దారుణమైన ఆయన వ్యాఖ్యలను నిస్సందేహంగా ఖండించవలసిందేనని ఎ.ఐ.టి.యు.సి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సానుభూతిని ప్రకటించే భాష ద్వారా భారత ప్రధాన న్యాయమూర్తి సహా ఇతర రాజ్యాంగాధికారులు సంయమనం పాటించాలని, ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వ వ్యవస్థల గౌరవ ప్రతిష్టలను , రాజ్యాంగబద్ధమైన నైతికతను, ప్రజాస్వామ్యపరిధిలో ప్రజలు చేసే పోరాటాకు ఇచ్చే గౌరవాన్ని నిలబెట్టాలని ఎ.ఐ.టి.యు.సి పిలుపు ఇచ్చింది.భారతదేశం ఈరోజున అసాధారణమైన నిరుద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. యువతకు పని దొరకడం కష్టమైపోతోంది, దొరికిన పనిలో స్థిరత్వం లేదు, వారికి భద్రతలేదు,పని ప్రదేశాలలో కార్మికహోదాలో రక్షణలు తగ్గిపోతున్నాయి, ఆర్థికపరమైన అభద్రత పెరిగిపోతోంది, ఈ అభద్రత వారిని వెంటాడుతోంది, లక్షలాదిమంది విద్యావంతులైన యువకులు జీవనంకోసం పోరాటం చేస్తున్నారు, ఎన్నో కష్టాలు పడుతున్నారు, వారి కష్టాలు లెక్కలేనన్ని ఉన్నాయి, దేశంలో అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థను బలహీన పరిచాయి, కార్మిక హక్కులను క్షీణింపజేశాయి, కార్మికులు తమ హక్కులు కోల్పోతున్నారు, అభద్రత,రక్షణలు లేని కాంట్రాక్టు విధానం,ప్రైవేటీకరణ రోజురోజుకూ పెరిగిపోతోంది, దేశ ప్రజలకు రాజ్యాంగపరంగా ఇచ్చిన రక్షణలు,హక్కులను కాపాడటంలో,ప్రజలకు సమాన న్యాయం అందించడంలో భారత న్యాయ వ్యవస్థ విఫలమైందనే ఆందోళన కూడా దేశంలో తలెత్తుతోంది.రక్షణలు లేని ఇలాంటి పరిస్థితుల్లో యువతను చేయాల్సింది అవహేళన కాదు, వారిపట్ల సానుభూతి చూపించాలి. దేశంలో నిరుద్యోగ యువకులు ప్రభుత్వ విధానపరమైన వైఫల్యాలకు,ఆర్థిక అసమానతలకు బలి అవుతున్నారు. కార్మిక సంఘాలు,సమాచార హక్కు కోసం పోరాటం చేసే కార్యకర్తలు,జర్నలిస్టులు,సామాజిక ఉద్యమాలు జాతికి శత్రువులు కాదు,దేశ ప్రజాస్వామ్యంలో ఇవన్నీ విడదీయరాని స్తంభాలవంటివి,దేశ రాజ్యాంగ వ్యవస్థలకు ఇవన్నీ జవాబుదారీగా ఉంటాయి. నిరుద్యోగ యువతను బొద్దింకలతో, పరాన్నభక్కులతో పోల్చిచూపించడం చాలా చాలా తీవ్రమైన, లోతైన అభ్యంతరకరమైన విషయం, అమానవీయం,ఎంత మాత్రం సమ్మతింపసాధ్యం కానిది'' అని ఎ.ఐ.టి.యు.సి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# మందగమనం

(మొదటి పేజీ తరువాయి)

ము ఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్వయంగా సమీక్షా సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఇందుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. . అయినా గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్‌లో ప్రవేశించగా మరో 10 నుంచి 15 రోజుల్లో రాష్ట్రంలో కూడ ప్రవేశించే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరం కేంద్రం అధికారులు ప్రకటించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రక్రియ మరో 20 నుంచి 25 రోజుల పాటు మాత్రమే సాగే అవకాశం ఉండగా ఈ మిగిలినరోజుల్లో దాదాపుగా 50 లక్షల మెట్రిక్ టన్నులు (55 శాతం) ధాన్యం సేకరించాల్సి ఉంది..

**గత ప్రభుత్వం కంటే నయం:** ప్రభుత్వం శనివారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 40.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.6,462.73 కోట్లు చెల్లించారు. ధాన్యం కోనుగోళ్లకు సంబంధించి 2021–22లో 6,609, 2022–23లో 7,037, 2023–24లో 7,178, 2024–25లో 8,378 కేంద్రాలు ఉండగా, 2025–26లో అత్యధికంగా 8,575 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలోని 2021–22 రబీ సీజన్ మే 18 నాటికి 21.79 లక్షల మెట్రిక్ టన్నులు, 2022–23లో 30.40 లక్షల మెట్రిక్ టన్నులు, మాత్రమే కొనుగోలు చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 2023–24లో 36.01లక్షల మెట్రిక్ టన్నులు, 2024–25లో 54.18 లక్షల మెట్రిక్ టన్నులు, 2025–26లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే తేదీ నాటికి 40.03 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. 2022–23 రబీతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకు 9.63 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ ధాన్యం కొనుగోలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలోని 2023–24లో అదే తేదీ నాటికి 36.01 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కాగా, ఈసారి 40.03 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా గత ఏడాది కంటే 4.02 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ కొనుగోలు చేశారు. ఇదే ప్రభుత్వం గత ఏడాది రబీ సీజన్‌లో మే 18 నాటికి 54.18 మెట్రిక్ టన్నులు మేర వెనకబడింది.

# సతీశన్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

రెండవ అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన ఐయుఎంఎల్‌తో సహా, ఇతర మిత్రపక్షాలకు కూడా ఈ మంత్రివర్గంలో చోటు కల్పించారు. కేరళలోని వివిధ ప్రాంతాల నుండి రాష్ట్ర రాజధానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన వందలాది మంది మద్దతుదారుల హర్షధ్వానాల మధ్య, సతీశన్ దైవ సాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. సతీశన్‌తో పాటు, కొత్త మంత్రివర్గంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్నితల, కె. మురళీధరన్, ఎ.పి. అనిల్ కుమార్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ కూడా ఉన్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఐయుఎంఎల్ సీనియర్ నాయకులు పి.కె. కుంజాలికుట్టి, ఆర్ఎస్‌పి నాయకులు షిబు బేబీ జాన్, కేరళ కాంగ్రెస్ నాయకులు మాన్స్ జోసెఫ్, కేరళ కాంగ్రెస్ (జాకబ్) నాయకులు అనూప్ జాకబ్, సిఎంపి నాయకులు సి.పి. జాన్ కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మంత్రివర్గంలో ముఖ్యమంత్రి సతీశన్‌తో కలిపి మొత్తం 14 మంది కొత్తవారు. సతీశన్ 2001 నుండి పరవూరు నియోజకవర్గం నుండి ఎన్నికవుతున్నప్పటికీ, ప్రభుత్వంలో ఇంతటి ఉన్నత పదవిని చేపట్టడం ఇదే మొదటిసారి. ఆయన మంత్రివర్గంలో ఇద్దరు మహిళలకు కూడా చోటు లభించింది. కొల్లాం ఎమ్మెల్యే బిందు కృష్ణ, కొంగాడ్ ఎమ్మెల్యే కె.ఎ. తులసిలకు మంత్రి పదవులు రాగా, వీరిలో తులసి షెడ్యూల్డ్ కులాల వర్గానికి చెందినవారు కావడం విశేషం. మంత్రివర్గంలో షెడ్యూల్డ్ కులాల వర్గానికి చెందిన రెండవ సభ్యుడు ఎ.పి. అనిల్ కుమార్. సిఎంపి నాయకులు జాన్, ఐయుఎంఎల్ నాయకులు ఎన్. షంసుద్దీన్, కె.ఎం. షాజీ, పి.కె. బషీర్, వి.ఇ. అబ్దుల్ గఫూర్ ఈ మంత్రివర్గంలో కొత్తవారు. కాంగ్రెస్ నాయకులు పి.సి. విష్ణునాథ్, రోజీ ఎం. జాన్, టి. సిద్దిక్, ఓ.జె. జనీష్ కూడా తొలిసారిగా మంత్రి పదవులు చేపట్టిన వారిలో ఉన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్దరామయ్య (కర్ణాటక), ఎ. రేవంత్ రెడ్డి (తెలంగాణ), సుఖ్వీందర్ సింగ్ సుఖు (హిమాచల్ ప్రదేశ్), కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ హాజరయ్యారు. పూర్వ ముఖ్యమంత్రి, మార్క్సిస్ట్ సీనియర్ నాయకుడు పినరయి విజయన్, వామపక్ష నాయకులు, బిజెపి ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 140 మంది సభ్యులున్న శాసనసభకు ఎన్నికలు ఏప్రిల్ 9న జరగగా, మే 4న ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ 102 స్థానాలు, ఎల్‌డిఎఫ్ 35 స్థానాలు, బిజెపి మూడు స్థానాలు గెలుచుకున్నాయి.

**జూన్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం**

ప్రమాణ స్వీకార అనంతరం సమావేశమైన సతీశన్ మంత్రివర్గం పలు సంక్షేమ చర్యలను ప్రకటించింది. జూన్ 15 నుండి కెఎస్ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు గౌరవ వేతనం పెంపు, అలాగే వృద్ధ పౌరుల కోసం ఒక ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. మొదటి మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రకటిస్తూ, మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి సంబంధించిన వివరణాత్మక మార్గదర్శకాలు త్వరలో జారీ చేయబడతాయని ముఖ్యమంత్రి విడి సతీశన్ తెలిపారు. వృద్ధుల కోసం ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం దేశంలో ఇటువంటి చొరవ ఇదే మొదటిసారి కావచ్చని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సెక్రటేరియట్ ఎదుట ఆశా కార్యకర్తలు సుదీర్ఘకాలం పాటు చేసిన ఆందోళన సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, వారి గౌరవ వేతనంలో నెలకు రూ. 3,000 పెంపును మంత్రివర్గం ఆమోదించిందని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, పాఠశాల వంట సిబ్బంది, ప్రీప్రైమరీ ఉపాధ్యాయులు, ఆయాలకు కూడా నెలకు రూ. 1,000 చొప్పున గౌరవ వేతనం పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. కాగా, సీనియర్ ఎమ్మెల్యే జి. సుధాకరన్‌ను ప్రొటెమ్ స్పీకర్‌గా మంత్రివర్గం సిఫార్సు చేసింది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక కోసం అసెంబ్లీని సమావేశపరచాలని గవర్నర్‌ను కోరింది. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, మే 21న ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, మే 22న స్పీకర్ ఎన్నిక జరుగుతాయని ఆయన తెలిపారు. సీనియర్ న్యాయవాది రాజీవ్ బాబును అడ్వకేట్ జనరల్‌గా, న్యాయవాది టిఎస్ అసఫ్ అలీని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా కూడా మంత్రివర్గం నియమించింది.

# రాజస్థాన్‌పై ఢిల్లీ విజయం



## రాణించిన స్టార్క్, రాహుల్, పోరెల్

**న్యూఢిల్లీ:** ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే ఖచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. మిచెల్ స్టార్క్ (4/40) అద్భుత బౌలింగ్‌కు తోడు కెఎల్ రాహుల్ (42 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 56), అభిషేక్ పోరెల్ (31 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 51) సత్తా చాటడంతో సొంతగడ్డపై ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై విజయం సాధించింది. రాజస్థాన్ ఇచ్చిన 194 పరుగుల లక్ష్యాన్ని 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.
ఓపెనర్లు రాహుల్, పోరెల్ తొలి వికెట్‌కు 61 బంతుల్లోనే 105 పరుగులు జోడించి బలమైన పునాది వేశారు. కానీ, సాహిల్ పరాఖ్ (9), ట్రిస్టన్ స్టబ్స్ (4), డేవిడ్ మిల్లర్ (9)ను వెంటవెంటనే ఔట్ చేసిన రాయల్స్ బౌలర్లు ఉత్కంఠ రేపినా.. చివర్లో కెప్టెన్ అక్షర్ పటేల్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 34 నాటౌట్), ఇంపాక్ట్ ప్లేయర్ అశుతోష్ శర్మ (5 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 18 నాటౌట్) జట్టును గెలిపించారు.
తొలుత రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 193 పరుగులు చేసింది. జైస్వాల్ (12) నిరాశ పరిచినా.. ధ్రువ్ జురెల్ (40 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 53), కెప్టెన్ రియాన్ పరాగ్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 51), వైభవ్ సూర్యవంశీ (21 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 46) భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. దాంతో రాయల్స్ ఓ దశలో 14 ఓవర్లకు 160/2తో నిలిచి 230పై చిలుకు స్కోరు చేసేలా కనిపించింది. కానీ, 15వ ఓవర్‌లో పరాగ్‌తో పాటు డొనోవన్ ఫెరీరా (0), రవి సింగ్ (4)ను ఔట్ చేసిన స్టార్క్ రాజస్థాన్ నడ్డి విరిచాడు. శుభమ్ దూబే (5)ను మాధవ్ తివారీ పెవిలియన్ చేర్చడంతో తీవ్ర ఒత్తిడిలో పడింది. దసున్ షనక (10) నిరాశపరిచాడు. మొత్తంగా 33 పరుగుల వ్యవధిలోనే 6 వికెట్లు కోల్పోయి లయ తప్పింది. స్టార్క్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.
43 ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ కొట్టిన సిక్సర్లు. ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్గా అభిషేక్ శర్మ (2025లో42 ) రికార్డు బ్రేక్ చేశాడు.
సంక్షిప్త స్కోర్లు : రాజస్థాన్: 20 ఓవర్లలో 193/8 (జురెల్ 53, పరాగ్ 51, స్టార్క్ 4/40);
ఢిల్లీ : 19.2 ఓవర్లలో 197/5 (రాహుల్ 56, పోరెల్ 51, ఆర్చర్ 2/35)

# బ్యాడ్మింటన్‌లో సాత్విక్- చిరాగ్‌లకు రజతం



**బ్యాంకాక్:** భారత డబుల్స్ స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రజతంతో సరిపెట్టారు. ఈ సీజన్‌లో ఆడిన తొలి ఫైనల్లో టైటిల్ కోసం అద్భుతంగా పోరాడినా.. నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని ఆశలు రేపినా చివరకు రన్నరప్‌తోనే తిరిగొచ్చారు. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ తుదిపోరులో ప్రపంచ 4వ ర్యాంకర్ సాత్విక్ చిరాగ్ ద్వయం 12–21, 23–25 తేడాతో లియో రాలీ కర్నాండో డేనియల్ మార్టిన్ (ఇండోనేషియా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. తొలి గేమ్‌లో భారత జోడీ ఆరంభం నుంచే లయ తప్పి వరుస తప్పిదాలు చేసింది. కానీ, రెండో గేమ్‌లో మాత్రం మెరుగైన ప్రదర్శన చేసింది. ఇండోనేషియా షట్లర్ మార్టిన్ తన పదునైన స్మాష్‌లతో భారత డిఫెన్స్‌ను పరీక్షించగా.. సాత్విక్ చిరాగ్ గట్టి పోటీ ఇస్తూ స్కోరును 5–5తో సమం చేశారు. ఆ తర్వాత చిరాగ్ కొట్టిన అద్భుతమైన నెట్ రిటర్న్స్‌తో 7–5తో ఆధిక్యం అందుకున్న భారత జోడీ 11–9తో విరామానికి వెళ్లింది. అయితే ఇండోనేసియా ద్వయం 14–14తో స్కోరు సమం చేసింది. ఇరు జంటలూ 19–19తో నిలిచిన దశలో ఆట అత్యంత ఉత్కంఠగా సాగింది. ఇండోనేషియా జోడీ వరుసగా మ్యాచ్ పాయింట్లపై నిలిచినా సాత్విక్ చిరాగ్ అద్భుతమైన డిఫెన్స్తో నాలుగు సార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుంటూ స్కోరును 23–23తో సమం చేసింది. అయితే ఐదో మ్యాచ్ పాయింట్ వద్ద మార్టిన్ కొట్టిన పవర్ఫుల్ షాట్ను రిటర్న్ చేసే క్రమంలో షటిల్ను నెట్కు కొట్టిన భారత జోడీ మ్యాచ్ కోల్పోయింది.

## యువతరంగం

# వీరిలో మీరు ఎవరు?

ఇంట్రోవర్ట్, ఎక్స్‌ట్రోవర్ట్, అంబివర్ట్, ఆప్టిమిస్ట్, పెస్సిమిస్ట్, రియలిస్ట్, ఐడియలిస్ట్, పర్ఫెక్షనిస్ట్, అడ్వెంచరర్, నర్చరర్, లీడర్, థింకర్ వంటి వ్యక్తిత్వ ధోరణులు మనుషుల ప్రవర్తన, ఆలోచన, నిర్ణయ ప్రక్రియలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే విభజనలు. ఇవి ఖచ్చితమైన గదులు కావు. ఎందుకంటే, ఇవి పరస్పరం మిళితంగా కనిపిస్తాయి. స్థూలంగా ఉన్న ఈ విభజనలో ఏ కోవకు చెందుతామన్నది ఎవరికివారు పరిశీలించుకొని, నిర్ధారించుకోవాలి.

**అంతర్ముఖుడు (ఇంట్రోవర్ట్)...** అంతర్ముఖుడు శక్తిని నిశ్శబ్ద వాతావరణం నుంచి పొందుతాడు. పెద్ద సమూహాల్లో ఎక్కువసేపు గడపడానికి అసహనం వ్యక్తంచేస్తాడు. ఒంటరిగా చదవడం, ఆలోచించడం, రచించడం, ప్రకృతిలో నడక చేయడం వంటి కార్యకలాపాలు అతనికి మానసిక పునరుత్థానాన్ని ఇస్తాయి. అతను తక్కువగా మాట్లాడినా లోతుగా ఆలోచిస్తాడు. విస్తృత పరిచయాల కంటే కొద్దిమంది వ్యక్తులతో గాఢమైన అనుబంధాలను నిర్మించడంపై దృష్టి పెడతాడు. సామాజికంగా చురుకుదనం తక్కువగా కనిపించినా, అతని అంతర్గత విశ్లేషణ సామర్థ్యం బలంగా ఉంటుంది. సమస్యలను తర్కబద్ధంగా పరిశీలించి, నిర్ణయానికి రావడానికి సమయం తీసుకుంటాడు. అతను మాట్లాడినప్పుడు సాధారణంగా సారవంతమైన విషయాలనే ప్రస్తావిస్తాడు.

**బహిర్ముఖుడు (ఎక్స్‌ట్రోవర్ట్)...** అంతర్ముఖుడుకు పూర్తి విరుద్ధమైన వాడు బహిర్ముఖుడు. సమూహంలో ఉండటం ద్వారా ఉత్సాహాన్ని పొందుతాడు. కొత్త వ్యక్తులతో పరిచయాలు ప్రారంభించడం, చర్చలను నడిపించడం, సామూహిక కార్యక్రమాల్లో పాల్గొనడం అతనికి సహజం. ఒంటరిగా ఎక్కువసేపు ఉండడం అతనికి నిరుత్సాహాన్ని కలిగించవచ్చు. ఇలాంటి వ్యక్తులు నాయకత్వ పాత్రల్లో, మార్కెటింగ్, బోధన, ప్రజాసంబంధాలు వంటి రంగాల్లో చురుకుగా కనిపిస్తారు. ఏ విషయమైనా త్వరగా స్పందిస్తారు, చర్చల్లో ముందుంటారు, నెట్‌వర్కింగ్ ద్వారా అవకాశాలను సృష్టించుకుంటారు. సమూహ శక్తిని సమన్వయపరచడంలో నైపుణ్యం చూపుతారు. అయితే నిరంతర సామాజిక ఉత్తేజం కొన్నిసార్లు లోతైన ఆత్మపరిశీలనకు అవకాశాన్ని తగ్గించవచ్చు. కాబట్టి బహిర్ముఖుడు కూడా నిశ్శబ్ద సమయాన్ని వినియోగించుకోవడం ద్వారా సమతుల్యత సాధించాలి.

**అంబివర్ట్...** అంబివర్ట్ అంతర్ముఖ–బహిర్ముఖ లక్షణాలను సమతుల్యంగా కలిగి ఉంటాడు. పరిస్థితి, సందర్భం, లక్ష్యానికి అనుగుణంగా తన ప్రవర్తనను మార్చుకుంటాడు. అవసరమైతే చర్చను నడిపిస్తాడు.. లేదంటే, నిశ్శబ్దంగా పరిశీలిస్తాడు. ఈ అనుకూలత సామాజిక, వృత్తి రంగాల్లో ప్రయోజనకరం. సమూహంలో మమేకం కావడానికి ఉపయోగపడుతుంది. అంబివర్ట్ ఒంటరిగా లోతైన పనిని పూర్తి చేయగలడు. ఎక్కువ మంది వ్యక్తులు పూర్తిగా ఒకే ధ్రువానికి చెందరు. అంటే, భిన్న లక్షణాలను తమలో ఇముడ్చుకుంటారు. అంబివర్ట్ లక్షణాలు కూడా అదే విధంగా, మిశ్రమ రూపం లో కనిపిస్తాయి. ఈ సమతుల్యత ఒత్తిడిని తగ్గించి, అనుకూల నిర్ణయాలకు దోహదం చేస్తుంది.

**ఆశావాది (ఆప్టిమిస్ట్)...** ఆశావాది ప్రతికూల పరిస్థితుల్లో కూడా సాధ్యమైన అవకాశాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తాడు. సమస్యలను తాత్కాలిక అవాంతరాలుగా చూసి, పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాడు. ఈ దృక్పథం మానసిక స్థిరత్వాన్ని పెంచుతుంది. ఉదాహరణకు, ఒక పరీక్షలో విఫలమైతే, ఆశావాది తన సిద్ధతను మెరుగుపరచి మళ్లీ ప్రయత్నిస్తాడు.

**నిరాశావాది (పెసిమిస్ట్)...** నిరాశావాది లేదా నైరాశ్యవాది ప్రతికూల ఫలితాలపై ఎక్కువ దృష్టి



పెడతాడు. ప్రమాదాలను ముందుగానే ఊహించి జాగ్రత్తలు తీసుకోవడంలో ఇది ఉపయోగపడవచ్చు. కానీ నిరంతర ప్రతికూల అంచనాలు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయవచ్చు. ఇలాంటి వ్యక్తులు రిస్క్ విశ్లేషణ, భద్రతా ప్రణాళికల రూపకల్పనలో సమర్థులు కావచ్చు, ఎందుకంటే వారు లోపాలను త్వరగా గుర్తిస్తారు. అయితే సమతుల్యత లేకపోతే నిర్ణయాల్లో ఆలస్యం, అవకాశాల కోల్పోవడం సంభవిస్తుంది.

**వాస్తవవాది (రియలిస్ట్)...** వాస్తవవాది పరిస్థితులను భావోద్వేగాల కంటే వాస్తవాల ఆధారంగా విశ్లేషిస్తాడు. ఏది సాధ్యం? ఏది అసాధ్యం? అని ఆలోచించి, స్పష్టతతో నిర్ణయాలు తీసుకుంటాడు. సమయపాలన, వనరుల వినియోగం, అమలు సాధ్యతపై దృష్టి పెడతాడు. సాధారణంగా కళారంగంలో వాస్తవవాదం స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవవాదం స్థిర నిర్ణయాలకు బలమైన పునాది ఇస్తుంది.

**ఐడియలిస్ట్...** ఐడియలిస్ట్ సమాజంలో న్యాయం, సమానత్వం, ధర్మం పెరగాలని ఆశిస్తాడు. ప్రస్తుత పరిస్థితులు అసంపూర్ణంగా ఉన్నా, మెరుగైన భవిష్యత్తును ఊహించి దాని కోసం కృషి చేస్తాడు. సామాజిక ఉద్యమాలు, సంస్కరణల వెనుక ఈ ధోరణి ప్రధాన ప్రేరణ. అయితే వాస్తవ పరిమితులను పరిగణనలోకి తీసుకోకపోతే నిరాశ కలగవచ్చు. కాబట్టి ఐడియలిజాన్ని వాస్తవ విశ్లేషణతో సమన్వయం చేయడం అవసరం.

**పర్ఫెక్షనిస్ట్ ...** పర్ఫెక్షనిస్ట్ ప్రతి పనిని అత్యుత్తమ ప్రమాణాలతో పూర్తి చేయాలనుకుంటాడు. సూక్ష్మ వివరాలపై శ్రద్ధ చూపుతాడు. శాస్త్రీయ పరిశోధన, ఇంజినీరింగ్, సాహిత్య సంపాదకత్వం వంటి రంగాల్లో ఈ లక్షణం ప్రయోజనకరం. అయితే లోపాల భయం పనిని ప్రారంభించడంలో ఆలస్యం కలిగించవచ్చు. పనితీరులో నాణ్యతతో పాటు సమయపాలనను కూడా సమతుల్యం చేయాలి. మతిమీరిన జాగ్రత్త వల్ల పనులు ఆలస్యమై, ఒక్కోసారి వీరు చేసిన పనులకు, సాధించిన ఘనతలకు విలువ లేకుండా పోవచ్చు.

**సాహసికుడు (అడ్వెంచరర్)...** సాహసికుడు కొత్త అనుభవాలను స్వీకరిస్తాడు. పరిచిత పరిధిని దాటి ప్రయోగాలు చేస్తాడు. ప్రయాణం, అన్వేషణ, నూతన ఆలోచనల అమలు అతని లక్షణాలు. వ్యాపారారంభాలు, సృజనాత్మక రంగాలు, పరిశోధనల్లో ఇలాంటి ధోరణి వినూత్న ఫలితాలు ఇస్తుంది. అయితే రిస్క్ నిర్వహణలో జాగ్రత్త అవసరం. ప్రణాళిక లేకుండా తీసుకున్న నిర్ణయాలు నష్టాలకు దారితీయవచ్చు.

**శ్రేయోవాది (నర్చరర్)...** నర్చరర్ ఇతరుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తాడు. సహానుభూతి, సహనం, వినగలగడం అతని ప్రధాన బలం. కుటుంబం, విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో ఈ లక్షణం కీలకం. ఇతరులకు నిరంతరం సహాయం చేస్తూ స్వీయ అవసరాలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. కాబట్టి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించుకోవాలి.

**నాయకుడు (లీడర్)...** నాయకుడు దిశను నిర్దేశిస్తాడు, బాధ్యత స్వీకరిస్తాడు, జట్టును ప్రేరేపిస్తాడు. చరిత్రలో మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా వంటి వ్యక్తులు నైతిక నాయకత్వానికి ఉదాహరణలు. స్పష్టమైన దృష్టి, సమర్థ కమ్యూనికేషన్, నిర్ణయ సామర్థ్యం నాయకత్వానికి మూలాధారాలు. నాయకత్వం పదవితో పరిమితం కాదు... ప్రవర్తనలో వ్యక్తమయ్యే బాధ్యతాభావం దాని అసలు స్వరూపం.

**ఆలోచనాపరుడు (థింకర్)...** ఆలోచనకుడు ప్రశ్నలు అడుగుతాడు, విశ్లేషిస్తాడు, సిద్ధాంతాలను నిర్మిస్తాడు. శాస్త్రం, తత్వశాస్త్రం, సాహిత్యం వంటి రంగాల్లో లోతైన పరిశీలన అతని బలం. సమస్యలను పలు కోణాల్లో పరిశీలించి వినూత్న పరిష్కారాలు సూచిస్తాడు. ఈ ధోరణి సమాజ అభివృద్ధికి మేధో పునాది ఇస్తుంది. అయితే అమలులోకి తీసుకురావడంలో ఇతరులతో సహకారం అవసరం.

# సమసమాజ స్థాపన ప్రజానాట్యమండలి లక్ష్యం

## రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** అంతరాయం లేని సమసమాజ స్థాపన ప్రజానాట్యమండలి లక్ష్యమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా నాలుగో మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 1943 మే 25 న పురుడు పోసుకున్న ప్రజానాట్యమండలి దేశ స్వాతంత్ర ఉద్యమం నుంచి మొదలుకొని నైజాం నవాబుకు గోరీ కట్టిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ఆ తర్వాత మళ్లీ దశ తెలంగాణ ఉద్యమంలో ఇలా అనేక చారిత్రాత్మక పోరాటాల్లో ముఖ్య భూమిక పోషించిందన్నారు. మూఢనమ్మకాలు, వివక్షత, మతోన్మాదం, కులోన్మాదానికి చరమగీతం పాడాలని చైతన్యవంతమైన పాటలను ప్రజలను చైతన్యం చేసిన చరిత్ర ప్రజానాట్యమండలికి ఉందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నా, నేటికి కళాకారుల సమస్యలు నెరవేరలేదన్నారు. అనేక మంది పేద కళాకారులు జీవనం కష్టంగా ఉందన్నారు. పేద కళాకారులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతరించిపోతున్న ప్రజా కళలు, గ్రామీణ సాహిత్యాన్ని బతికించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు. సమాజంలోని అన్ని రంగాల లో ఉన్న కళాకారులను గుర్తించి వారికి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అందించడంతో పాటు వారిని ఆదుకొనుటకు పెన్షన్లు ఇవ్వాలని కోరారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవమైన మే 25ను పురస్కరించుకొని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహాసభలు మే 25,26వ తేదీలలో రెండు రోజుల పాటు హైదారాబాద్‌లో జరుగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయడానికి జిల్లా నుండి పెద్ద ఎత్తున కళాకారులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటు న్న సమస్యల పరిష్కారం కోసం కళాకారులు పాటలు పాడుతున్నారని, సంస్కృతి, సాంప్రదాయాలను, సామాజిక స్పృహ కలిగించే పాటలు పాడుతూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారని, అంతరించి పోయే కళలను కనుమరుగు కాకుండా చేసేది కేవలం కళాకారులేనని, అలాంటి కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజా కళాకారులు కొంత మంది మాత్రమే ఉంటారని, కళ కాసుల కోసం కాదు ప్రజల కోసమని పాడే కళాకారులే ప్రజానాట్య మండలి వారన్నారు. జిల్లాలో అనేక మంది కళాకారులు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జానపద, యక్షగాన, బుర్ర కథ, ఒగ్గు కథ, వీధి బాగోత కళారుల బతుకులు దుర్భరంగా ఉన్నాయని ప్రభుత్వం వారిని గుర్తించాలని ఆదుకోవాలని, కళాకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇవ్వాలని కోరారు. మహాసభలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కన్నీరు మల్లేష్ పెబ్బేటి విజయుడు, సీనియర్ నాయకులు నరసింహ, వంగ గోపాల్, వాసు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, వి.రవీందర్, సలేశ్వరం, చందు, యాదగిరి, కేశవులు, గీత, సిపిఐ నాగర్‌కర్నూల్ పట్టణ నాయకులు కొత్త రామస్వామి, లింగేశ్వర శ్రీనివాస్, సురేష్, ఉషన్న గౌడ్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు. మహాసభ సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రజానాట్యమండలి కళాకారులు భారీ ప్రదర్శన నిర్వహించారు.




# బక్కారెడ్డి ఆశయసాధనకు కృషి




## సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కొణతం బక్కారెడ్డి 16వ వర్ధంతిని సోమవారం మోత్కూర్ కెఆర్ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాచికంటి లక్ష్మీ నరసయ్య హాజరై బక్కారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యానాల దామోదర్ రెడ్డి, పాసికంటి లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ బక్కారెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై యువజన సంఘంలో చేరి యువజన సమస్యలపై నిరంతరం పోరాటం చేశాడన్నారు. పార్టీ ప్రాంతీయ కార్యదర్శిగా, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర పార్టీ కౌన్సిల్ మెంబర్‌గా పనిచేసాడన్నారు. రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఈ ప్రాంతానికి పునాదిగాని కాలువ ద్వారా రైతులకు సాగునీరు, తాగునీరు అందించాలని అనేకమార్లు పాదయాత్రలు, బైకు ర్యాలీలు నిర్వహించారన్నారు. రామన్నపేట ఎమ్మెల్యేగా పోటీ చేసి 23 వేల ఓట్లు సాధించిన ఘనత బక్కారెడ్డికి దక్కిందన్నారు. ఈ ప్రాంతానికి బునాదిగాని ద్వారా నీళ్లు రైతులకు అందించినప్పుడే బక్కారెడ్డికి నిజమైన నివాళి అని యానాల దామోదర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సహాయకార్యదర్శి అన్నెపు వెంకట్, పుల్లకరం మల్లేష్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, పట్టణ కార్యదర్శి బోయిన ఉప్పలయ్య, తాడూరు లక్ష్మీ నరసయ్య, బిసి సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పెండం వెంకటేశ్వర్లు, పోచం కన్నయ్య, తాపీ సంఘం పట్టణ అధ్యక్షులు ఎండి పాషా, నాయకులు ఎడ్ల ఆనందు జంగలింగం బొడ్డుపల్లి వెంకన్న, ఎండి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతులకు

# లారీలు, గన్నీ బ్యాగుల కొరత తీర్చాలి : సిపిఐ




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** మొక్కజొన్న రైతులకు లారీలు, గన్ని బ్యాగుల కొరత తీర్చాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి మార్కెట్ యార్డును సందర్శించి మొక్కజొన్న వరి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. వనపర్తి మార్కెట్ యార్డులో మొక్కజొన్నలు కొనుగోలు చేయక పేరుకుపోయాయన్నారు. తూకం వేసి నెలరోజులైనా లారీలు రాక తరలించలేదని రైతులు వాటి వద్ద రాత్రి పగలు కావలి కాస్తున్నారన్నారు. మార్కెట్లో పెద్దమొత్తంలో మొక్క జొన్నలు అలాగే ఉన్నాయని గన్ని బ్యాగులు లేక కాంటాలు వేయలేదని, ఖాళీ సంచులు తెస్తే తూకం వేస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఖాళీ సంచులు కొనాలని గణపురం మండలం అప్పారెడ్డిపల్లి రైతుల నుంచి 1100 ఖాళీ సంచుల కోసం రూ.33000 వసూలు చేశారన్నారు. వరి వేరుశనగ రైతులకు ఉచితంగా ఖాళీ సంచులు ఇస్తున్నారని మొక్కజోన్న రైతుల వద్ద డబ్బులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మద్దతు ధర రూ.2400 కొంతసరుకు మాత్రమే కొన్నారని, తక్కిన వాటిని రైతులు రూ.1700లకే ప్రైవేటు వారికి అమ్ముతున్నారని మొత్తం సరుకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు లాభాలు..సామాన్యులకు కష్టాలు

## మోదీ పాలనలో కుదేలవుతున్న మధ్య తరగతి ప్రజలు

## కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి

## సిపిఐ ఆధ్వర్యంలో నిరసనలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కేంద్రంలో మోదీ పాలనలో కార్పొరేట్లకు లాభాల పంట పండుతుంటే, సామాన్యులకు కష్టాలు తప్పడం లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ విమర్శించారు. పేదలు, సామాన్యులపై బారాలు పడే గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ సత్తుపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రింగ్ సెంటర్లో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయని, దీనివలన నిత్యవసర సరుకుల ధరలు పెరిగి సామాన్యులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు బతకడం కష్టంగా మారిందని ఆవేధన వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలని దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తడికమళ్ళ యోబు, సత్తుపల్లి పట్టణ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, టౌన్ కమిటీ నాయకులు కోలేటి వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ అధ్యక్షులు చెరుకు కేశవరావు, వేంసూరు మండల నాయకులు ఎస్.కె లాల్ మహమ్మద్, ఫుట్ పాత్ వ్యాపారుల సంఘం నాయకులు ప్రభాకర్, కృష్ణ, దయామణి, మరియమ్మ, శాంతమ్మ , లక్ష్మీ, జ్యోతి, వెంకటమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి :** ప్రధాని మోదీ సంసార జీవితం గడిపితే బంగారం అవసరం, ధరల పెరుగుదల భారం తెలిసేదని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఎఐటియుసి ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. సోమవారం గోపాల్ పేట బస్టాండ్ వద్ద పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా ధర్నా చేసి నిరసన తెలిపారు. ఆటోలకు తాళ్లు కట్టి లాగుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నేతలు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచమని హామీ ఇచ్చి, ఎన్నికలు ముగియగానే ధరలు పెంచి మోదీ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు శ్రీరామ్, జె.చంద్రయ్య, గోపాల్‌పేట మండలం కార్యదర్శి మంకలి శాంతన్న, సహాయకార్యదర్శి కురుమూర్తి, పొలికెపాడు గ్రామశాఖ కార్యదర్శి బుచ్చన్న, రాములు, బాలకృష్ణ, చంద్రశేఖర్, రఘు, వెంకటేష్, బండారు వెంకటయ్య, మహేష్ పాల్గొన్నారు.





## సత్వరమే ప్రజావాణి దరఖాస్తులకు పరిష్కారం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ప్రజావాణిలో మొత్తం 68 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, జడ్‌పి సిఈఓ శిరీష, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఇఓ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మట్టి మనుషులను మహాయోధులుగా తీర్చిదిద్దిన నేల నల్లగొండ జిల్లా గ్రామాలు

### అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క



**ప్రజాపక్షం/నకిరేకల్ ( శాలిగౌరారం )**: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో నల్లగొండ జిల్లా గ్రామాలు మట్టి మనుషులను మహాయోధులుగా తీర్చిదిద్దిన నేలలుగా నిలిచాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. సిపిఐ(ఎంఎల్) జనశక్తి ఇటుకుల పహాడ్ గ్రామ సీనియర్ నాయకుడు అమరుడు నల్ల సోమయ్య 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రాత్రి శాలిగౌరారం మండలంఇటుకులపహాడ్‌లో అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించి పీడీఎస్‌యూ(విజృంభ) రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి నల్ల జగదీష్ విగ్రహానికి పూలమాల వేసి అమరులనుస్మరించుకున్నారు.ఈ సందర్భంగా బహిరంగ సభలో విమలక్క వివివి రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగన్న, ఆచార్య కట్ట భగవత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుంచే ఇటుకులపహాడ్ గ్రామానికి ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. దున్నేవానికే భూమి నినాదంతో ఎర్రజెండా నాయకత్వంలో సాగిన పోరాటాల్లో అనేక మంది అమరులయ్యారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికిరైతుకూలీ సంఘం నాయకుడు శేషరాజుపల్లి గోపి అధ్యక్షత వహించగా ఈకార్యక్రమంలో పల్స యాదగిరి,బొమ్మకంటి కొమురయ్య,బంటు రామలింగయ్య,అంబటి వెంకటేశం, బెల్లి నాగరాజు,వేముల సూరయ్య, నల్ల సోమయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అమృత్ పనులు

### మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద రూ.316 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అధికారులను, ఏజెన్సీలను ఆదేశించారు. సోమవారం పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ కె. వెంకటేశ్వర్ రావుతో కలిసి 33, 44, 45, 46, 47 వార్డుల్లో జరుగుతున్న యూజిడి పనులను ఆమె పరిశీలించారు. పనులు పూర్తయిన ప్రాంతాల్లో రిస్టోరేషన్ సక్రమంగా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సిసి రోడ్ల మధ్యలో గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదాచారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నరు. తొవ్విన ప్రాంతాల్లో వెంటనే మట్టితో పూడ్చి రోడ్లను పునరుద్ధరించాలని సూచించారు. రానున్న వర్షాకాలానికి ముందే, అలాగే పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మ్యాన్‌హోల్స్ నిర్మాణాన్ని వేగవంతం చేసి, డ్రైనేజీ నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి, ఇఇ యం. కిరణ్, డిఇలు సత్యారావు, రమాదేవి, అనిల్, మున్సిపల్ కౌన్సిలర్‌లు కుమ్మరికుంట్ల వేణు, నాగుల వాసు, గునగంటి హైమసతీష్, ఏఇ తిరుమల్లయ్య, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, రంజిత్, వర్క్ ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యత సాధనకు చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం ద్వార పట్టణ పరిధిలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.సోమవారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఆర్.పి లు ఎస్.ఎల్.ఎఫ్ ఓబిలకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళలు నిరక్షరాస్యులకు చదవడం, రాయడం మాత్రమే కాకుండా డిజిటల్ అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కమిషనర్ బి శరత్ చంద్ర మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు చట్టపరమైన అవగాహన, పౌర హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.అదేవిధంగా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత,పోషకాహారం, పట్టణ ఆరోగ్య కేంద్రాల సేవల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో .డిడిఅనిల్ కుమార్, డిఎంసి శివాజీ,టిఎం.సి శ్రీనివాస్,సిఓలు, సి.ఎల్ఆర్.పిలు,ఆర్‌పిలు,ఎస్ఎల్ఎఫ్ ఓబిలు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పాలక మండళ్లను వ్యతిరేకిస్తూ ఏఐకేఎస్ నిరసనలు

### సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రైతు సంఘం డిమాండ్




**ప్రజాపక్షం/కోదాడ:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ మే 14, 15 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డా వెంకటయ్య అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధృవకుమార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ మేరకు తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపింది. రాష్ట్ర క్యాబినెట్ ఏప్రిల్ 23, 2026న తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్రంలోని 908 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలక మండళ్లను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయంచిందని రైతు సంఘం ఆరోపించింది. ప్రతి సంఘంలో 13 మంది సభ్యులతో కూడిన పాలక మండళ్లలో అధ్యక్షులు, డైరెక్టర్లుగా పాలక కాంగ్రెస్‌కి చెందిన వ్యక్తులను నియమించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పేర్ల సేకరణ చేపట్టడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. నామినేటెడ్ వ్యవస్థకు పూర్తి స్థాయి చట్ట బద్ధత లేదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243జడ్ హెచ్ ప్రకారం ప్రాథమిక సహకార సంఘాలకు తప్పని సరిగా ఎన్నికలు నిర్వహించాల్సిందేనని స్పష్టం చేసింది. గ్రామీణ సహకార రుణ వ్యవస్థ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ వైద్యనాథన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ నివేదికలో సహకార సంఘాలను కేవలం ప్రభుత్వ అనుబంధ సంస్థలుగా కాకుండా స్వయం ప్రతిపత్తి గల ప్రజాస్వామ్య సంస్థలుగా తీర్చిదిద్దాలని సూచించిందని తెలిపారు. 2025 ఫిబ్రవరి 14న జారీ చేసిన 597 జీవో ద్వారా అధికారులతో కూడిన పర్సన్ ఇన్‌ఛార్జి కమిటిలను నియమించే ప్రయత్నం చేసిందని, దీనిని వ్యతిరేకిస్తూ సహకార సంఘాల అధ్యక్షులు హైకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం 2025 డిసెంబర్ 19న 597 జీవోను ఉపసంహరించుకుని 199 జీవో జారీ చేయడంతో పర్సన్ ఇన్‌ఛార్జి నియామకాలు నిలిచిపోయాయని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల కనకయ్య, యరగాని నాగయ్య, కొండా శేషయ్య, చెనగాని సైదులు, అనంతుల సైదులు, గుండు శ్రీను, అల్వాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## భూమి కోసం అక్కను హత్య చేసిన తమ్ముడు



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్))** : భూమికోసం సొంత అక్కను తమ్ముడు దారుణంగా హత్య చేసిన సంఘటన ఆత్మకూర్(ఎస్) మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సురిగి సైదులు తల్లి ఉన్న భూమిలో రెండు ఎకరాలు తన అక్క అంజమ్మ (50)కి రాసి ఇవ్వడంతో గత కొంత కాలంగా ఆ భూమి తనకే కావాలని గొడవ పడుతున్నాడు. అంజమ్మ తన భర్త చనిపోవడంతో అదే గ్రామంలో ఉంటున్న చెల్లెలు వద్ద ఉంటూ జీవనం సాగిస్తుంది. తన అమ్మ తనకు ఇచ్చిన రెండు ఎకరాల భూమిని చెల్లెకు చెందేలా చేస్తానని చెప్పడంతో అక్కాతమ్ముడి మధ్య మనస్పర్ధలు ఏర్పడింది. తనకు ఇవ్వకుండా చెల్లెలకు ఇస్తానని చెప్పడంతో పలుమార్లు గొడవ పడ్డాడు. పెద్దమనుషులు, పోలీస్ స్టేషన్‌లో కూడా ఈ వివాదం చేరింది. దీంతో ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. తన అక్కపై సైదులు కక్ష్య పెంచుకొని దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో తన అక్క అంజమ్మ అదే గ్రామంలో ఉపాధి హామీ పనికి కూలీగా వెళ్తుండగా దారిలో కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో అక్కడికి అక్కడే మృతి చెందింది. బంధువులు మాత్రం సైదులుతో పాటు అతని భార్య, బావమరుదుల ప్రమేయం కూడా ఉందని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా ఆసుపత్రి మార్చురికి తరలించారు.

**సంఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్‌పి కె. నరసింహ...**

భూతగాదాతో సొంత అక్కను తమ్ముడు హత్య చేసిన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎస్ఐలు మహేష్, ఐలయ్య, గోపికృష్ణలతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య జరిగిన తీరును స్థానికులను, మండల పోలీసులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది సంఘటన జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సంబంధిత తగాదాలు ఉంటే కోర్టులో లేదా పెద్దమనుషుల సమక్షంలో చట్టపరంగా పరిష్కరించుకోవాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి భౌతికదాడులు, హత్యలు చేస్తే జైలుకు వెళ్ళడం తప్పదని హెచ్చరించారు. గతంలో గరిడేపల్లి మండలంలో పొనుగోడు గ్రామంలో భూతగాదాలకు సంబంధించి జరిగిన హత్య కేసులో నలుగురు నేరస్థులకు యావజ్జీవ కారాగార శిక్ష పడిందని గుర్తు చేశారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

## రైతుల బాధలు పట్టించుకోని రేవంత్ రెడ్డి



రైతు మహాధర్నాలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ** : సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటలు రివ్యూలు చేస్తున్నానని చెబుతున్నాడని ఆ రివ్యూ లు రైతుల కోసం కాకుండా కేవలం తన రియల్ ఎస్టేట్ వ్యాపారాల లాభాల కోసమేనని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దుయ్యబట్టారు.ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కం చర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టిన రైతు మహాధర్నా కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఒకప్పుడు కేసీఆర్ సీఎం ఉన్న పుడు పంట చేతికి రావడాని కి మూడు నెలల ముందే రి వ్యూలు చేసి, కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనిపించారని కానీ ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కేవలం తమ రాజకీయ స్వలాభం కోసం పనిచేస్తున్నాడని ఆరోపించారు.హైదరాబాద్కు వచ్చిన ప్రధాని మోదీ పక్కన కూర్చుని రేవంత్ రెడ్డి రైతుల గు రించి అడగలేదని, కేవలం తన రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే అడిగారని మండిపడ్డారు. నల్లగొండ పై ప్రత్యేక దృష్టి పెట్టి, 2013లో కేవ లం 3 లక్ష ల మెట్రిక్ టన్నులుగా ఉన్న ధాన్యపు దిగుబడిని 2023 నా టికి 40 లక్షల మెట్రిక్ టన్ను లకు కేసీఆర్ పెంచారని, కరోనా కష్టకా లంలోనూ కల్లాల వ ద్దకే వచ్చి కొనుగోలు చేసిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడుతూ గుర్తు చేశారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎం పీ బడుగుల లింగయ్య యాదవ్,మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు,గాదరి కిషోర్ కుమార్,చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఒంటెద్దు నర్సింహా రెడ్డి కటికం సత్తయ్య గౌడ్,నిరంజన్ వలీ,మందడి సైది రెడ్డి,రేగట్టే మల్లి కార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరస్పర సహకారంతో నష్టనివారణ

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్



**ప్రజాపక్షం/చిట్యాలః** పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినపుడు అందులోని ఉద్యోగులు పరస్పర సహకారంతో ప్రాణ, ఆస్థి నష్టాలను నివారించుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామ పరిధిలోని వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ పరిశ్రమలో అగ్నిప్రమాదాలు జరిగినపుడు స్పందించాల్సిన తీరును పలు శాఖలు సంయుక్తంగా నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులనుద్ధేశించి మాట్లాడుతూ పరిశ్రమలలో అకస్మాత్తుగా ప్రమాదం సంభవించినపుడు పరిశ్రమల యాజమాన్యం వెంటనే స్పందించాలని, సిబ్బంది ఒకరికొకరికి సహకరించుకుంటూ తనను కాపాడుకుంటూనే అవకాశం ఉంటే ఇతరులను కాపాడాలన్నారు. యాజమాన్యాలు వెంటనే ఫైర్, వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తంచేయాలని అన్నారు. ఆయా శాఖలు సమాచారం తెలిసిన వెంటనే సాధ్యమైనంత త్వరగా సంఘటనా స్థలాలకు చేరుకోవాల్సిన బాధ్యతను వహించాలన్నారు. మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు హైదరాబాద్ నుండి ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ట శ్రీనివాస్, డిప్యూటి డిఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : వివిధ సమస్యల పై ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 51 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 32, హౌసింగ్ 5, జిల్లా సంక్షేమ శాఖ 3, మున్సిపాలిటీ 2, సర్వే ల్యాండ్ 2, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీ, ఎక్సైజ్, ఇరిగేషన్, చేనేత జౌళి, ల్లా పరిషత్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. స్టేట్ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జడ్పీ సీఈవో శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాపర్ వైర్ దొంగిలించిన వారిని పట్టుకోవడంలో అధికారులు విఫలం

**చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు రైతుల వినతి**

**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండలంలోని చింతలపాలెం గ్రామ పరిధిలో ఉన్న శివగంగ లిఫ్ట్ మోటార్లలో కాపర్ వైర్ దొంగిలించి రైతులను నష్టపరిచిన వారిని పట్టుకోవడంలో ఇరిగేషన్ అధికారులు, పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఆ ప్రాంత రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం రైతులు విలేకరులతో మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువ చేసే మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్లు దొంగతనానికి గురై ఆరు నెలలు గడిచినా అధికారులు సరైన చర్యలు తీసుకోలేదన్నారు. దీని వల్ల లిఫ్ట్ కింద ఉన్న రైతులకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోతుండడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం పంటలు వేసే సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు నీటి అవసరం అత్యవసరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఆ దొంగలను పట్టుకొని నీటి సమస్య తీరేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యరబోలు రామిరెడ్డి, పల్లె రమేష్‌రెడ్డి, కారింగుల కొండ, షేక్ రఫీ, ఎర్రబోలు వెంకట అప్పారెడ్డి, ఎర్రబాబు, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## బెట్టింగుల వ్యసనం.... అప్పులు తీర్చడానికే చైన్ స్నాచింగ్‌లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసగా మారి ఆ క్రమంలో పేరుకపోయిన రూ.1.20లక్షల అప్పులను తీర్చడమే లక్ష్యంగా వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగ గొట్టిముక్కల నాగచిన్న వెంకటేశ్వర్లు అలియాస్ గిరిని మిర్యాలగూడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముడివేముల గ్రామానికి చెందిన నాగచిన్న వెంకటేశ్వర్లు ఈజీ మనికి అలవాటు పడ్డాడు. బెట్టింగుల కోసం మొదటి తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ వద్ద మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాగి జైలుకు వెళ్లాడు. బెయిల్ మీద బయటకు వచ్చి తిరిగి ఈ ఏడాది జనవరిలో నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో చైన్ స్నాచిగ్ చేసి తప్పించుకున్నాడు. అదేవిధంగా మే 11న మిర్యాలగూడలోని మందులవారి కాలనీ వైష్ణవి హోమ్స్ సమీపంలో ఇద్దరు మహిళలు వాకింగ్ చేస్తుండగా వెంకటేశ్వర్లు బైక్ మీద వచ్చి మహిళ మెడలో నుంచి సుమారు 3తులాల బంగారు గొలుసును తెంపుకోని వెళ్లినట్లు తెలిపారు. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో సీఐ నాగభూషనరావు ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బృందాలు ఘటన స్థలంలోని సీసీ కెమెరాల పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి నిశిత పరిశోధన ద్వారా నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పాత నేరస్థుడిగా గుర్తించారు. నిందితుడు హనుమాన్ పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో మరో దొంగతనానికి రెక్కి నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వెంకటేశ్వర్లు నుచి సుమారు మూడు తులాల బంగారు పుస్తెల తాడు, ఒక యమాభా బైక్, టోపి, మాస్క్, మొబైల్ ఫోన్‌ను స్వాదీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ నాగభూషణరావు, హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుళ్లు శ్రీను, హుస్సేన్, వీరబాబు, నర్సింహా, రాజశేఖర్, ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన డిజిల్, గ్యాస్, పెట్రోల్ ధరలకు నిరసనగా సిపిఐ ఆధ్వర్యంలో గ్యాస్ బండలతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు కూడా పెట్రోల్, డిజిల్ గ్యాస్ ధరలను అమాంతం పెంచడం సరి కాదన్నారు. సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, త్రిపురం సుధాకర్‌రెడ్డి, యడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, నబీసాబ్, భద్రయ్య పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి సారూ...



ప్రజావాణిలో వినతుల వెల్లువ..
తరలివచ్చిన బాధితులు..

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :జిల్లాలోని ప్రజల సమస్యల పరిష్కారానికి సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్ని సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**ప్లాట్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలి : బాధితురాలు నక్క సంధ్య**



కుటుంబ అవసరాల కోసం తీసుకున్న అప్పు కారణంగా తమ ప్లాట్‌ను అన్యాయంగా సేల్ డీడ్ చేయించుకున్నారని,ప్లాట్ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమకు న్యాయం చేయాలని సుందర్‌నగర్‌కు చెందిన నక్క సంధ్య కలెక్టర్‌ను కోరారు.వడ్డీ వ్యాపారి చల్లా వెంకటేశ్వర్లు రూ.12 లక్షలు అప్పుగా ఇచ్చి, సెక్యూరిటీ పేరుతో 222 గజాల ప్లాట్ డాక్యుమెంట్లు తీసుకున్నాడని తెలిపారు. అప్పు మొత్తాన్ని తిరిగి చెల్లించినా ప్లాట్ విడుదల చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అధికారులు జోక్యం చేసుకుని తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**తమను పట్టించుకోవడం లేదంటూ వృద్ధురాలి ఆవేదన**



తమ ముగ్గురు కుమారులకు సమానంగా ఆస్తి పంచినా పెద్ద కుమారుడు తమను పట్టించుకోవడం లేదని ఎంజి కొత్తపల్లి గ్రామానికి చెందిన సంగటి గోపమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.ఆరోగ్యం బాగోలేని పరిస్థితిలో కనీసం భోజనం కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదని, అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

**వికలాంగుల పింఛన్ పునరుద్ధరించాలి బాధితుడు అంజిరెడ్డి**



ఫోటో సిరిగ కనిపించడం లేదనే కారణంతో గత రెండు నెలలుగా వికలాంగుల పింఛన్ నిలిపివేశారని గుమ్మల్లబావికి చెందిన ఆమనగంటి అంజిరెడ్డి కలెక్టర్‌ను కోరారు.పింఛన్ నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. అధికారులు స్పందించి బయోమెట్రిక్ ద్వారా ధృవీకరణ చేసి తనకు రావాల్సిన పింఛన్‌ను వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.



## ధరల పెంపుపై "మాస్ లైన్" ఆగ్రహం

### నిర్మల్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలపై సిపిఐ ఎంఎల్ (మాస్‌లైన్) పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసనను తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న టియూసిఐ జిల్లా కార్యదర్శి ఆర్.రామలక్ష్మణ్, పిఒడబ్ల్యు జిల్లా కార్యదర్శి కె.లక్ష్మీ పాల్గొని మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం సామాన్యుడిపై భారీ భారాన్ని మోపిందని వారు మండిపడ్డారు. ధరలు తగ్గించని పక్షంలో రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.బక్కన్న జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎస్.గంగన్నకోశాధికారి ఎండి గఫూర్, ఏఐయూకేఎస్ జిల్లా కార్యదర్శి మహేందర్, పార్టీ నాయకులు గోదావరి, విజయ గంగాధర్ పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న ముస్లాపూర్ విద్యార్థిని

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల పరిధిలోని ముస్లాపూర్ పాఠశాల విద్యార్థిని పూజ శ్రీ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన యునెస్కో కమిటీలో బెస్ట్ డెలిగేటుగా అవార్డును అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు. తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషనల్ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో భాగంగా హైదరాబాదులో మూడు రోజులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన మెదక్ జిల్లా విద్యార్థుల నుండి ముస్లాపూర్ పాఠశాల విద్యార్థి పూజిత యునెస్కో కమిటీలో టర్కీ దేశం తరపున ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అవార్డు ను, ఎంఆర్ ఏఎస్ ఎంపీ రాధ రెడ్డి, సెక్రటరీ టు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ యూపీఎస్సీ గారి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థి పూజ శ్రీను, ప్రధానోపాధ్యాయులు రమేష్, గైడ్ టీచర్ సంతోష్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలించిన ఎంపిడిఓ

### ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/పెద్దశంకరంపేట :** మండల కేంద్రంలోని చెరువులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపిడిఓ క్రాంతి కుమార్, సర్పంచ్ జంగం రేణుక ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనుల పురోగతి, కార్మికుల హాజరు, పని ప్రదేశంలో కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పని చేస్తున్న ఉపాధి హామీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకట రాములు, టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, నాయకులు జంగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సన్నద్ధతను చాటిన మాక్ ఎక్సర్‌సైజ్

### పర్యవేక్షించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం జిల్లాలో చేపట్టిన ఎక్సర్‌సైజ్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాలు విపతుత్ల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్నివిధాలుగా సమాయత్తమై ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. విపత్తుల సమయాలలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా కొనసాగాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ విపత్తుల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది కళ్లకు కట్టినట్లు ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/సిర్పూర్ (టి):** పంటలలో రసాయన ఎరువులను సమర్థవంతంగా వినియోగించాలని, అవసరమైన మేరకే యూరియాను వాడాలని శాస్త్రవేత్తలు డాక్టర్ సమీర్, డాక్టర్ సతీష్ రైతులకు సూచించారు. సిర్పూర్ (టి) మండలంలోని నావెగాం గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పత్తి, వరి, మొక్కజొన్న పంటలలో సమగ్ర పురుగుల నిర్వహణ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భూక్యా గిరీషన్, వ్యవసాయ విస్తరణ అధికారి విశాల్, గ్రామ సర్పంచ్ రాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ రూరల్ సిఐగా రహీం పాషా

**ప్రజాపక్షం/మావల :** ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయిన రహీం పాషా పోలీస్ ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అంతజేసి బాధ్యతలు స్వీకరించారు. గతంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో, అంతకు ముందు నార్నూర్ సీఐగా పనిచేసిన ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, ఆర్థిక నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడికి సన్మానం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద నూతనంగా నియమించబడిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు అనంతరావులను మండల కాంగ్రెస్ పార్టీ తరపున ఘనంగా సన్మానించామన్నారు. అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర నాయకులు, సర్పంచ్‌లు సమీర్, రాజు, చరణ్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, జనార్ధన్, రమేష్ దేవక్క, అజయ్, గణేష్, శివనాయక్, వసుంధరనాయక్, రాజిరెడ్డి, తిరుపతి, సతీష్, సంగ్యానాయక్, సందీప్, అంజుమ్ పాల్గొన్నారు.

## విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ పరిశీలన



పర్యవేక్షించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకీ షర్మిల

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ గ్రామీణ ప్రాంతంలోని వైఎస్ఆర్ కాలనీలో రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా, జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల సోమవారం స్వయంగా పరిశీలించారు. వరదలు, ప్రమాదాలువంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు చేపట్టవలసిన సహాయక చర్యలు ప్రాణ నష్టం జరగకుండా అనుసరించాల్సిన రక్షణ విధానాలపై ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఈ సదర్భంగా అద్భుతమైన ప్రదర్శనలు చేశాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీలు సంఘటనా స్థలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను లైవ్ మానిటరింగ్ చేశారు. సాంకేతికతను ఉపయోగించుకుంటూ రక్షణ చర్యలను ఎలా వేగవంతం చేయవచ్చో పరిశీలించిన అనంతరం, వారు అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖ సిబ్బంది, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, ఎన్.సి.సి. విద్యార్థులు, వైద్య సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



**ఫిట్ అండ్ ఆక్టీవ్ తెలంగాణ మారథాన్‌కు భారీ స్పందన**

**ఉత్సాహంగా సాగిన మారథాన్... ఆకట్టుకున్న యోగా ప్రదర్శనలు**

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం యోగా, వ్యాయామాలను నిత్య జీవితంగా భాగం చేసుకోవాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన ఫిట్ అండ్ ఆక్టీవ్ తెలంగాణ, మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌక్ మంచిర్యాల చౌరస్తా నుంచి ప్రారంభమైన మారథాన్ ఎన్టీర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ఎన్టీర్ మినీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యోగా, శారీరక వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నిరంతర శారీర శ్రమ వల్ల అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతిరోజు వ్యామం చేయాలని సూచించారు. యోగా, ఎక్సర్‌సైజ్‌ల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డివైఎస్‌ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఇఓ భోజన్న, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

### రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** అలియాబాద్, కంది గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్‌లు పరిశీలించారు. సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అనంతరం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు అండగా నిలుస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు భద్రత్తా సౌకర్యాలు కల్పించాలని, పోలీసు శాఖ తరపును అన్ని రకాల భద్రత పరమైన ఏర్పాట్లకు సిద్దంగా ఉన్నాయని ఎస్పీ పారితోష్ అన్నారు. రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని అక్రమంగా తెలంగా రాష్ట్రంలో విక్రయించకుండా చెక్ పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు రైతులు ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## ఉట్నూర్ రాజ కోటను సందర్శించిన ఐటిడిఎ పిఒ

**ప్రజాపక్షం/ఉట్నూర్ :** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరంద్ సోమవారం ఉదయం ఉట్నూర్ కేంద్రంలోని చారిత్రాత్మక రాజుల కోటను సందర్శించారు. ఈ సందర్భంగా కోట విశేషాలను స్థానికులను అడిగి తెలుసుకున్న ఆయన రాజుల కోట గిరిజన ప్రాంత చరిత్రకు, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కోట చరిత్ర, గిరిజన సంప్రదాయాలు ప్రపంచవ్యాప్తంగా తెలిసేలా సుందరీకరణ పనులు చేపడతామని, పర్యాటకులను ఆకర్షించే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని వెల్లడించారు. కోట పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని, గిరిజనుల చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌చే మీడియా అక్రిడిటేషన్ కార్డుల అందజేత

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలో పనిచేస్తున్నగుర్తింపు కలిగిన జర్నలిస్టులకు 202628 కాల వ్యవధి కోసం మంజూరైన తొలి విడత అక్రిడిటేషన్ కార్డులను జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవరం లాంఛనంగా అందజేశారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు నర్సింలు, భూపతి, సాయిప్రసాద్, రాందయానంద్, శ్రీకాంత్, గౌస్, మజీద్ తదితరులు కలెక్టర్ చేతుల మీదుగా కార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ పద్మశ్రీ పాల్గొన్నారు.

## ఎస్ఐహెచ్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం

### పేద విద్యార్థుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటి మేనేజ్‌మెంట్ (ఎన్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5కోట్లు మంజూరీ చేస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక, అబ్కారి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ప్రగతి ప్రణాళికలో భాగంగా ముఖ్యతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యా సంవత్సరానికి సంబంధించిన బిబిఎ, ఎంబిఎ కోర్సుల ఆడ్మిషన్‌లను లాంఛనంగా ప్రారంభించారు. పర్యాటక శాఖ రూపొందించిరిన టూరిస్ట్ గైడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామీణ యువతకు స్వయం ఉపాధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను పునఃప్రారంభించకపోవడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ, యువకులకు వృత్తిపరమైన సైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై నిలబడేలా చేయాలని ఉద్దేశంతో దశాబ్దాల క్రితం సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అర్థిక భారం పడకుండా వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మంత్రి అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక గ్రామంగామారిన యుగంలో ప్రైవేట్ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు కోర్సులకు పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విదేశీ, భాషలను కూడా నేర్చుకోవాలని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ రమణను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపి సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సిఎస్ వాణి ప్రసాద్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మెన్‌లు, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** ప్రజావాణిలో చేసిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి 101 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజావాణిలో భూభారతి 52, ఇందిరమ్మ ఇల్లు ఎనిమిది, పెన్షన్లు 9, ఇతర 32 దరఖాస్తుల స్వీకారించారు. ప్రజల నుండి స్వీకరించిన సమస్యల దరఖాస్తులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పిసిఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్, రాజేశ్వర్, డిఆర్‌డిఏ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.







**యువజన క్రీడా-పర్యాటక వారోత్సవాలకు శ్రీకారం :** మెదక్ జిల్లాలో యువజన క్రీడా, పర్యాటక వారోత్సవాలను ఈనెల 18 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. మెదక్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుంచి ధ్యాన్చంద్ స్టేడియం వరకు సాగిన రన్‌లో అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, యువజన క్రీడల అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## ఇఎపిసెట్, జెఈఈ మెయిన్స్‌లో గుండంపల్లి విద్యార్థిని జాగృతి అద్భుత ప్రతిభ



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన సలైగారి జాగృతి జాతీయ, రాష్ట్రస్థాయి ప్రవేశ పరీక్షల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి తన గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చింది. సలైగారి భోజారెడ్డి కుమార్తె అయిన జాగృతి ఇటీవల విడుదలైన తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాలలో 366 వ ర్యాంక్ సాధించి సంచలనం సృష్టించింది. కేవలం రాష్ట్రస్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమమైన జేఈఈ మేయిన్స్ పరీక్షలోనూ ఆమె తన ప్రతిభను చాటుకుంది. మేయిన్స్ పరీక్షలో 99.49 పర్సంటైజ్‌తో అత్యుతత్తమ స్కోరు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 8278వ ర్యాంక్ కైవసం చేసుకుంది. మాధినగర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిన జాగృతి తన కఠోర శ్రమ, అధ్యాపకుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా విద్యార్థిని జాగృతిని, ఆమె తల్లిదండ్రులను గ్రామస్తులు, కళాశాల యాజమాన్యం మరియు పలువురు ప్రముఖులు అభినందించారు. రాబోయే రోజుల్లో ఆమె మరిన్నీ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## కళ, సాహిత్యం, ప్రజా చైతన్యం సమాజ మార్పుకు శక్తివంతమైన ఆయుధాలు

### సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగుంట చంద్రశేఖర్

**ప్రజాపక్షం/మందమర్రి :** తెలంగాణ ప్రజానాట్యమండలి మహాసభలు ఈనెల 25,26 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగుంట చంద్రశేఖర్, ఐఎఫ్‌టిఏ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కన్నం లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఈ మహాసభల పోస్టర్‌ను నాయకులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ, సాహిత్యం, ప్రజా చైతన్యం సమాజ మార్పుకు శక్తివంతమైన ఆయుధాలని పేర్కొంటూ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలు తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఉద్యమాలకు కొత్త దిశానిర్దేశం చేయనున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరుకానున్నారని నాయకులు వెల్లడించారు. ప్రజా సాంస్కృతిక ఉద్యమాల పరిరక్షణకు ప్రజానాట్యమండలి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కామేర దుర్గారాజ్, గౌరవ అధ్యక్షులు మిట్టపల్లి పాల్, ఉపాధ్యక్షులు మామిడి గోపి, బొంకురి రామచందర్, సహాయ కార్యదర్శి బియ్యాల ఉపేందర్, కౌన్సిల్ సభ్యులు బబ్బెర రాజేందర్, మిట్టపల్లి మల్లేష్, పోతర్ల లింగయ్య పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు

### కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/భీమారం :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని భీమారం మండలం పోలంపల్లి, భీమారాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లిస్తోందని, నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. అనంతరం భీమారం మండలం అంకుశపూర్, నస్పూర్ మండల కేంద్రంలో గల రైస్ మిల్లులను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి కలెక్టర్ సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## ప్రజా సమస్యలపై సత్వర పరిష్కారం

### జిల్లా ఆదనపు కలెక్టర్ సంగీత

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించాలని జిల్లా ఆదనపు కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలోలో వచ్చిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్‌లో హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల వివరాలను తెలుసుకొని పరిష్కారం అయ్యేందుకు శాఖల అధికారులకు ఆదేశించారు. జిల్లాలో డివిజన్ వారిగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తంగా 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలక్టరేట్ 38, సంగారెడ్డి డివిజన్ 12, అందోల్ డివిజన్ 3, నారాయణఖేడ్ 19, జహీరాబాద్ 8 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



## పదో తరగతి టాపర్లకు నగదు పురస్కారం

### కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/జన్నారం :** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ ఘనంగా సత్కరించారు. ఆదివారం నిర్వహించిన విద్యావారోత్సవాల ముగింపు సమావేశంలో భాగంగా మంచిర్యాల ఐడిఓసి కలెక్టరేట్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కిష్టాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జిల్లా టాపర్ లశెట్టి శ్వేత (582 మార్కులు), రెండో స్థానం సాధించిన కట్ల సాకేత (577 మార్కులు)లను అభినందిస్తూ కలెక్టర్ ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్, షీల్డ్ అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండా రాజన్న, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, మండల విద్యాధికారి ఎన్ విజయ్ కుమార్, పాఠశాల ఎపిసి చైర్మన్ మంగ, గ్రామ ఉపసర్పంచ్ దేవపాల, రెడ్డి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పి శేఖర్, చంద్రకళ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల బ్రాంచ్ కార్యాలయంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్లు, కస్టమర్ల కోసం ఓం సాయి హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతంగా ఏర్పాటు చేశారు. అలాగే స్టార్ హెల్త్ ఆఫీసు ముందు సాధారణ ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని సహకారం అందించిన ఏజెంట్లు, సేల్స్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
మంగళవారం
19-05-2026
www.prajapaksham.in

‘ రామ్ చరణ్ హీరోగా బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించిన చిత్రం పెద్ది. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ’

రీల్



## జొన్నవిత్తుల దర్శకత్వంలో 'లలిత'

తెలుగు గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం లలిత. ఈ సినిమాను కాస్మిక్ పవర్ క్రియేట్స్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై పి.సుధీర్ రాజు, డి.వైష్ణవి నేహా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో నందిని హీరోయిన్‌గా, అభిలాష్ పీలా, అఖిల్ వివాన్ హీరోలుగా పరిచయమవుతున్నారు. లలిత చిత్రానికి సంగీతాన్ని మ్యూజికల్ ద్యుయో మణి, నాగరాజు అందిస్తున్నారు. నాగరాజు ప్రముఖ వేణువాదకుడు కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న వేణుగాన వి.శారద పురస్కారాలు అందుకోవడం విశేషం. లలిత చిత్రంలో రఘు బాబు, పృథ్వీ రాజ్, తాగుబోతు రమేష్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తన విశ్వాసం, వ్యక్తిత్వం కోసం నిలబడే ఓ మహిళ కథగా రూపొందుతున్న ఈ సామాజిక నేపథ్య చిత్రానికి గర్ల్‌ఫ్రెండ్ అంటే బానిస కాదు అనే క్యాప్షన్ ఆసక్తి కలిగిస్తోంది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని డీటెయిల్స్ మేకర్స్ వెల్లడించనున్నారు. నందిని, అభిలాష్, అఖిల్ వివాన్, రఘు బాబు, పృథ్వీ రాజ్, తాగుబోతు రమేష్, డీడీ శ్రీనివాస్, వి. ఝాన్సీ మేఘనా, సురేష్ దామరపల్లి, శ్రీవాణి త్రిపురనేని, జయశ్రీ రాచకొండ, మహేంద్రనాథ్, కిరణ్ కళ్యాణ్ కొండ, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ నాని తంగేటి, కొరియోగ్రాఫర్ శ్రేష్టి వర్మ, మ్యూజిక్ మణి, నాగరాజు, డిఒపి టి.సురేంద్ర రెడ్డి, ఎడిటర్ కె.రమేష్ , సహా నిర్మాతలు టి.సాయి చైతన్య, పి. గోపి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొల్లి రామ గోపాల్ చౌదరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వం జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు.

## 'రీంగారా.. రీంగారా' పాట ఆవిష్కరణ



విజయ్ ఆంటోని హీరోగా శశి దర్శకత్వంలో వచ్చిన 'బిచ్చగాడు' ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇక ఇన్నేళ్ల తరువాత మళ్లీ 'బిచ్చగాడు' మ్యాజిక్ రిపీట్ చేసేందుకు 'వంద దేవుళ్ళు' అనే సినిమాతో విజయ్ ఆంటోనీ, శశి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రలని పోషించారు. మదర్ సెంటిమెంట్‌తో సాగే 'అమ్మ అమ్మేగా' అనే పాట అందరినీ కదిలించింది. ఇక ఇప్పుడు ఒక రొమాంటిక్, మెలోడీ గీతాన్ని రిలీజ్ చేశారు. ఈ పాటలో లిజమోల్ జోస్, అజయ్ ధీషాన్ జంట ఆకట్టుకుంటోంది. 'రీంగారా' అంటూ సాగే ఈ పాటను భాష్య శ్రీ ఎంతో అద్భుతంగా రాశారు. ఆయన సాహిత్యం ఎంతో వినసొంపుగా ఉంది. బాలాజీ శ్రీరామ్ బాణీ ఎంతో శ్రావ్యంగా ఉంది. సంతోష్ హరిహరణ్, మానసి జి కణ్ణన్ ఆలపించిన ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంది.ఈ సినిమాకి ఎస్. బి.దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఈ మూవీని సమ్మర్ కానుకగా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

## 'సుధీర్ జోకర్'గా సుడిగాలి సుధీర్



సుడిగాలి సుధీర్ హీరోగా 'సుధీర్ జోకర్' అనే కొత్త చిత్రం రాబోతోంది. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అవ్వబోతుంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఈ రోజు సుధీర్ జోకర్ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఈ రోజు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో ప్లేయింగ్ కార్డ్స్‌తో ఉన్న సుడిగాలి సుధీర్ ఆకట్టుకుంటున్నారు. రేపు ఈ సినిమా బాంగర్ రిలీజ్‌తో పాటు ఫ్యాన్స్‌తో ఇంటరాక్షన్ కూడా జరగబోతోంది. కంప్లీట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సుధీర్ జోకర్ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని డీటెయిల్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు. సుడిగాలి సుధీర్, అయేషా, అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ తదితరులు నటిస్తున్నారు.

## బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో 'డేవిడ్ రెడ్డి'




'రా కింగ్' మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్‌పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమా రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా తెరకెక్కుతోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో రూపొందుతున్న ఈ చిత్రం నుంచి ఈ నెల 20న మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా డేవిడ్ రెడ్డి సినిమా టీజర్‌ను రిలీజ్ చేయబోతున్నారు. అలాగే ఇప్పటిదాకా రాకింగ్ స్టార్‌గా పిలవబడుతున్న మంచు మనోజ్ ఇకపై 'రా కింగ్' మంచు మనోజ్ ట్యాగ్‌తో మన ముందుకు రాబోతున్నారు. బ్రిటీష్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచిన ఒక యోధుడి తిరుగుబాటు కథగా రూపొందుతున్న డేవిడ్ రెడ్డి చిత్రంలో మంచు మనోజ్ కొత్త అవతార్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే డేవిడ్ రెడ్డి సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా మనోజ్ కు ఒక మంచి కమ్ బ్యాక్ అవుతుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. 1897 నుంచి 1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలాన్ని నేపథ్యంగా తీసుకుని డేవిడ్ రెడ్డి సినిమాను రూపొందిస్తున్నారు. మంచు మనోజ్, మరియా ర్యాబోషాప్కా, రమ్య కృష్ణ, సముద్రఖని, అభయ్ డియోల్, కాంచన, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి మ్యూజిక్ రవి బస్రూర్, డీవోపీ ఆచార్య వేణు, ఎడిటింగ్ ఉజ్వల్ కులకర్ణి, ఆర్ట్ తాళ్లూరి కృష్ణ మోహన్, యాక్షన్ సుప్రీమ్ సుందర్, వింగ్ చున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కొట్టు రవికుమార్, కాస్ట్యూమ్స్ మానస నున్న.

## 'బ్లాక్ మెయిల్' షూటింగ్ షురూ

వరుణ్ సందేశ్, జెమిని సురేష్ ప్రధాన పాత్రలలో హనుమాన్ ఫిలిం ఫ్యాక్టరీ బ్యానర్‌పై అవినాష్ కూనపరెడ్డి నిర్మాతగా శ్రీనివాస్ గుండ్రెడ్డి రచన దర్శకత్వంలో ప్రారంభమైన చిత్రం బ్లాక్ మెయిల్. పూజా కార్యక్రమాలతో హైదరాబాద్‌లోని ప్రసాద్‌లో ఈ చిత్ర ప్రారంభం ఘనంగా జరిగింది. పృథ్వీరాజ్, సమ్మెట గాంధీ, నాగ మహేష్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారు. జి.ఎస్ చక్రవర్తి రెడ్డి సినిమాటోగ్రఫీ చేస్తున్న ఈ చిత్రానికి రాఘవేంద్ర రెడ్డి ఎడిటర్‌గా చేస్తుండగా, ఎస్.వి మల్లిక్ తేజ సంగీత దర్శకుడుగా పనిచేస్తున్నారు. ఈ చిత్ర స్క్రిప్ట్ నిర్మాతల చేతుల మీదుగా దర్శకునికి అందించగా ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట క్లాప్ కొట్టారు. సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా జెమిని సురేష్ తల్లి ఎం.వెంకట సుబ్బ లక్ష్మి మొదటి షాట్ దర్శకత్వం చేశారు. ఈ కార్యక్రమానికి నటుడు రక్షిత్ అట్లూరి, నటి శ్రీలు తదితరులు హాజరై తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నటుడు వరుణ్ సందేశ్ మాట్లాడుతూ మా సినిమా బ్లాక్ మెయిల్ చిత్ర ప్రారంభానికి వచ్చిన అందరికీ థాంక్స్. నాకు దర్శకులు చాలా కాలంగా పరిచయం. ఆయన ఈ కథ చెప్పినప్పుడు మంచి కంటెంట్‌తో సినిమా వస్తుంది అని అర్థం అయింది. నిర్మాతలకు, అతిథులకు నా థాంక్స్. త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలవబోతుంది అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో నటుడు జెమిని సురేష్, సంగీత దర్శకుడు మల్లిక్ తేజ, 30 ఇయర్స్ పృథ్వీ రాజ్, నటుడు నాగ మహేష్, ఏసిపి విద్యా సాగర్, నిర్మాత అవినాష్ మాట్లాడారు.



## 29న 'త్రికాల' విడుదల



భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల' మే 29న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. హీరోయిన్ శ్రద్ధదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించగా, రాధిక–శ్రీనివాస్ నిర్మించారు. ఈ సినిమా నచ్చడంతో చాగంటి ప్రొడక్షన్ ఎల్.ఎల్.పి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే శక్తి చుట్టూ 'త్రికాల' కథ తిరుగుతుంది. భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న కొన్ని ఆధ్యాత్మిక రహస్యాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి తెరకెక్కించాం. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు 'త్రికాల' ఒక కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకం ఉంది అని తెలిపారు. హిందీ శాటిలైట్ హక్కులతో పాటు డబ్బింగ్ రైట్స్ ఫ్యాన్సీ రేటుకు అమ్ముడుపోయింది. అనంతరం 'గుంటూరు టాకీస్', 'ఏక్ మినీ కథ', 'డిక్టేటర్', 'నాగవల్లి' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'త్రికాల'తో మరోసారి విభిన్నమైన పాత్రలో కనిపించబోతోంది.

## వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



### అధికారులను ఆదేశించిన రైల్వే జిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎండాకాలం నేపథ్యంలో రైల్వే భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అగ్నిప్రమాదాల నివారణ, ట్రాక్ భద్రత, రోలింగ్ స్టాక్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆదివారం నిర్వహించిన భద్రతా సమీక్ష సమావేశంలో జనరల్ మేనేజర్ జోన్ పరిధిలోని రైళ్ల నిర్వహణ, భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్‌తో పాటు వివిధ విభాగాల ప్రధానాధికారులు పాల్గొన్నారు. విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో చేపట్టాల్సిన జాగ్రత్తలను సమీక్షించిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, అగ్నిప్రమాదాల నివారణ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. రైల్వే సిబ్బందికి తరచూ అవగాహన కల్పిస్తూ ఫైర్ సేఫ్టీ నిబంధనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఫైర్ అలర్ట్ స్మోక్ డిటెక్షన్ వ్యవస్థల నిర్వహణను పటిష్టం చేయాలని, ట్రాక్ పక్కన గస్తీని మరింత బలోపేతం చేసి అగ్నిప్రమాదాలు జరగకుండా చూడాలని చెప్పారు.రోలింగ్ స్టాక్ భద్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించిన జనరల్ మేనేజర్, బల్క్ మెటీరియల్స్ లోడింగ్ సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, అసమాన లోడింగ్‌కు అవకాశం ఇవ్వవద్దని ఆదేశించారు. పాయింట్లు, క్రాసింగ్‌ల నిర్వహణలో కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాక్ భద్రతకు సంబంధించి కేబుల్ డ్యామేజీలు, ట్రెస్పాసింగ్ ఘటనలు, బ్యారికేడింగ్ పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, యార్డ్ రీమోడలింగ్, సిగ్నల్ అప్‌గ్రేడేషన్, వంతెనలపై మార్గాల నిర్మాణం వంటి మౌలిక వసతుల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## 25న ప్రజా కళాకారుల ప్రదర్శన, బహిరంగ సభ

### తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ

ప్రజాపక్షం/హైదరాబాద్: నిరంతరం పాటలతో ప్ర జలను చైతన్యం చేస్తున్న తెలంగాణ ప్రజా నాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈ నెల 25న హైదరాబాద్‌లో ప్రజా కళాకారుల కళారూపా ల ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ తెలిపారు. హిమాయత్ నగర్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సోమవారం పి.నళిని అధ్యక్షత జరిగిన హైదరాబాద్ జిల్లా 4వ మహాసభలో పాల్గొన్నారు. ఈ సం దర్భంగా పల్లె నర్సింహ మాట్లాడుతూ 'కళ కళ కోసం కాదు. కళ ప్రజల కోసం, ప్రజా చైతన్యం కో సం' అని మొట్టమొదట నినదించిన తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహా సభలు ఈనెల 25, 26 తేదీలలో హైదరాబాద్‌లో ఘనంగా జరగనున్నాయని, ఈ సభలను జయప్రదం చేయాలని పి లుపు నిచ్చారు. నాడు దేశంలోని కళాకారులందరి సమీకరించి కళారూపాలద్వారా స్వాతంత్రోద్యమం లో, వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటంలో, నేటి తెలంగాణ పోరాటంలో పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేసిందన్నారు. పజానాట్యమండలి తెలుగు సాంస్కృతిక రంగంలో తనదైన శైలి, ఒక మలుపు తీసుకొచ్చిందని, కళ ప్రజల కోసం అనే తన ఆశయాన్ని వివిధ కళారూపాలకు, నిత్య జీవిత సమస్యలను, ఇతివృత్తాలుగా చేసి ప్రజలను చైతన్యవంతం చేసిందని తెలిపారు. ఆ క్రమంలోనే మా భూమి, ముందడుగు, పరివర్తన, సామాజిక తెలంగాణ మొదలగు నాటకాలు జీవ కళైన జానపదాలను నూతన ఇతివృత్తాలతో జనరంజకంగా చేసి ప్రదర్శనలు ఇవ్వడం ఫలితమే నేటి వెలుగు లో ఉన్న బుర్రకథ, ఒగ్గుకథ, పల్లె సుద్దులు, వీధి నాటకాలు మొదలగు కళారూపాలు వెలికితీసిందని చెప్పారు. చారిత్రాత్మకమైన తెలంగాణ సాయుధ పోరాటాన్ని తన కళారూపాల ద్వారా నీడలా పని చేసిందని. తెల ంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనీ కళాలు గళాలు తమ వీపు పై లాఠీ దెబ్బలు, డప్పు చప్పుళ్లుగా చేసి ప్రజల ఉత్తేజపరచి చైతన్యవంతులుగా చేసిందని, అంతటి మహోత్తర తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, పి.సైదులు, టి.కొమురెల్లి బాబు, టి.అరుణ్ , అనిల్, వరకల యాదయ్య, వెంకటేష్, వెంకటమ్మ, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.




## బెయిలే రూల్...
(మొదటి పేజీ తరువాయి)

నిందితులపై ఉన్నాయి. యుఎపిఎ చట్టంలోని సెక్షన్ 43డి (5) ప్రకారం బెయిల్ మంజూరుకు కఠిన పరిమితులు ఉంటాయి. అయితే ఈ సెక్షన్‌ను ఆధారంగా చేసుకుని ఎవరినైనా నిరవధికంగా జైలులో ఉంచడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 22ల ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయపరమైన హక్కులు రక్షించబడాలని పేర్కొంది. బెయిల్ రూల్ జైలు మినహాయింపు అనేది రాజ్యాంగ సూత్రం. 'నిర్దోషిత్వ భావన ప్రతి నాగరిక సమాజానికి మూలస్తంభం. యుఎపిఎ కేసుల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే కేసు పరిస్థితులను బట్టి అవసరమైతే బెయిల్ ని రాకరించే అవకాశం కూడా ఉందని స్పష్టం చేసింది.

**కెఎ నజీబ్ తీర్పు బైండింగ్**

2021లో వచ్చిన కెఎ నజీబ్ తీర్పును సుప్రీం కోర్టు మరోసారి ప్రస్తావించింది. విచారణలో అధిక ఆలస్యం జరిగితే యుఎపిఎ కేసుల్లో కూడా బెయిల్ మంజూరు చేయవచ్చని ఆ తీర్పులో పేర్కొన్న సంగతి తెలిసిందే. అదే తీర్పు దేశవ్యాప్తంగా అన్ని కోర్టులకు బైండింగ్ అని తాజా తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మాత్రమే కాకుండా సుప్రీంకోర్టు చిన్న బెంచ్‌లు కూడా ఆ తీర్పును పక్కన పెట్టలేవని పేర్కొంది. ఈ సందర్భంగా దిల్లీ అల్లర్ల కేసుకు సంబంధించిన గల్ఫిషా ఫాతిమా కేసులో వచ్చిన తీర్పుపై కూడా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ తీర్పులో కేఏ నజీబ్ నిర్ణయాన్ని సరైన రీతిలో అనుసరించలేదని వ్యాఖ్యానించింది.

## పోరుకు క్యూబన్లు సిద్ధం
(మొదటి పేజీ తరువాయి)

ముగిసినట్టే, సైనిక జోక్యానికి క్యూబా రంగం సిద్ధం చేస్తుంది, మా ప్రాణాలనైనా పణంగా పెడతాం, త్యాగాలు చేస్తామని క్యూబన్ అధికారులు నాతో చెప్పారు'' అని సిఎన్ఎన్ వ్యాసకర్త పాట్రిక్ ఓప్‌మాన్ తన నివేదికలో పేర్కొన్నారు.

''మేం సిద్ధంగా ఉన్నాం'' అని మే డే రోజు ప్రసంగంలో క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్‌దయాజ్ కానెల్ ప్రకటించారు. నే ను నా కుటుంబ సభ్యులతో పంచుకున్న అభిప్రాయాల మేర కు ప్రగాఢ విశ్వాసంతో చెబుతున్నానని కానెల్ ఆనాడు ప్రకటించారు. గడచిన గురువారం సిఐఎ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ అమెరికా అధికారిక విమానంలో క్యూబాలో పర్యటించారు. గురువారం హవానాలో రౌల్ కాస్ట్రో మనవడు రౌలిటో రోడ్రిగ్జ్ కాస్ట్రోతో సహా క్యూబా అధికారులతో సమావేశమయ్యారు. ఇది క్యూబన్ ప్రజలను ఆశ్చర్యపరచింది. ఆ తర్వాతే రౌల్ కాస్ట్రోపై అభియోగాలు మోపుతున్నారని వార్తలు రావడం ప్రారంభమైంది. ఇప్పటివరకూ క్యూబాను ఆర్థికంగా ట్రంప్ దిగ్బంధనం చేశారు. ఇరాన్‌ను కూడా హోర్ముజ్‌లో అదేవిధం గా దిగ్బంధనం చేశా రు. చమురు సరఫరాలు లేకుండా లొంగదీసుకునే వ్యూహం క్యూబాపై ట్రంప్ అమలు చేస్తున్నారు. ఇ ప్పుడు దిగ్బంధనం దశ దాటి అమెరికా–క్యూబా మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బా హాటంగా వెనిజులాలో అనుసరించిన దారుణమైన కిడ్నాప్ చ ర్యలకు ట్రంప్ క్యూబాలో సిద్ధపడితే ప్రాణత్యాగాలకు, పోరాటానికి సిద్ధంగా ఉన్నామని క్యూబన్ అధికారులు ప్రకటించా రు. రౌల్ కాస్ట్రోపై అభియోగపత్రం మోపితే అమెరికా న్యాయశాఖ అభియోగాలను గ్రాండ్ జ్యూరీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. ఫైడెల్ కాస్ట్రో మరణించిన తర్వాత తమ్ముడు రౌల్‌కాస్ట్రో క్యూబా దేశాధ్యక్షపదవి,పార్టీ పదవీ బాధ్యతలు చేపట్టి 15 సంవత్సరాలు పాలించారు. 2021లో పదవి నుండి వైదొలగారు.1959 నుండి 2008 వరకూ ఆయన క్యూబా సాయుధబలగాల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. క్యూబా అత్యున్నత నిర్ణయాత్మక విభాగం కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ క్యూబా పొలిట్‌బ్యూరోలో 1965 నుండి 2021 వరకూ ఆయన సభ్యుడుగా కొనసాగారు.

## పెన్షన్ అక్రమాలకు చెక్
(మొదటి పేజీ తరువాయి)

తొలగించేందుకు అధికారికంగా సాధ్యమవుతోంది. పూర్తిస్థాయిలో తొలగింపు కంటే ముందే మరణించిన వారి జాబితాను ఆయా ప్రాంతాల్లో ప్రకటించి వాస్తవాలను మరో సారి నిర్ధారించనున్నారు. అనంతరం గ్రామసభ నిర్వహించి జీవించి ఉన్న వారి పెన్షన్ ఎప్పటిలాగానే లబ్దిదారుల ఖాతాల్లో జమ కానుంది. తద్వారా దుర్వినియోగానికి చెక్ పడనుంది.

జిల్లాలో లబ్దిదారులు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాతీయ సామాజిక భద్రతా పథకం చేయూత క్రింద వివిధ కేటగిరీలకు చెందిన 1,13,840 మంది లబ్ధిదారులు ప్రస్తుతం జాబితా ప్రకారం ఉన్నారు. వీరిలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలతో పాటు తొమ్మిది కేటగిరీలకు చెందిన లబ్దిదారులకు ప్రయోజనం చేసూరుతోంది. వీరిలో వృద్ధాప్య పింఛన్ దారులు 42860, వింతతు 49369 ఒంటరి మహిళలు 6150 దివ్యాంగ 13101, గీత కార్మికులు 141,ఫైలేరియా వ్యాధిగ్రస్తులు 159, మూత్రపిండాల డయాలసిస్ రోగులు 249, బిడి కార్మికులు 04, ఏఆర్‌టి 1791 మంది ఉన్నారు. స్వయంగా లబ్దిదారులకే సొమ్ములు అందాలనే ఉద్దేశ్యంతో పంచాయితీలు, మున్సిపాలిపల్, పోస్టాఫిస్‌ల ద్వారా పంపిణీ చేశారు. ఆ తర్వాత బయో మెట్రిక్ విధానం అమలు చేశారు. క్రమంగా బ్యాంకు ఖాతాల ద్వారా డిజిటి విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో మరణించిన వారి పేర్లమీద కూడా బ్యాంకు ఖాతాల్లో నగదు జమలు అవుతున్నట్లు గుర్తించారు. దీంతో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఫేస్ రికగ్నైజేషన్ నమోదు చేసి లైవ్‌ఫేస్ అథెంటికేషన్ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

## వర్షాలు... వడగాలులు
(మొదటి పేజీ తరువాయి)

మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల తదితర జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఇక మరోవైపు రాష్ట్రంలో ఎండల తీవ్రత కూడా పెరగనుంది. రాబోయే మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, ఖమ్మం, పెద్దపల్లి, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. కొమురంభీం, మంచిర్యాల, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో కొన్ని రోజులు 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందన్నారు. వడగాలుల సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, తగినంత నీరు తాగాలని, తేలికపాటి దుస్తులు ధరించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడవద్దని హెచ్చరించారు.

## విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం
(మొదటి పేజీ తరువాయి)

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

విపత్తుల సమయంలో మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలి..

నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా అధికారులు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో వేగవంతమైన స్పందన, శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత అత్యంత కీలకమన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని మంత్రి సూచించారు. ఆ సమయంలో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న ఆధునిక పరికరాలను వినియోగించి, ప్రజలకు తక్షణ సేవలు అందించాలని సూచించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ఆలస్యం చేయకుండా ఘటనాస్థలికి చేరుకుని వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.

1908 హైదరాబాద్ మహావరదలు, ఇటీవలి గోదావరి కృష్ణా వరదలను ప్రస్తావిస్తూ విపత్తుల విషయంలో అప్రమత్తత ఎంత అవసరమో చరిత్ర చెబుతోందన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుండగా, పట్టణాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు.

ముందస్తు సన్నద్ధతతోనే మాక్ డ్రిల్స్..

మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా చేపడుతున్న మాక్ డ్రిల్లేనని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారం మాత్రమే ప్రజలకు చేరాలని కోరారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే ఆధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్లను ప్రత్యేక బృందాలు ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి, రెస్క్యూ కార్యకలాపాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డిఎంఎ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్ సుధీర్ బెల్‌తో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జిహెచ్ఎంసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com